

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 135 | బుధవారం | 04-11-2026 | హైదరాబాద్ Published from: **Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar** పేజీలు: 12 | వెల రూ. 5.00



నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

- రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లో పోలీసుల సంయుక్త ఆపరేషన్, నలుగురు నిందితుల అరెస్టు
- రూ.6.78 కోట్ల విలువ గల నకిలీ రూ.500 నోట్ల స్వాధీనం
- తనిఖీల్లో ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, కటింగ్ యంత్రాలను పట్టుకున్న పోలీసులు

ప్రజాపక్షం/రంగారెడ్డి

రంగారెడ్డి జిల్లాలో మంగళవారం నకిలీ కరెన్సీ చలామణి ముఠా గుట్టు రట్టయింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ ఎస్‌ఓటీ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నకిలీ కరెన్సీని ముద్రించి చలామణి చేసేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.6.78 కోట్ల విలువ కలిగిన నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా కుంట్లూర్‌లో అద్దె ఇంటిని కేంద్రంగా చేసుకుని **తరువాయి 12లో**

పూర్తిస్థాయిలో కేంద్ర పథకాల

నిధులు రాబట్టాలి

- కేటాయింపులే కాదు.. ప్రజలకు ఆశించిన ఫలితాలు అందాలి
- కేంద్ర శాఖలతో నిరంతర సమన్వయం చేసుకోవాలి: డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్



కేంద్ర ప్రభుత్వ పథకాల కింద రాష్ట్రానికి కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో రాబట్టుకోవడంతో పాటు, వాటిని సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా, నిధుల సాధనకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధుల కేటాయింపులు, వ్యయం, పెండింగ్ బిల్లులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై **తరువాయి 8లో**

తుమ్మిడిహెట్టిపై మహారాష్ట్రతో

నిరంతరం సంప్రదింపులు

- ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలి
- ఇప్పటి వరకు చేసుకున్న ఒప్పందాలు, పత్రాలు మహారాష్ట్రకు అందజేయాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన
- భూపరిహారం చెల్లించేందుకు బ్యాంకు ఖాతాల్లో నిధులు ఉంచుతామని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

తుమ్మిడిహట్టి బ్యారేజ్ పై మహారాష్ట్రతో నిరంతరం సంప్రదింపులు జరపాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ముంపునకు సంబంధించిన పూర్తి వివరాలతో డసిద్ధంగా ఉండాలని వారికి సిఎం సూచించారు. ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలు, ఇతర అంశాలకు సంబంధించిన పత్రాలను మహారాష్ట్రకు అందజేయాలని సిఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తుమ్మిడిహట్టిపై అధికారులతో సమీక్ష జరిపారు. మహారాష్ట్రతో ఇటీవల జరిపిన చర్చలు, ఇతర అంశాలపై అధికారులకు సిఎం పలు సూచనలు చేశారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇందుకోసం అవసరమైన నిధులను జాయింట్ అకౌంక్‌లో ఉంచుతామన్నారు. భూముల ముంపుపై మహారాష్ట్ర ఎలాంటి సర్వే చేయించుకున్నా తమకు అభ్యంతరంలేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర అధికారులకు కావాల్సిన సమాచారం ఎప్పటికప్పుడు అందించాలని సిఎం సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇరిగేషన్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, ఇరిగేషన్ ఈఎన్‌సి (జనరల్) రమేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో సిపిఐ ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలోని బోధి పెవిలియన్‌లో సమావేశమైంది. ప్రతినిధి బృందంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, కలవేణ శంకర్, బాల నరసింహ, బాగం హేమంతరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఉన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రితో సిపిఐ నాయకులు వివిధ అంశాలపై చర్చించి, వినతి పత్రాలు సమర్పించారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని సిఎం కోరగా, దీనిపై బుధవారం పార్టీ నాయకత్వం సమావేశమై నిర్ణయం ప్రకటిస్తామని సిపిఐ నేతలు తెలిపారు.



13 రాష్ట్రాలు, 11 కేంద్ర సంస్థలు

సైబర్ నేరగాళ్లపై ఉమ్మడి పోరు

- హైదరాబాద్‌లో జెసిసిటి - 4 సదస్సు
- అంతర్రాష్ట్ర సైబర్ నెట్‌వర్క్‌ల కట్టడిపై కీలక చర్చలు

ప్రజాపక్షం/హైదరాబాద్

సరిహద్దులు దాటి విస్తరిస్తున్న సైబర్ నేరగాళ్ల ముఠాల ఆట కట్టించేందుకు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు ఉమ్మడి కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఒక్కో కేసు ఆధారంగా దర్యాప్తు చేసే పద్ధతికి స్వస్తి పలికి, నిఘా సమాచారాన్ని పరస్పరం పంచుకుంటూ అంతర్రాష్ట్ర స్థాయిలో సమన్వయంతో దాడులు నిర్వహించాలని నిర్ణయించాయి. సైబర్ నేరాలను కేవలం బాధితుల నుంచి పోగొట్టుకున్న సొమ్మును తిరిగి రాబట్టే దశలో కాకుండా, నేరం జరగకముందే అడ్డుకునేలా వ్యూహాన్ని మార్చుకోవాలని తెలంగాణ డిజిపి సి.వి.ఆనంద్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో **తరువాయి 8లో**



బాంబు దాడులతో దద్దరిల్లిన 'ఖేష్మ్'

- ఆత్మరక్షణకోసమే పరిమిత దాడులు : అమెరికా ప్రకటన
- ఆధునిక ఆయుధాలతో ఐఆర్‌జిసి ప్రతిఘటన
- హోర్ముజ్‌లో ఎంక్యూ-9 సహా డ్రోన్లు కూల్చివేత

వాషింగ్టన్: అమెరికాలో మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభం కాక ముందుగానే ఇరాన్‌కు చెందిన కీలకమైన ఖేష్మ్ ద్వీపంపై సెంట్‌కామ్ బలగాలు దాడులు చేశాయి.అమెరికా ఎయిర్‌క్రాఫ్ట్‌పై ఐఆర్‌జిసి కాల్పులు చేసినందుకు ప్రతీకారంగా,ఆత్మరక్షణ కోసమే ఈ పరిమిత దాడులు చేసినట్లు అమెరికా ప్రకటించింది.హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఎగుమతులకు కీలకమైన ఖేష్మ్ ద్వీపంపై బాంబుదాడులు చేసినట్లు అమెరికా అధికారులు మంగళవారం సిబిఎస్(బిబిసి అమెరికా భాగస్వామి)న్యూస్‌కు తెలియజేశారు.ఈ ద్వీపంలోని అనేక ప్రాంతాలు బాంబు దాడులతో దద్దరిల్లాయని ఇరాన్ అధికారిక పత్రిక ప్రకటించిందిజలసంధి సమీపంలోని బందర్‌లెంగే నగరంలో కూడా దాడులు జరిగాయి.కాగా ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ గార్డ్స్ కార్ప్స్ **తరువాయి 8లో**

సమీకృత సేద్యంతో నిత్యాదాయం



12

- రైతులు యాసంగిలో చిరుధాన్యాలు, పశుగ్రాస పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- 'మురసు' తుఫానుతో పంట కోతలు వాయిదా వేసుకోవాలి
- రైతులకు మంత్రి తుమ్మల వెల్లడి

తీరం దాటిన 'మురసు'

- ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలో భారీ వర్షాలు
- ఈదురు గాలులకు పలు చోట్ల నేల కొరిగిన చెట్టు, విద్యుత్ స్తంభాలు
- తెలంగాణాలోనూ పలు చోట్ల ముసురు
- మూడు రోజుల పాటు భారీ వర్షాలు : ఐఎండి

హైదరాబాద్/అమరావతి

తీవ్ర తుఫాన్ 'మురసు' మంగళవారం ఉదయం 5.30 గంటలకు తీరాన్ని దాటిందని, ప్రస్తుతం దాని వెనుక భాగం తీరాన్ని దాటే ప్రక్రియ కొనసాగుతోందని వాతావరణ శాఖ అధికారి తెలిపారు. ఈ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణ తీర ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఏర్పడిన ఈ తుఫాన్, కడపటి వార్తలు అందే సమయానికి గత ఆరు గంటలుగా గంటకు 8 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ, **తరువాయి 8లో**

చొరబాటుదారులకు ఓట్లు!

హోం మంత్రి అమిత్ షా అసమర్థతకు నిదర్శనం

- ఓటరు జాబితాలో విదేశీయులు ఉన్నారంటే
- హోంమంత్రి పదవికి అమిత్‌షా అనర్హులు
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ్మ



03

ముఖం చాటేసిన వరుణుడు..

- ఎల్ నినో ప్రభావంతో అడుగంటిన భూగర్భజలాలు : ఎండిన పంటలు
- వినిపించని జలపాతాల సవ్వడి, కనిపించని పర్యాటకులు
- రాష్ట్రమంతటా కరువు ఛాయలు
- పలు గ్రామాల్లో సిపిఐ ప్రతినిధి బృందాల క్షేత్రస్థాయి పర్యటన
- రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్

బీటలు వారిన భూములు..


ప్రజాపక్షం న్యూస్‌నెట్‌వర్క్

ఎల్ నినో ప్రభావంతో దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో కరువు పరిస్థితులు ముంచుకొస్తున్నాయి. వరుణుడు ముఖం చాటేయడంతో భూములు బీటలు వారుతున్నాయి. ఉన్న నీటితో సాగు చేసిన పంట పొలాలు ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతు బిక్కమొఖం వేశాడు. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలని, నివారణ చర్యలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సిపిఐ డిమాండ్ చేసింది. మంగళవారం పలు జిల్లాలో సిపిఐ ప్రతినిధి బృందం నీరు లేక పంటలు ఎండిపోయిన, అధిక ఉష్ణోగ్రతతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించింది. రాజకీయాలకు అతీతంగా ప్రకృతి విపత్తు కారణంగా ఏర్పడిన పరిస్థితులను అధిగమించేందుకు అన్ని పార్టీలు కృషి చేయాలని పిలుపునిచ్చింది. ఖమ్మం జిల్లా కొనిజర్ల, తనికెళ్ల మండలాల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్, హసన్‌పర్తి మండలాల్లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేణ శంకర్, కామారెడ్డి జిల్లాలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ, మేడ్చల్ జిల్లా శామీర్‌పేట్ మండలంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్.బోస్ పంట పొలాలను సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితులను పరిశీలించిన సిపిఐ



ఖమ్మం జిల్లాలో...



కరీంనగర్ జిల్లాలో...

పెనుమకొండ జిల్లాలో...

మంచిర్యాల జిల్లాలో...



మేడ్చల్ జిల్లాలో...



కామారెడ్డి జిల్లాలో...

09

ఢిల్లీలో పోలీసుల బహిరంగ ధిక్కారం దేనికోసం?

శాంతి–భద్రతల పరిరక్షణ యంత్రాంగంలో ప్రధానమైన విభాగం పోలీసు వ్యవస్థ. క్రమశిక్షణ, నిష్పక్షపాతం, చట్టపాలన, అసాంఘిక శక్తుల పట్ల కాఠిన్యం, మానవ హక్కులను గౌరవించటం దానికి నిర్దేశిత కర్తవ్యాలు. అయినప్పటికీ అది రాజ్యవ్యవస్థ సాయుధ పనిముట్టు అని మరిచిపోరాదు. విలువలు దిగజారిన రాజకీయ వ్యవస్థలో అది సర్వసాధారణంగా పాలకపక్షం చెప్పుచేతల్లో పనిచేస్తూ వారి ప్రయోజనాలను రక్షిస్తూ ఉంటుంది. ఎమ్మెల్యేలు ఎంచుకున్న పోలీసు అధికారులనే ప్రభువులు వారి నియోజకవర్గాల్లో నియమించటమనే ఆనవాయితీ దీనికి నిదర్శనం. నిజాయితీపరులైన అధికారులు ఏ మారుమూల ప్రదేశాలకో లేక అప్రధాన పోస్టింగ్‌ల్లోకో పంపబడుతుంటారు. పోలీసును చట్టనిర్దేశనకు లోబడి పనిచేసే స్వతంత్ర వ్యవస్థగా సంస్కరణలు కోరే సిఫారసులు అమలుకు నోచుకోవు. రెండోవైపున, పోలీసుల్లో అసంతృప్తిని, వారి ఫిర్యాదులను, సాధకబాధకాలను చర్చించి, పరిష్కరించే అంతర్గత యంత్రాంగం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో అప్పుడప్పుడూ కొందరు పోలీసు లు తెగించి రోడ్డెక్కుతుంటారు. 2019 లో తీస్ హజారీ కోర్టు కాంప్లెక్స్ వద్ద లాయర్లతో హింసాత్మక ఘర్షణల దరిమిలా 2000మంది పోలీసు సిబ్బంది పాత ఐటిఒ హెడ్ క్వార్టర్స్ వెలుపల సమీకృతం కావటం అటువంటి ఒక పెద్ద సంఘటన. కాగా ఢిల్లీలో సోమవారం 800మంది సాధారణ పోలీసులు రోడ్డెక్కి నిరసన తెలియజేయటం ఈ కోవకే చెందుతుంది. ఎసిపి వశిష్ట, షాదర స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఒ) ఇన్‌స్పెక్టర్ అరుణ్ కుమార్ సస్పెన్షన్ ఆర్డర్లు వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అక్టోబర్ 23న షాదర పోలీసు స్టేషన్ వద్ద తోపులాటలో ఒక అడ్వొకేట్ తలపై బలమైన గాయమైన కారణంగా లాయర్‌లు నిరవధిక సమ్మెకు దిగటంతో వశిష్ట, అరుణ్‌కుమార్‌లను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. తన బదిలీకి వ్యతిరేకంగా వశిష్ట ఈ నిరసన ఆర్గనైజ్ చేయటం ఆసక్తిదాయకం. అయితే 400మంది ఎసిపిల్లో ఇద్దరు తప్ప మరెవ్వరూ బయటపడి సంఘీభావం తెలియజేయకపోవటం గమనించదగింది. ఒకచోట వాహనం పార్కింగ్ వివాదంలో అడ్వొకేట్ లలిత్ బన్సాల్‌పై దాడిచేసిన నిందితులపై చర్య తీసుకోవాలని కోరేందుకు లాయర్‌లు పోలీసు స్టేషన్‌కు వచ్చారు. చర్యకు హామీ ఇచ్చిన వశిష్ట ఆ తర్వాత నిందితులను విడుదల చేశారు.

ఢిల్లీ పోలీసులు కేంద్రప్రభుత్వ హోంమంత్రిత్వశాఖ కింద పనిచేస్తారు. దీన్ని ఉపయోగించుకుని బిజెపి మతమార్గాల్లో వారిలో రాజకీయాలు చొప్పించింది. ప్రజల నిరసన ఆందోళనల సందర్భంలో ఢిల్లీ పోలీసు పాత్ర, చర్యలు ఎప్పుడూ ప్రజలమధ్య చర్చనీయాంశాలుగానే ఉన్నాయి. జులై 26న ఢిల్లీలో యువత 'చలో పార్లమెంట్' సందర్భంలో పోలీసులు – ప్రదర్శకుల మధ్య హింసాత్మక ఘటనలు పౌరహక్కులను అణచటంలో పోలీసుల పాత్రను చర్చలోకి తెచ్చాయి. ఎందుకంటే, పోలీసులు విద్యార్థులనుంచి ఫోన్‌లు లాక్కున్నారు, పేరుతో కూడిన బ్యాడ్జీలు ధరించని వ్యక్తులను విద్యార్థులపై దాడికి ఉపయోగించారు, మేకులున్న లాఠీలు ప్రయోగించారు, పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపి గాయపరిచారు. తమ చట్టవిరుద్ధ హింసను సమర్థించుకునేందుకు విద్యార్థుల నిరసన అనుమతిలేని చట్టవిరుద్ధ ఆందోళనగా నిందించారు.

లాయర్లు, పోలీసులు మధ్య కోర్టు ఆవరణల్లో తరచూ ఘర్షణలు జరుగుతుండటం, లాయర్ల సంఘటిత నిరసనతో పోలీసులపై చర్యలు తీసుకోవటం, తమగోడు వినేవారులేరన్న మనస్తాపం కూడా పోలీసుల్లో అసంతృప్తికి హేతువవుతోంది. వీటన్నిటికి తోడు ఢిల్లీలో విద్యార్థి ప్రదర్శకులపై పోలీసుల పాశవిక దాడి (ఎవరి ఆదేశాలతో జరిగినప్పటికీ) పై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. శాంతియుత నిరసన తెలియజేయటం ఆర్టికల్స్ 14, 19, 21కింద రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన హక్కు అని నొక్కి చెప్పింది. పెల్లెట్ గన్స్ ప్రయోగించటం సహా పోలీసు పాశవికతపై ఆరోపణలపై దర్యాప్తు కూడా ఆదేశించింది. నిరాయుధులైన ప్రదర్శకులపై యువ ఐపిఎస్ అధికారులు స్వయంగా దాడిచేయటాన్ని తనుగా చూసిన మరో సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ తన బాధను బహిరంగంగా వ్యక్తం చేశారు. ''పోలీసు అధికారులనుంచి ఆశించేటటువంటి 'స్వయంగా నిర్ణయానికి వచ్చే స్వాతంత్ర్యం' అంతర్ధానమవుతున్నట్లు కనిపిస్తున్నది' అని వ్యాఖ్యానించారు. సమర్థవంతమైన పోలీసింగ్ అంటే మానవహక్కులను ఉల్లంఘించటం కాదన్నారు.

ఇనుపమేకులు అమర్చిన పొడవాటి కర్రలు, ఎలక్ట్రిక్ లాఠీలు, పెల్లెట్లు ఉపయోగించటంపై అనేక పిల్‌లు ఢిల్లీ హైకోర్టులో దాఖలైనాయి. సిసిటివి ఫుటేజి మొత్తం భద్రపరచాలని, పిల్ ఆరోపణలకు సమాధానం దాఖలు చేయాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. విద్యార్థి ప్రదర్శకులపై అనవసరంగా, మోతాదుకు మించి బలప్రయోగానికి ఒడిగట్టిన ఢిల్లీ పోలీసును స్వతంత్ర ప్రజాట్రిబ్యునల్ అభిశంసించింది.

ప్రజావిభాగాల ఆందోళనల సందర్భంలో పోలీసులు ఒత్తిడికింద పనిచేయాల్సి ఉంటుంది. అయితే వారు రూల్‌బుక్‌ను పాటించి స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటే రిస్క్ తక్కువ ఉంటుంది. కాని పోలీసు యంత్రాంగం పాలకుల ఆదేశాలకు తలవంచి వారి రాజకీయాల్లో భాగమైనప్పుడు ప్రజా అసమ్మతికి గురికాక తప్పదు. స్వాతంత్ర్యం వచ్చి 8 దశాబ్దాలు అవుతున్నా బ్రిటిష్ కాలంనాటి అణచివేత స్వభావం నుంచి పోలీసు వ్యవస్థ బయటకు రాలేదు. ఫ్రెండ్లీ పోలీసింగ్ హితవులను ఈ చెవితోవిని ఆ చెవితో వదిలేస్తున్నారు. పోలీసులకు క్రమశిక్షణ ఎంత అవసరమో చట్టాన్ని పాటించే అత్యధిక మెజారిటీ ప్రజలనుంచి గౌరవం పొందటం కూడా అంతే అవసరం.



గెలుపే లక్ష్యంగా బిజెపి 'ఓట్‌చోరీ'

ఎన్నికల్లో గెలవడానికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ 'ఓటు దొంగతనం' చేస్తోంది. ఎస్‌ఐఆర్ అవకతవకలకు వ్యతిరేకంగా ప్రతిపక్షం ఐక్యంగా ఉంది.

ఓట్ల దొంగతనం, ఎన్నికల అక్రమాల ఆరోపణలపై ప్రతిపక్ష ఇండియా కూటమి న్యూఢిల్లీలో ర్యాలీ నిర్వహించింది. ర్యాలీ విజయవంతమైంది.

- ఆర్‌జెడి అధినేత
లాలూప్రసాద్ యాదవ్

పట్టభద్రుడి ఓటు.. సమాజపు గొంతు!

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకూ విలువ ఉంటుంది. అయితే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు విలువ మరింత ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇది కేవలం ఒక అభ్యర్థి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నిక కాదు..విద్యావంతుల ఆకాంక్షలు, నిరుద్యోగ యువత ఆశలు, విద్యారంగ సమస్యలు, సామాజిక న్యాయం వంటి విస్తృత అంశాలకు ప్రాతినిధ్యం కల్పించే అవకాశం. అందుకే పట్టభద్రుల ఓటు వ్యక్తిగత పరిచయాలకు, కుల, మత, ప్రాంతీయ సమీకరణాలకు, తాత్కాలిక ప్రయోజనాలకు పరిమితం కాకూడదు. సమాజ భవిష్యత్తును ప్రభావితం చేసే నాయకత్వాన్ని ఎంచుకునే బాధ్యతగా మారాలి. నేడు ఉన్నత విద్య పూర్తిచేసిన లక్షలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. డిగ్రీలు, పిజిలు, వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసినా అర్హతలకు తగిన ఉపాధి అవకాశాలు లభించక నిరాశకు గురవుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, నియామకాల్లో పారదర్శకత, ఉద్యోగ నోటిఫికేషన్ల సకాలంలో విడుదల వంటి అంశాలు ఇప్పటికీ కీలక సవాళ్లుగానే ఉన్నాయి. ఈ సమస్యలపై ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే నాయకులు కాకుండా, శాసన మండలిలో నిరుద్యోగుల గొంతుకగా నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నించే నాయకత్వం అవసరం. ఎందుకంటే విద్యారంగ పరిస్థితి కూడా అంతే ప్రాధాన్యత కలిగినది. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత, అధ్యాపకుల ఖాళీలు, పరిశోధనలకు అవసరమైన వసతుల లేమి, ఫీజుల భారం విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సదుపాయాలు సకాలంలో అందాలి. విద్య కొందరికే అందుబాటులో ఉండే వ్యాపార వస్తువుగా కాకుండా ప్రతి ఒక్కరికీ అందాల్సిన సామాజిక హక్కుగా గుర్తించాలి. ఈ దిశగా విధానపరమైన మార్పుల కోసం పోరాడే ప్రతినిధుల అవసరం ఉంది.

అలాగే బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ వర్గాలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం సామాజిక ప్రజాస్వామ్యానికి పునాది. కులవృత్తులకు ప్రోత్సాహం, స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ, సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలపై చట్టసభల్లో నిరంతర చర్చ జరగాలి. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు గ్రంథాలయాలు, పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాలు, డిజిటల్ సదుపాయాలు అందుబాటులోకి రావాలి. మహిళలకు ఉన్నత విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబనలో సమాన అవకాశాలు కల్పించాలి. ఈ సమస్యలన్నింటినీ ఒక సమగ్ర ప్రజా ఎజెండాగా తీసుకెళ్లగల నాయకత్వమే పట్టభద్రుల ఆకాంక్షలకు నిజమైన ప్రతిబింబం అవుతుంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాలి. ఎన్నికల ముందు మాత్రమే ప్రజల మధ్యకు వచ్చేవారి కంటే, ఎన్నికల అనంతరం కూడా ప్రజల పక్షాన నిలిచేవారికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి, నిరంతర కార్యాచరణ, పోరాట నిబద్ధత అవసరం. అందువల్ల అభ్యర్థుల గత ప్రజాసేవ, సామాజిక బాధ్యత, సమస్యలపై అవగాహన, ప్రజలకు అందుబాటులో ఉండే స్వభావాన్ని పట్టభద్రులు నిశితంగా పరిశీలించాలి. కులం, మతం, ప్రాంతం, వ్యక్తిగత పరిచయాలు, తాత్కాలిక ప్రలోభాల ఆధారంగా ఓటు వేయడం వల్ల దీర్ఘకాలంలో సమాజ ప్రయోజనాలు దెబ్బతింటాయి. విద్య, ఉపాధి, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల కోసం పనిచేసే నాయకత్వాన్ని ఎన్నుకునే వేదికగా మారాలి. ప్రజల సమస్యలపై ప్రశ్నించే ధైర్యం, పరిష్కారాల కోసం పోరాడే నిబద్ధత, పదవిని ప్రజా ప్రయోజనాలకు వినియోగించే చిత్తశుద్ధి ఉన్నవారికే పట్టభద్రులు ప్రాధాన్యత ఇవ్వా లి.

కొడారి సత్యపాల్ యాదవ్, 8688139376

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ మరొక మారణకాండ!



డాక్టర్ దేవరాజు మహారాజు

1934వ సంవత్సరం అంటే జర్మనీలో నాజీలు అధికారంలోకి వచ్చిన మరుసటి సంవత్సరం అక్కడి చరిత్రకారుడు ఊరిక్ కార్స్టెం ట్ చేసిన ప్రసంగంలోని కొన్ని విషయాల్ని ఈ సందర్భంలో మనం జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుంది.

''కేవలం పరిశోధన కోసం చేసే పరిశోధన మాకు అక్కరలేదు. తెలిసిన సూక్ష్మ జీవుల సంఖ్యను పెంచడానికి మేం వైద్యశాస్త్రంలో పరిశోధనలు చేయం. ఆరోగ్యకరమైన, బలమైన జర్మనీ ప్రజల కోసమే మాకు వైద్యశాస్త్రం కావాలి. సైన్సు నేర్చుకునేది, బోధించేది ABSTRACT LAWS కనుక్కోవడానికి కాదు. ఇతర దేశాలతో జరిగే పోటీలో ముందు నిలబడటానికి మాత్రమే! గతంలో ఏం జరిగిందో చెబుతూ మేం చరిత్ర బోధించం. జర్మన్ ప్రజలకు కొన్ని సూచనలివ్వడానికి మాత్రమే చరిత్ర బోధిస్తాం!'' — ఈ రకమైన ఆలోచనా విధానంతో నాజీలు మొట్టమొదట పాఠశాలల మీద, విశ్వవిద్యాలయాల మీద, విద్యారంగం మీద దాడి చేశారు.

''అంతర్జాతీయ విజ్ఞాన శాస్త్రం మాకు అక్కరలేదు''— అన్నది ఆనాటి నాజీల ముఖ్యమైన నినాదం! సమాజాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ఇలాంటి కొన్ని నినాదాలు, విధానాలు ప్రచారం చేశారు. 'జర్మన్ తత్వం' ఉంటే చాలు – నన్నది స్థూలంగా వారి విధానమయ్యింది. ఈ విషయం అక్కడి ప్రభుత్వం ప్రకటించగానే విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు సుమారు మూడు వంతుల మంది ఉద్యోగాలు వదిలేసి వెళ్లిపోయారు. ఇతరత్రా జీవన భృతి చూసుకున్నారు. మిగిలిన ఒక వంతు మంది నాజీలకు లొంగిపోయి, బతుకు జీవుడా అనుకున్నారు. పై ప్రసంగంలోని విషయాలు ఎంత అహేతుకంగా ఉన్నాయో కొద్దిపాటి ఇంగిత జ్ఞానం ఉన్నవారికి సైతం తెలుస్తాయి కదా?

మన ప్రస్తుత దేశ నాయకులు అంటే ఆరెస్సెస్, బిజెపి వారు నూటికి నూరుపాళ్ళు విద్యారంగంలో 'భారతీయత' ఉంటే చాలునంటున్నారు. వీరు అధికారంలోకి వచ్చిన నాటి నుండి దేశంలో సైన్సుకు గడ్డుకాలం దాపురించింది. చరిత్ర వక్రీకరణకు గురి అవుతూ ఉంది. విద్వేష ప్రసంగాలు చేస్తూ జనాన్ని చీలుస్తూ ఉన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆరోగ్యం, ఆహార భద్రత, పేదరిక నిర్మూలన వంటి విషయాలపై ఏ మాత్రం దృష్టి పెట్టడంలేదు. ఆర్థికంగా దిగజారిపోయి, విదేశీ విధానంలో పూర్తిగా దెబ్బతిని ఉండి కూడా, పుంజుకుందామన్న స్పృహ లేకుండా, పునరుద్ధరణ విషయమే ఆలోచించకుండా 'హిందుత్వ' పేరుతో ద్వేష రాజకీయాలు చేస్తూ ఉన్నారు. పన్నుల భారం ఒకవైపు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి మరొకవైపు... సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఏదైనా ఒక విషయాన్ని గతంలో మన దేశం ఎలా అర్థం చేసుకుందో ఇప్పుడు ప్రతీ విద్యార్థికీ తెలియజెప్పాలన్నదే నేటి జాతీయ విద్యావిధానం! ప్రాచీన భారతీయ జ్ఞానం అంటే సాధారణ శకానికి ముందు (BCE) వచ్చిన చార్వాక, బౌద్ధ, జైన, ఆజీవక, సాంఖ్య వంటి దర్శనాల గురించి చెప్పాలి. అంతేకాని, వైదిక రుషుల గురించి చెప్పడం ఎందుకూ? వారి రచనలన్నీ తర్వాత కాలంలో సాధారణ శకం(C.E)లో వచ్చినవి కదా? భారతీయ జ్ఞానం గొప్పది. అయితే, దాన్ని నాశనంచేసి, భారతీయ మూలాలేవో భారతీయులకు తెలియకుండా చేసిన వైదిక మతాన్ని తిరగతోడి ప్రస్తుత ప్రభుత్వం గొప్పగా నిలబెట్టాలని అనుకుంటోంది. ప్రశ్న– బలపడిన ఈ కాలంలో ప్రశ్ననే ఊపిరి చేసుకుని ఈ దేశ యువత ఉద్యమిస్తున్న కాలంలో – నేటి ఈ ప్రభుత్వపు దురుద్దేశం ఎక్కువ కాలం కొనసాగదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆనాటి జర్మనీ నాజీల అడుగుజాడల్లో నడుస్తూ ఈ ప్రభుత్వం దేశంలోని విద్యావిధానాన్ని ధ్వంసం చేసింది. గతంలో వీరు చేయించిన ఎన్నో మారణకాండల్లాంటిదే – ఈ జాతీయ విద్యావిధానం NEP. దీని ఉద్దేశం ఏమిటంటే ''ప్రాచీన, వారసత్వ, శాశ్వత, భారతీయ జ్ఞానం, ఆలోచనా సరళి అవసరం'' అని! ఇందులో పద్దెనిమిది మంది ప్రాచీన రుషులను ప్రస్తావించి, భారతీయ జ్ఞానాన్ని భవిష్యత్ తరాలకోసం పెంపొందించి, పరిరక్షించి, పరిశోధనలు చేసి, మెరుగుపరచి, దాన్ని కొత్త ప్రయోజనాల కోసం వినియోగించాలి అని! ఇందుకోసం NEP లో IKSD ని కూడా ఏర్పరిచారు. IKSD అంటే – Indian Knowledge Systems division. NEP లో NEC (Non Major elective Course) ఇంకా VAC (Value added course) వంటి కోర్సు లు కూడా ప్రవేశపెట్టారు. వారి NEP కే Value లేనప్పుడు ఇంకా లోపల Value Added Courseలు పెడితే ఏం లాభం? ఇండియన్ నాలెడ్జ్ సిస్టం కింద ఒక ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (FDP) కూడా పెట్టారు. ఇవన్నీ ఆన్‌లైన్ ప్రోగ్రామ్స్. వీటిని వీడియోలతో, స్లైడ్స్‌తో నిర్వహిస్తారు. అవైనా నిర్వాహకులు తయారు చేయించి ఇచ్చినవి మాత్రమే ఉపయోగించాలి. ఇక వీటి స్థాయి ఎలా ఉందో చూడం డి– IKS: మాస్టర్ స్థాయి శిక్షకులు చెప్పిన విషయాలు ఈ విధంగా ఉన్నాయి.

1. పైథాగరస్ ఆవిష్కరణ మన భారతీయుల ఆవిష్కరణ– అని చెప్పాడు ఒక శిక్షకుడు. పైథాగరస్ 495 BCE నాటి గ్రీకు తత్త్వవేత్త కదా? ఆయన పేరుతో ఉన్నది భారతీయ ఆవిష్కరణ ఎలా అవుతుందీ?
2. మనుషులకు మూడవ కన్ను ఉంటుంది. అది యోగా చేసిన వారిలో తెరుచుకుంటుంది – ఇది మరొక మాస్టర్స్ స్థాయి శిక్షకుడు చెప్పిన విషయం.
3.హిందూ ప్రార్థనలు చేస్తే చెరకు దిగుబడి బాగా పెరుగుతుంది.
4.మంత్రోచ్చారణ వెనుక న్యూరో సైన్స్ (neuro science) ఉంది.
5. భగవద్గీతలో 'కర్మయోగ' ఉంది.
6. అంతర్గత నిశ్శబ్దపు ప్రాధాన్యత (importance of innner silence) పెంచుకోవాలి!
7. మన ప్రదర్శన కళల్లో 'నాట్యకళ' అత్యంత పురాతనమైంది. విద్యార్థులకు బోధించే – శిక్షణనిచ్చే శిక్షకుల ఆలోచనలే ఇంత అహేతుకంగా ఉంటే, ఇక భావి భారత పౌరుల స్థాయి అంధభక్తుల స్థాయేకదా?

వైదిక, బ్రాహ్మణ సంప్రదాయాలపైనే ఆరెస్సెస్ – బిజెపిలు దృష్టి సారించి, అందుకు అనుగుణంగా మన తరగతి గదులను మార్చాలని, తద్వారా రాబోయే తరాలను మార్చాలని ప్రయత్నిస్తోంది! ఉదాహరణకు చూడండి –
1. బోధనా పద్ధతుల్ని వారే నియంత్రిస్తున్నారు.
2. పరిశోధనాంశాలను వారే నిర్ణయిస్తున్నారు.
3.భారతీయ సంస్కృతి అంటే వైదిక సంస్కృతి/బ్రాహ్మణ సంస్కృతి అని మాత్రమే ప్రస్తుత పాలకులు భావిస్తున్నారు.
4.వారి కనుసన్నల్లో మెదిలే అధికారులు వారికి వంతపాడుతున్నారు.
5. ప్రపంచానికి భౌతిక వాదం మొదటగా చెప్పింది ఈ దేశమేనన్న విషయం – ఈ దేశ ప్రజలు గుర్తుంచుకోగూడదని పాలకులు ఎత్తులు వేస్తున్నారు.



NEP లో భాగంగా వారు రూపొందించిన కోర్సుల లో ఏమేమున్నాయో ఈ దేశ ప్రజలు పూర్తిగా తెలుసుకోవాల్సి ఉంది. దాన్ని రద్దు చేయించడానికి ఉద్యమించాల్సి ఉంది 1. భగవద్గీత ! A Guide to Holistic Well Being — సంపూర్ణ మానవ శ్రేయస్సుకు భగవద్గీత ఒక మార్గదర్శి అని వారి భావన! అలాగే 2. భారత దేశాన్ని రామాయణం కోణంలో అర్థం చేయించాలని మరొక వీడియో కోర్సు ఏర్పాటు చేశారు. దాని శీర్షిక — Comprehending india Through Ramayana. 3. రామ రాజ్యానికి సంబంధించిన కోర్సు ఒకటి ఇలా ఉంది. Ideal state and Goverence in The Ramayana 4. కులాలు ఎవరూ ఏర్పాటు చేయలేదని, వారు చేపట్టిన వృత్తుల వల్ల అవి సహజంగా ఏర్పడ్డాయని ఆ కోర్సులో బోధిస్తున్నారు. 5. కుల వివక్ష ఈ వ్యవస్థ నుండి పుట్టలేదన్నది వారి వాదన ! ఇకపోతే 6. Vedic Philosophy — ని కళాశాలల్లో పాఠ్యాంశంగా నేరుగా జొప్పించడానికి 'సిద్ధాంత ఫౌండేషన్' అనే ప్రయివేటు సంస్థకు బాధ్యతను ఇచ్చి, కరికులమ్ కంటెంట్‌ను ఏర్పాటు చేయమన్నారు. వారికి 70 లక్షల నిధిని సమకూర్చారు. ఈ కోర్సులకు మెటీరియల్ తయారు చేయడానికి సంస్కృత విశ్వవిద్యాలయాలకు, సిద్ధాంత ఫౌండేషన్ లాంటి ప్రయివేటు సంస్థలకు సబ్‌కాంట్రాక్ట్ ఇచ్చారు. మళ్ళీ ఇదొక వ్యాపారం! ఇంతకూ ఈ సిద్ధాంత ఫౌండేషన్‌కు లోగడ ఏం అనుభవముంది? అని వెతికి చూస్తే, తెలిసిందేమంటే, ఇది లోగడ ఆగ్రో కెమికల్స్ తయారు చేసే కంపని. డబ్బులు దండుకోవడానికి భారతీయ తత్త్వశాస్త్రం పై దృష్టి సారించిందన్న మాట! తమకు భజన చేసే కంపనీ అయి ఉంటుంది – అందుకే ప్రభుత్వ పెద్దలు కాంట్రాక్టు వారికిచ్చి, నిధులు సమకూర్చారన్న మాట!

మరొక వైపు, ఈ జాతీయ విద్యావిధానం — యువతపై బలవంతంగా సంస్కృతాన్ని రుద్దే ప్రయత్నం చేస్తూ ఉంది. పేపర్ లీక్ మీద ఉద్యమం చేస్తూ జెన్ జి ప్రధాని మోదీని ఉద్దేశించి విమర్శలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించిన విషయం మనకు తెలుసు. జెన్ జి వారికి సంస్కృతం రాకపోవడం వల్లనే వారు మోదీ గురించి అవాకులు చవాకులు రాసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారని NEP నిర్వాహకులు ఆరోపించారు. సంస్కృత పఠనం సాధన చేస్తే సహనం అలవడుతుందనీ, వారిలో హింసాత్మకమైన స్వభావం ఉండదని అన్నారు. ఈ నూతన విద్యావిధానంలో భాగంగా ''ఆధునిక కాలానికి సంస్కృతం యొక్క ఆవశ్యకత'' అనే అంశంపై పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహించాలని అనుకున్నారు. ప్రయత్నించారు కూడా! శీర్షిక చూడగనే ఎక్కడ వారు అక్కడే పారిపోయారు. ఆశించినంత మంది రాలేదు. దానికి నిర్వాహకులు చెప్పి న సమాధాన మేమంటే – 'జనం అశాంతితో, గందరగోళంలో ఎందుకు ఉన్నారంటే అందుకు కారణం, వారు సంస్కృతం నేర్చుకోకపోవడమే' – అని చెప్పారు. ఒకప్పుడు అధిక సంఖ్యాకులైన బహుజనులు సంస్కృత పదం ఉచ్చరిస్తేనే నాలుకలు కోసేశారే – మరి ఇప్పుడు ఏమైంది? మారిన పరిస్థితుల దృష్ట్యా ''బాబ్బాబు నేర్పుతాం! నేర్చుకోండి!!'' అని జనాల వెంట పడి బతిమిలాడినా ఎవరూ ముందుకు రావడం లేదు. ఎంతటి బలమైన ప్రభుత్వాలైనా జనం బలం ముందు దిగదుడుపే – సమాజాన్ని వెనక్కినడుపుతామంటే ఎవరూ సహకరించరు. పైగా తీవ్రంగా ప్రతిఘటిస్తారు. ఆ ప్రతిఘటనలనే మనం ప్రస్తుతం దేశంలో చూస్తున్నాం. గతంలో నీట్ పేపర్ లీక్ కారణంగా, ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఫలితంగా ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరసనలు పెల్లుబికాయి. అంటే, విద్యారంగానికి సంబంధించిన విషయంతోనే ఉద్యమాలు ఊపిరిపోసుకున్నాయి. మోదీ ప్రభుత్వం దిగొచ్చింది. అప్పటి విద్యామంత్రి రాజీనామా చేసి పారిపోయాడు. ఆ తరువాత ఇప్పుడు 'ఓట్ చోరీ' మీద (sir) ఉద్యమం నడుస్తోంది. దీని తర్వాత దేశంలో ఉన్న అనేక సమస్యలు మీద ఉద్యమాలు తలెత్తే అవకాశం ఉంది. నేటి బాల బాలికల భవిష్యత్తు, యువతీ యువకుల భవిష్యత్తు అంధకారం చేయబోయే – ఈ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ రద్దు చేయాలని కూడా ఒక ఉద్యమం ఊపందుకోవచ్చు – ఎందుకంటే, ఇది కూడా మరో మారణకాండ లాంటిదే! పౌర సమాజం ఆలోచించే యువతకు వెన్నుదన్నుగా నిలబడుతూ ఉంది!

(నేషనల్ బుక్‌ట్రస్ట్ ఇండియా సలహా సంఘ పూర్వ సభ్యుడు, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్)

మణిపూర్ రాష్ట్రంలో తుపాకీ మోతలేనా! బోసి నవ్వులు వినిపించవా?

ఒకప్పుడు ప్రకృతి అందాలకు, భిన్న జాతుల సంస్కృతీ సంప్రదాయాలకు నిలయంగా నిలిచిన మణిపూర్.. నేడు జాతుల మధ్య చిచ్చుతో అట్టుడుకుతోంది. శాంతి కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు తుపాకీ మోతలు, దాడులు, నిర్బంధాలు, నిరాశ్రయ జీవితాలే మిగులుతున్నాయి. 2023లో ప్రారంభమైన కుకీ–మైతేయి ఘర్షణల గాయాలు మానకముందే, 2026లో కుకీ–నాగా ఘర్షణలు కొత్త సంక్షోభానికి తెరతీశాయి. ఒక ప్రాంతంలో చల్లారిన ఉద్రిక్తతలు మరో ప్రాంతంలో చెలరేగుతుండటం ఆందోళనకరం. ప్రజాస్వామ్య దేశంలో ఒక రాష్ట్రం మూడేళ్లుగా అశాంతితో కొట్టుమిట్టాడుతుంటే, శాశ్వత పరిష్కారం సాధించడంలో పాలకులు ఎందుకు విఫలమవుతున్నారు? అన్నది దేశం ఆలోచించాల్సిన ప్రశ్న.

కొత్త ఘర్షణలు..అంతులేని ప్రాణనష్టం!

2023 మే 3న మణిపూర్‌లో కుకీ, మైతేయి వర్గాల మధ్య ప్రారంభమైన హింసలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది ఇళ్లు ధ్వంసమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలు, భద్రతా ఏర్పాట్లు కొనసాగుతున్నప్పటికీ సాధారణ పరిస్థితులు పూర్తిస్థాయిలో నెలకొనలేదు. ఇంతలో 2026 ఫిబ్రవరి నుంచి కుకీ–నాగా వర్గాల మధ్య కూడా ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఉఖ్రుల్, కామ్‌జోంగ్, కాంగ్‌పోక్పి, నోనీ, తమెంగ్‌లాంగ్, సేనాపతి వంటి కొండ ప్రాంతాల జిల్లాలు హింసకు కేంద్రాలుగా మారాయి.

అక్టోబర్ 16న వెలువడిన నివేదిక ప్రకారం, ఈ ఏడాది జనవరి 1 నుంచి అక్టోబర్ 10 వరకు మణిపూర్‌లో 300కు పైగా హింసాత్మక ఘటనలు, దాదాపు 100 మరణాలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లోనే కుకీ–నాగా ఘర్షణల్లో కనీసం 19 మంది మరణించినట్లు నివేదికలు వెల్లడించాయి. అక్టోబర్ 10న కామ్‌జోంగ్, ఉఖ్రుల్ జిల్లాల్లో జరిగిన తాజా ఘర్షణల్లో నూ ప్రాణనష్టం సంభవించింది. ఇళ్ల దహనం, ఆకస్మిక దాడు లు, లక్ష్యంగా చేసుకున్న హత్యలు ప్రజల్లో భయాందోళనలు పెంచుతున్నాయి.

ఈ పరిణామాలను కేవలం రెండు వర్గాల మధ్య ఘర్షణలుగా చూడలేం. గతంలో నెలకొన్న అవిశ్వాసం, భద్రతపై ఆందోళనలు, భూహక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, పరస్పర ఆరోపణలు సంక్షోభాన్ని మరింత జటిలం చేస్తున్నాయి. ఒక వర్గంపై జరిగిన దాడికి మరో వర్గం ప్రతీకారం తీర్చుకోవడం.. దానికి మళ్లీ ప్రతిదాడి జరగడం అంతులేని హింసకు దారితీస్తోంది. నేరానికి బాధ్యులెవరో నిష్పాక్షికంగా నిర్ధారించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోతే, సామూహిక నిందారోపణలతో నిర్దోషులూ బాధితులవుతారు.

రహదారుల దిగ్బంధం.. అస్తవ్యస్తమైన జనజీవనం!

మణిపూర్‌లో రహదారుల దిగ్బంధాలు, బంద్‌లు, రవాణా అంతరాయాలు ప్రజల రోజువారీ జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. అత్యవసర వైద్యం, నిత్యావసర సరుకులు, విద్యార్థుల చదువులు, చిన్న వ్యాపారాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. మార్కెట్లు మూతపడటం, వాహనాలపై దాడులు, ఇళ్లకు నిప్పుపెట్టడం వంటి ఘటనలు ప్రజల భద్రతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొనడం విచారకరం. 2026 ఏప్రిల్‌లో వెల్లడైన మణిపూర్ ప్రభుత్వ గణాంకాల ప్రకారం, 2023 మే 3 నుంచి 2026 మార్చి 30 వరకు 58,821 మంది హింస కారణంగా నిరాశ్రయులయ్యారు. పరిహార చెల్లింపుల ఆధారంగా 217 మరణాలు నమోదైనట్లు ప్రభుత్వం తెలిపింది. మార్చి 10 నాటికి 174 సహాయ శిబిరాలు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. వేలాది ఇళ్లు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ఈ గణాంకాలు పాత ఘర్షణల అమానవీయ పరిణామాలను స్పష్టం చేస్తున్నాయి. తాజా కుకీ–నాగా ఘర్షణలు ఈ సంక్షోభాన్ని మరింత విస్తరించే ప్రమాదం ఉంది. నిరాశ్రయులైన కుటుంబాలు ఎప్పుడు తమ ఇళ్లకు చేరుకుంటాయో, పిల్లలు ఎప్పుడు పాఠశాలలకు తిరిగి వెళతారో, ఉపాధి కోల్పోయినవారికి ఎప్పుడు జీవనాధారం లభిస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. అక్టోబర్‌లో మృతదేహాలను ఇంఫాల్‌లోని ముఖ్యమంత్రి నివాసం ఎదుట ఉంచి నిరసన తెలిపిన ఘటనలు ప్రజల్లో పేరుకుపోయిన ఆగ్రహాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ప్రజల ప్రాణాలను కాపాడటం, బాధితులకు న్యాయం చేయడం, నిరాశ్రయులకు పునరావాసం కల్పించడం ప్రభుత్వం కనీస ప్రాథమిక బాధ్యత.



శాంతి కోసం చిత్తశుద్ధితో చర్చలే పరిష్కారం!

మణిపూర్ సంక్షోభానికి బలప్రయోగం ఒక్కటే పరిష్కారం కాదు. భద్రతా చర్యలు అవసరమే అయినా, వాటితోపాటు రాజకీయ చొరవ, సామాజిక సామరస్యం, న్యాయబద్ధమైన పరిష్కారం తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, భద్రతా సంస్థలు, కుకీ, మైతేయి, నాగా ప్రతినిధులు ఒకే వేదికపై కూర్చొని నిరంతర చర్చలు జరపాలి. బాధిత వర్గాల ఆందోళనలను వినాలి. గత ఒప్పందాల ఉల్లంఘనలపై వచ్చిన ఆరోపణలను స్వతంత్రంగా విచారించి వాస్తవాలను ప్రజల కు వెల్లడించాలి. తప్పు చేసినవారు ఏ వర్గానికి చెందినవారైనా చట్టం ముందు సమానంగా బాధ్యత వహించాలి.

హింసాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత కల్పించడం, ఆయుధాల అక్రమ రవాణాను అరికట్టడం, సున్నిత ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం, బాధితులకు తక్షణ పరిహారం అందించడం అత్యవసరం. సహాయ శిబిరాల్లో ఆహారం, వైద్యం, పారిశుద్ధ్యం, విద్య వంటి సదుపాయాలు కల్పించాలి. నిరాశ్రయులైన కుటుంబా లు స్వచ్ఛందంగా, సురక్షితంగా తమ ఇళ్లకు తిరిగి వెళ్లేలా నమ్మకాన్ని కల్పించాలి. దాడులపై నిష్పాక్షిక దర్యాప్తు, బాధితులకు న్యాయం, దెబ్బతిన్న గ్రామాల పునర్నిర్మాణం సమాంతరంగా సాగాలి. అంతేకాదు, పౌర సమాజ సంస్థలు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, మత పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధుల ను శాంతి ప్రక్రియలో భాగస్వాములను చేయాలి. సామాజిక మాధ్యమాల్లో విద్వేష ప్రచారం, తప్పుడు వార్తలు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలి. పరస్పర అపోహలను తొలగించే ప్రజా సమావేశాలు నిర్వహించాలి. శాంతి ఒప్పందాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా లేదా అన్నది పర్యవేక్షించాలి.

మణిపూర్ ప్రజలు కోరుకుంటున్నది ఆధిపత్యం కాదు, ఆత్మగౌరవంతో కూడిన భద్రమైన జీవితం. ప్రతీకారం కాదు, న్యాయం, నిర్బంధాలు కాదు, స్వేచ్ఛగా జీవించే వాతావరణం. ప్రపంచ వేదికలపై శాంతి, అహింస గురించి మాట్లాడే మన దేశం, తనలోని ఒక రాష్ట్రంలో ప్రజలు అభద్రతలో భయాందోళనల మధ్య బతుకుతుంటే!?. మౌనంగా ఉండకూడదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాలకు అతీతం గా చిత్తశుద్ధితో వ్యవహరించాలి. మూడు వర్గాల మధ్య నమ్మకం పునరుద్ధరించాలి. చివరగా ఒక్క మాట.. ఒకరి రక్తంతో మరొకరి భవిష్యత్తును నిర్మించలేం. ప్రతీకారానికి ప్రతీకారం సమాధానం కాదు; చర్చలు, న్యాయం, పరస్పర గౌరవమే శాశ్వత శాంతికి పునాది. మణిపూర్‌లో మళ్లీ తుపాకీ మోతలు కాదు.. పిల్లల నవ్వులు వినిపించాలి.

మేకిరి దామోదర్, 9573666650.

చొరబాటుదారుల ఓట్లను తొలగించామనడం

అమిత్ షా అసమర్థతకు నిదర్శనం

- ఓటరు జాబితాలో విదేశీయులున్నారంటే హోంమంత్రి పదవికి అనర్హులు
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ్మ



ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలో మూడు కోట్ల మంది చొరబాటుదారుల ఓట్లను తొలగించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించడం ఆయన అసమర్థతకు నిదర్శనమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత మంది చొరబాటుదారులు దేశంలోకి ప్రవేశిస్తుంటే 12 ఏళ్లుగా హోంమంత్రిగా ఉన్న అమిత్ షా ఆ పదవికి అనర్హుడని, నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే ఆయన రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపికి అనుకూలంగానే సిఈసి జ్ఞానేశ్‌కుమార్ అక్రమంగా ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నారని, ఆయన తప్పిందాలను కప్పిపుచ్చేందుకే అమిత్‌షా తెలంగాణలో మహాపాదయాత్రతో నాటకానికి తెర లేపారని విమర్శించారు. కేంద్ర మంత్రి అమిత్‌షా 1 కిలో మీటర్ పాదయాత్ర కాదు కదా తెలంగాణ అంతటా మోకాళ్ల యాత్ర చేసినా ఇక్కడ ఎప్పటికీ బిజెపి గెలవబోదని నరసింహా స్పష్టం చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇ.టి.నరసింహ్మ మాట్లాడుతూ విదేశీయులు ఓటర్ల జాబితాలో ఉన్నారంటూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థించుకోవడం కాదని, నిజంగా విదేశీయుల ఓట్లు ఉంటే ఇప్పటివరకు ఎంతమందిని గుర్తించారు? ఎంత మంది పేర్లను తొలగించారు? ఏయే రాష్ట్రాల్లో ఎంతమంది చొరబాటుదారులను గుర్తించారు? అనే వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారందరినీ విదేశీయులుగా చిత్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన అన్నారు.

దేశ సంపదను కొద్ది మంది చేతుల్లో పెడుతున్న బిజెపి : బిజెపి ప్రభుత్వం దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ల చేతుల్లో కేంద్రీకరిస్తోందని, ప్రజల ఆస్తులుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు, విదేశీ సంస్థలకు అప్పగిస్తోందని నరసింహ విమర్శించారు. దేశ సంపదలో 90 శాతం కొద్దిమంది చేతుల్లోనే ఉండగా, 90 శాతం ప్రజలకు కేవలం 10 శాతం సంపద మాత్రమే దక్కుతోందని పేర్కొన్నారు. ప్రపంచ కుబేరుల జాబితాలో భారతీయులు అగ్రస్థానాల్లో ఉండటం దేశంలోని సంపద అసమానతలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు చెందాల్సిన సంపద ప్రజలకే చేరాలని స్పష్టం చేశారు. ఐడిబిఐ బ్యాంకును సుమారు రూ.52 వేల కోట్లకు విక్రయించే ప్రయత్నాలను ప్రస్తావిస్తూ, దేశ ప్రజల ఆస్తులను ఇతరుల చేతుల్లో పెట్టే విధానాలను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన కేంద్రం వాటిని విక్రయించేందుకు ఎందుకు ఉత్సాహం చూపుతోందని ఆయన ప్రశ్నించారు.

12 ఏళ్ల బిజెపి పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదు : గత 12 ఏళ్ల బిజెపి పాలనలో సామాన్య ప్రజలకు ఒరిగిందేమీలేదని, కార్పొరేట్ ప్రయోజనాలే పరిపాలనలో ప్రధాన అజెండాగా మారాయని నరసింహ విమర్శించారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాలు మొదటి నుంచీ పోరాడుతున్నాయని, ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన ప్రకటించారు. తెలంగాణలో 8 మంది ఎంపిలు ఉన్నప్పటికీ బిజెపి నిర్వహించిన సభకు ఆశించిన స్పందన రాలేదని, ప్రజల్లో ఆ పార్టీ పట్ల ఆదరణ తగ్గుతోందని అన్నారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు గోదీ మీడియా ద్వారా ప్రచారానికి దిగుతున్నారని విమర్శించారు. ప్రధాన మీడియాపై ప్రజల్లో విశ్వసనీయత తగ్గుతోందని, యూట్యూబ్ ఛానళ్ల ద్వారా ప్రత్యామ్నాయ సమాచారాన్ని ప్రజలు తెలుసుకుంటున్నారని ఆయన తెలిపారు. కేంద్రంలో ఇంకా మూడేళ్ల పాలనా కాలం ఉన్నందున మోదీ, అమిత్ షాలు ఇప్పటికైనా ప్రజా సమస్యలు, దేశ భద్రత, ఆర్థిక సమానత్వంపై దృష్టి సారించాలని హితవు పలికారు. లేదంటే బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో మొదలైన వ్యతిరేకత మరింత తీవ్రమై రాజకీయ తిరుగుబాటుగా మారుతుందని ఈ.టి.నరసింహ్మ హెచ్చరించారు.

అర్హుల ఓట్లను తొలగిస్తే సహించేది లేదు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రజల ఓటుతో చెలగాటమాడే అధికారం ఎవరికీ లేదని, ఒక్క అర్హుడి ఓటు అన్యాయంగా తొలగినా దానిని సరిదిద్దే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై స్పందించిన ఆయన, తొలగించిన ప్రతి ఓటుకు కారణం వెల్లడించాలని, సంబంధిత ఓటరుకు సమాచారం ఇచ్చి తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. పొరపాటున తొలగించిన పేర్లను తక్షణమే పునరుద్ధరించే వ్యవస్థ ఉండాలన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ప్రజాస్వామ్యానికి దిక్సూచి అని కొనియాడారు. ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఢిల్లీలో చేపట్టిన పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు ఎన్నికల జవాబుదారీతనం కోసం సాగుతున్న పోరాటంలో భాగమని పేర్కొన్నారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై వచ్చిన ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియపై వ్యక్తమవుతున్న సందేహాలకు ఎన్నికల సంఘం ఆధారాలతో సమాధానం చెప్పాలని ఉత్తమ్ కోరారు. రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠకు పారదర్శకత, జవాబుదారీతనమే రక్షణ అని స్పష్టం చేశారు.ఒక్క పౌరుడి ఓటు హక్కుకు భంగం కలిగినా ప్రశ్నిస్తామని, ప్రతి ఓటును కాపాడే రాహుల్ గాంధీ పోరాటానికి అండగా నిలుస్తామని మంత్రి ప్రకటించారు.

సింగరేణి కార్మికుల పునర్ నియామకం

గైర్హాజరుతో తొలగించిన వారు నవంబర్ 14లోగా దరఖాస్తు చేసుకోవాలి

హైపవర్ కమిటీని ఏర్పాటు చేసిన సింగరేణి యాజమాన్యం

ప్రజాపక్షం/హైదరాబాద్: సింగరేణిలో విధులకు గైర్హాజరు కారణంగా 2023 నుంచి 2025 మధ్య ఉద్యోగాల నుంచి తొలగించబడిన మాజీ కార్మికులకు తిరిగి ఉద్యోగ అవకాశం కల్పించాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వారి కేసులను పునఃపరిశీలించేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023 జనవరి 1 నుంచి 2025 డిసెంబర్ 31 మధ్య తొలగించబడిన వారు ఈ అవకాశానికి దరఖాస్తు చేసుకోవాలని సంస్థ యాజమాన్యం సూచించింది. దరఖాస్తులకు నవంబర్ 14 చివరి తేదీగా నిర్ణయించింది. 2026 ఏప్రిల్ 1 నాటికి 46 ఏళ్లలోపు లేదా 46 ఏళ్లు కలిగి ఉండాలని, ఉద్యోగం నుంచి తొలగింపునకు ముందు ఐదేళ్లలో ఏవైనా రెండేళ్లలో కనీసం 100 మస్టర్లు పూర్తి చేసి ఉండటంతో పాటు జనరల్ అసిస్టెంట్ ట్రైనీ కేటగిరీ1 పోస్టుకు వైద్యపరంగా అర్హత కలిగి ఉన్న వారు అర్హులని పేర్కొంది. ఇటీవల ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో డిస్మిస్ ఉద్యోగులకు మరో అవకాశం కల్పించాలని విజ్ఞప్తులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అర్హులైన మాజీ ఉద్యోగులు తాము చివరిగా పనిచేసిన గని లేదా విభాగాధిపతికి నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తు సమర్పించాలని యాజమాన్యం సూచించింది. ఏరియా జనరల్ మేనేజర్లు దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యల కోసం సంబంధిత అధికారులకు పంపించాలని యాజమాన్యం సూచించింది.

హైదరాబాద్ మెట్రోకు తొలి మద్దతు సిపిఐదే

సమర్థించిన వారి పాత్రను విస్మరించడం యాదృచ్ఛికమా? దౌత్యమా?

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్: మెట్రో రైలు నిర్మాణానికి తొలినాళ్లలోనే సానుకూలంగా స్పందించి, బేషరతుగా మద్దతు ప్రకటించింది సిపిఐ మాత్రమేనని పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ స్పష్టం చేశారు. మెట్రో నిర్మాణాన్ని వ్యతిరేకించిన రాజకీయ పార్టీలు, మేధావుల ఒత్తిళ్లను తట్టుకుని ముందుకు సాగిన ఎన్‌విఎస్ రెడ్డి కృషిని ప్రశంసిస్తూనే, నిర్మాణానికి మద్దతిచ్చిన సిపిఐ పాత్రను ఆయన రచనలో ప్రస్తావించకపోవడంపై నారాయణ విస్మయం వక్తం చేశారు. ఎన్‌విఎస్.రెడ్డి రచించిన 'మేఘ పథం' పుస్తకాన్ని ఆలస్యంగా చదివానని, ఇది ఆయన స్వీయచరిత్ర కంటే హైదరాబాద్ మెట్రో చరిత్రగా అభివర్ణించడం సముచితమని డాక్టర్ నారాయణ పేర్కొన్నారు. వివిధ వర్గాల అభ్యంతరాలను, రాజకీయ ఒత్తిళ్లను సమర్థంగా ఎదుర్కొని మెట్రో నిర్మాణాన్ని లక్ష్యం దిశగా నడిపించిన ఆయన పరిపాలనా దక్షత, దౌత్యనీతి ప్రశంసనీయమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సిఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో మెట్రో నిర్మాణానికి ఎల్అండ్‌టితో ఒప్పందం కుదిరిన సమయంలో మెట్రో ఎండిగా ఉన్న ఎన్‌విఎస్.రెడ్డి తనను కలిసి మద్దతు కోరారని డాక్టర్ నారాయణ గుర్తు చేశారు. భవిష్యత్తులో నగర జనాభా, ట్రాఫిక్ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని మెట్రో అవసరాన్ని గుర్తించి సిపిఐ బేషరతుగా మద్దతిచ్చిందన్నారు. మెట్రో నిర్మాణాన్ని నిలిపివేయాలని అప్పటి ప్రతిపక్ష నేత కెసిఆర్ కోరినా తాను అంగీకరించలేదని డాక్టర్ నారాయణ వెల్లడించారు. మెట్రో రైల్‌ను వ్యతిరేకించిన రాజకీయ నేతల ప్రస్తావన పుస్తకంలో ఉన్నప్పటికీ, నిర్మాణానికి మద్దతుగా నిలిచిన సిపిఐ పాత్రకు చోటు దక్కకపోవడం యాదృచ్ఛికమా? దౌత్యమా? అనేది ఎన్‌విఎస్ రెడ్డే చెప్పాలని డాక్టర్ నారాయణ ప్రశ్నించారు.



మెప్మా అదనపు సంచాలకుడి

ఆస్తులు రూ.4.75 కోట్లు!

కేసు నమోదు చేసిన ఎసిబి - 10 ప్రాంతాల్లో సోదాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) వలలో మరో ఉన్నతాధికారి చిక్కారు. మున్సిపల్ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన మిషన్ (మెప్మా) అదనపు సంచాలకుడు యాదగిరి రావు నల్లగుంట్ల ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించిన ఎసిబి, ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసింది. మంగళవారం ఆయన నివాసం, కార్యాలయం, బ్యాంకు లాకర్లు, బంధువులు, సన్నిహితులు, బినామీలకు సంబంధించిన ప్రాంతాలు మొత్తం 10 చోట్ల సోదాలు నిర్వహించింది. ప్రాథమికంగా రూ.4,75,61,171 విలువైన ఆస్తులను గుర్తించింది. ఎసిబి రంగారెడ్డి రేంజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో హైదరాబాద్, సూర్యాపేట, నల్లగొండ ప్రాంతాల్లో 12 ఓపెన్ ప్లాట్లు (రూ.58.63 లక్షలు), ఉప్పల్‌లో రెండు నివాస ఫ్లాట్లు (రూ.31.36 లక్షలు), జీ+3 అంతస్తులతో కూడిన పెంట్‌హౌస్ భవనం (సుమారు రూ.2 కోట్లు), సూర్యాపేటలో మరో ఇల్లు (రూ.4.75 లక్షలు), ఉప్పల్‌లో వాణిజ్య దుకాణం (రూ.1.06లక్షలు) గుర్తించారు. అలాగే సుమారు 1,792.2 గ్రాముల బంగారు ఆభరణాలు (రూ.33.82 లక్షలు), మూడు కిలోల వెండి (రూ.1.80 లక్షలు), టయోటా ఫార్చ్యూనర్‌తోపాటు మరో కారు (రూ.73 లక్షలు), మూడు ద్విచక్ర వాహనాలు (రూ.2.80 లక్షలు), గృహోపకరణాలు (రూ.29.08 లక్షలు), ఎలక్ట్రానిక్ వస్తువులు (రూ.7.01 లక్షలు), వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.32.30 లక్షల నిల్వలను గుర్తించారు. గుర్తించిన ఆస్తుల అధికారిక విలువ కంటే మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశముందని ఎసిబి వెల్లడించింది. మరిన్ని ఆస్తుల వివరాలపై పరిశీలన కొనసాగుతోందని తెలిపింది. అవినీతి నిరోధక చట్టం 1988లోని సెక్షన్ 13(1)(బి) రెడ్‌విత్ 13(2) కింద కేసు నమోదు చేసిన అధికారులు, నిందితుడిని హైదరాబాద్‌లోని ప్రత్యేక ఎసిబి కోర్టులో హాజరు పరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ పనులు

యుద్ధ ప్రాతిపదికన పూర్తి

జిల్లా కేంద్రంలోనే కీమో సేవలకు చర్యలు

అధికారులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పెండింగ్ పనులన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందించేందుకు హాస్పిటల్‌ను సిద్ధం చేయాలన్నారు. ''టిమ్స్ అల్వాల్, టిమ్స్ ఎల్‌బి నగర్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల'' పురోగతిపై మంత్రి దామోదర రాజనర్సింహ హైదరాబాద్‌లోని సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను త్వరలో ప్రారంభించనున్న నేపథ్యంలో హాస్పిటల్‌లో ప్రతి ఫ్లోర్‌కు చెందిన ప్లాన్‌ను మంత్రి పరిశీలించారు. తొలుత అవుట్ పేషెంట్ వైద్య సేవలు ప్రారంభించనున్న నేపథ్యంలో, ఇందుకు అవసరమైన రిజిస్ట్రేషన్ డెస్కు, ఓపీ కన్సల్టేషన్ రూములు, ఫార్మసీ, డయాగ్నస్టిక్స్ తదితర సేవలకు సంబంధించిన పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ నెల 15వ తేదీ నాటికి అవుట్ పేషెంట్ సేవలకు సంబంధించిన అన్ని పనులు పూర్తవుతాయని నిర్మాణ సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. అల్వాల్ టిమ్స్ పనులు కూడా చివరి దశలో ఉన్నాయని, ఈ ఏడాది మార్చి నాటికి ఎల్‌బి నగర్ టిమ్స్ పనులు చివర దశకు వస్తాయని అధికారులు వివరించారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఆరు ఆపరేషన్ థియేటర్లు కూడా సిద్ధమవుతాయని, ఒక్కసారి పేషెంట్ హాస్పిటల్‌కు వచ్చాక, మరో హాస్పిటల్‌కు రిఫర్ చేసే ప్రసక్తే ఉండకూడదని, అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా హాస్పిటల్‌లో సౌకర్యాలు ఉండాలని సూచించారు. ప్రభుత్వం నియమించిన వైద్యుల బృందం వరంగల్ హాస్పిటల్, అల్వాల్, కొత్తపేట టిమ్స్ హాస్పిటల్‌ను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు.

జిల్లా కేంద్రంలోనే కీమో సేవలకు చర్యలు

క్యాన్సర్ పేషెంట్లు హైదరాబాద్ వరకూ రావాల్సిన అవసరాన్ని తగ్గించి, వారికి సౌకర్యవంతంగా తమ జిల్లా కేంద్రంలోనే కీమో సేవలు అందేలా అన్ని చర్యలూ తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ డేకేర్ క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, అక్కడే కీమో థెరపీ సేవలు అందిస్తున్నామన్నారు.రీజనల్ క్యాన్సర్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించామన్నారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో కేన్సర్ పేషెంట్లకు అందుతున్న వైద్య సేవల అంశంపైన సచివాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ ఫరూఖీ, ఆరోగ్యశ్రీ సిఈఒ హనుమంతు కొండిబా, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, డిఎంఈ వాణి, ఎంఎన్‌జె కేన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ సదాశివుడు, నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాల వారీగా పేషెంట్లను మ్యాపింగ్ చేస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ హైదరాబాద్‌కే పరిమితమైన క్యాన్సర్ వైద్య సేవలను రాష్ట్రంలోని అన్ని జిల్లాలకూ విస్తరించామని, క్యాన్సర్ ప్రివెన్షన్, స్క్రీనింగ్‌పై మరింత దృష్టి సారించాలని,జనవరి నాటికి నాలుగు కొత్త మొబైల్ స్క్రీనింగ్ యూనిట్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మాట్లాడుతూ ఎంఎన్‌జె హాస్పిటల్స్, నిమ్స్ హాస్పిటల్‌లో క్యాన్సర్ పేషెంట్ల కోసం మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని, రొబోటిక్ సర్జరీలు, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్నిరకాల ఎక్విప్‌మెంట్ కూడా ఉందని వివరించారు. క్యాన్సర్ ప్రివెన్షన్, స్క్రీనింగ్, ట్రీట్‌మెంట్ విషయంలో తెలంగాణ ఆరోగ్యశాఖ తీసుకుంటున్న చర్యలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

'సర్' పేరుతో శాశ్వత అధికారం కోసం బిజెపి కుట్ర

అమిత్‌షా హైదరాబాద్‌కు కాదు.. మణిపూర్‌కు వెళ్లాల్సింది : ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎస్ఐఆర్‌ను అడ్డం పెట్టుకుని దేశంలో శాశ్వతంగా అధికారంలో ఉండాలని బిజెపి ప్రయత్నిస్తోందని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. బిజెపి ఎప్పటికీ అధికారంలో ఉంటుందన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు అహంకారానికి నిదర్శనమని అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ పర్యటనకు వచ్చిన అమిత్‌షా మణిపూర్‌కు వెళ్లి ఉంటే బాగుండేదని, అక్కడ కొనసాగుతున్న హింసాకాండపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో తొలగించిన 13.30 కోట్ల ఓట్లలో మూడు కోట్ల మంది అక్రమ వలసదారుల ఓట్లు ఉన్నాయని అమిత్‌షా చెబుతున్నారని, అంతమంది అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తే కేంద్ర హోంమంత్రిగా ఏం చర్యలు తీసుకున్నారని చామల ప్రశ్నించారు. దేశ అంతర్గత భద్రతపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఓట్ల బదిలీ కారణంగానే బిజెపి 8 ఎంపీ స్థానాలు గెలుచుకుందని ఆరోపించారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందన్న ఆశలు పెట్టుకోవద్దని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ లేవనెత్తిన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించడం, ఆయనపై విచారణ జరపడం, తొలగించిన ఓట్లను పునఃపరిశీలించి అర్హుల పేర్లను తిరిగి చేర్చడం వంటి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రాలకు నిధులు ఇస్తామనే ధోరణిని కేంద్రం విడనాడాలని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి ఆర్ఆర్ఆర్, మెట్రో రెండో దశ ప్రాజెక్టులు కీలకమని పేర్కొన్నారు. మరోవైపు, ఇఆర్‌సిప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న చామల మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు చేరడం పెట్టుబడుల పెరుగుదలకు సంకేతమన్నారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల అదనపు భారం పడుతోందని ఆరోపించారు. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ విద్యుత్, నీటి వసతులతో తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావాలని ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

రైతుకు శాపంగా మారిన ముసురు

అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం... ఆచరణలో అంతంతమాత్రం

20 రోజులుగా కేంద్రాల్లోనే ధాన్యం రాశులు

తేమ తగ్గక, తూకాలు ప్రారంభం కాకపోవడంతో రైతుల ఎదురుచూపులు



ప్రజాపక్షం/నల్లగొండ: ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితులను అధిగమించి ఆరుగాలం కష్టపడి పండించిన రైతన్నకు చివరి దశలో ముసురు వర్షాలు శాపంగా మారాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, మరోవైపు విద్యుత్ కోతలను ఎదుర్కొంటూ పంటలను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులకు ధాన్యం విక్రయించే సమయంలో కొత్త కష్టాలు ఎదురవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, దుక్కి దున్నేందుకు ట్రాక్టర్ కిరాయిలు, నాట్లు వేసేందుకు కూలీల ఖర్చులు భరించి పండించిన వరి పంటను కోసి, మద్దతు ధరకు విక్రయించాలనే ఆశతో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ రోజుల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా ప్రాంతాల్లో కొబ్బరికాయలు కొట్టి అట్టహాసంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అయితే ప్రారంభోత్సవాల హడావుడి తప్ప క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు మాత్రం ఆశించిన స్థాయిలో సాగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు 20 రోజులకుపైగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు నిల్వ ఉండిపోయాయి. తేమ శాతం తగ్గకపోవడం, ముసురు వాతావరణం కారణంగా ధాన్యం తూకాలు, కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. ఫలితంగా రైతులు తమ ధాన్యం ఎప్పుడు కొనుగోలు చేస్తారో తెలియక కేంద్రాల వద్దే నిరీక్షిస్తున్నారు.

పట్టాల కిరాయితో అదనపు భారం

ఒకవైపు ముసురు వర్షాలు, మరోవైపు కొనుగోళ్ల జాప్యంతో ధాన్యం తడిసిపోకుండా రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ధాన్యం రాశులపై కప్పేందుకు పట్టాలు తెచ్చుకోవడం,వాటికి కిరాయి చెల్లించడం రైతులకు అదనపు భారంగా మారింది. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితుల్లో రాత్రింబవళ్లు ధాన్యం రాశుల వద్ద కాపలా కాయాల్సి వస్తోంది. ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసిన రైతులు ఇప్పుడు రవాణా,పట్టాల కిరాయి, కూలీల ఖర్చులతో మరింత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రైవేటు మిల్లర్లను ఆశ్రయిస్తున్న రైతులు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కదలకపోవడంతో కొందరు రైతులు చేసేదిలేక ప్రైవేటు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందనే ఆశతో కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని చివరకు తక్కువ ధరకు విక్రయించాల్సిన దుస్థితి నెలకొంటోంది. దీంతో రైతులు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పుడు కనిపించిన హడావుడి, ఆ తర్వాత కొనుగోళ్లలో కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే కొనుగోళ్లు చేపట్టాలి : రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం



ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం రాశులను వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం కోరారు. తేమ శాతం పరీక్షలు, తూకాలు, రవాణా ప్రక్రియను వేగవంతం చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి ప్రతికూలతలతో ఇప్పటికే నష్టపోయిన రైతులను కొనుగోళ్ల జాప్యంతో మరింత ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

కొటేషన్ నెం. 28/EE/Cir-42/SBZ/GHMC/2026 తేది: 02.11.2026

క్ర.నెం.	పని పేరు	కింద పేర్కొన్న అంశాల కోసం తయారీదారులు, అధికారులు మరియు డీలర్లు, ఏజెన్సీలు మొదలైన వారి నుండి కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి	బిడ్ పత్రం డౌన్‌లోడ్, ప్రారంభ తేదీ & సమయం/ బిడ్ సమర్పణ ముగింపు తేదీ & సమయం	పేరు & చిరునామా కార్యాలయం & సెల్ నెం.
1	జిహెచ్‌ఎంసి, ఎస్‌బిజెడ్, అంబర్‌పేట్ సర్కిల్-16, వార్డ్ 83-అంబర్‌పేట్‌లోని ఇండోర్ స్టేడియంలో సింథటిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, బోర్‌వెల్ మరమ్మతులు వంటి కొన్ని అభివృద్ధి పనుల కోసం నాన్-SOR అంశాలకు కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి.	నాన్ SOR కొటేషన్ల కోసం అభ్యర్థన.	03-11-2026 మ.3.00 గంటలు; 05-11-2026 మ.3.00 గంటలు	సీల్డ్ కొటేషన్లను తేది: 05-11-2026 మ.3.00 గం.లలోపు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-డివిజన్-16, జిహెచ్‌ఎంసి, పార్కింగ్ కాంప్లెక్స్, 7వ అంతస్తు, అబిడ్స్, హైదరాబాద్ వారి కార్యాలయంలో సమర్పించవచ్చు. సెల్ : 9963550657 / 6309919062

పై అంశాలకు సంబంధించిన మరిన్ని వివరాలు మరియు పూర్తి స్పెసిఫికేషన్‌ను జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్: https://ghmc.gov.in నుండి పొందవచ్చు.
To, నోటీసు బోర్డు
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డివిజన్-42-ఎస్‌బిజెడ్-జిహెచ్‌ఎంసి
DIPR R.O. No. : 13013-PP/CL/ADVT/2026-27, Date: 03-11-2026

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్

షార్ట్ టెండర్ నోటీస్ నెం. Engg-30/CMC/PTC-C-46/2026-27 తేది: 03.11.2026

NIT No.	పని పేరు	అంచనా విలువ / ఇసివి	డౌన్‌లోడ్ ప్రారంభ తేది	బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం	ఇ.ఇ. పేరు & చిరునామా
షార్ట్ టెండర్ నోటీస్ నెం. Engg-30/CMC/PTC-C-46 /2026-27, తేది: 03.11.2026	1 నెం. జెట్టింగ్ మెషిన్ అద్దె ప్రాతిపదికన. 2 నెం.ల నీటి సరఫరా పైప్‌లైన్‌లు మరియు పంప్ సెట్ల నిర్వహణ. 1 నెం. మురుగునీటి కాలువ లైన్ల నిర్వహణ మరియు మరమ్మతులు.	రూ. 75.00 లక్షలు	05.11.2026 ఉ.10.30 గం.లకు	09.11.2026 మ.12.00 గం.ల వరకు	ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఫోన్ నెం. 7331189492

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్-46లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46, ఎస్‌ఎల్‌పి జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 13050-PP/CL/ADVT/2026-27, Date: 03-11-2026

డైరెక్టర్ కార్యాలయం, హెరిటేజ్ డిపార్ట్‌మెంట్

(పూర్వపు పురావస్తు మరియు మ్యూజియం శాఖ)

తెలంగాణ ప్రభుత్వం, గన్‌ఫౌండ్రీ, హైదరాబాద్.

టెండర్ల ఆహ్వాన ప్రకటన (NIT) - (3వ పిలుపు)

ఫైల్ నెం. B1/543/2026 తేది: 31-10-2026

పరిరక్షణ / పునరుద్ధరణ / రసాయన పరిశుభ్రత మరియు గ్రౌటింగ్ & లైమ్ పాయింటింగ్., ఈ క్రింది ప్రదేశాలలో:

క్ర.సం.	పని పేరు	ECV
1.	మలక్‌పేటలోని మాన్సియర్ రేమండ్స్ ఒబెలిస్క్ సమాధి	రూ.12,15,590/-
2.	జైనాద్‌లోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం	రూ.19,55,960/-

టెండర్ల దాఖలు స్వీకరణకు చివరి తేదీ: 11-11-2026 మరియు అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు టెండర్లు తెరవబడతాయి. మరిన్ని వివరాల కోసం దయచేసి సందర్శించండి: tender.telangana.gov.in.
సం/- ప్రొఫెసర్ అర్జున్ రావు కుతడి డైరెక్టర్
DIPR R.O. No. : 13032-PP/CL/ADVT/2026-27, Date: 03-11-2026



మహిళా పారిశుద్ధ్య కార్మికులపై వేధింపులు.. ఎస్ఎఫ్ఎను సస్పెండ్ చేయాలి

కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ధర్నా

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులను వేధింపులకు గురిచేస్తున్న శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ శివరాం పై తక్షణమే చర్యలు తీసుకొని విధుల నుంచి సస్పెండ్ చేయాలని తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని జీడిమెట్ల సర్కిల్ సుచిత్ర ప్రాంతంలో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న మహిళా కార్మికులను ఎస్ఎఫ్ఏ శివరాం నిత్యం అసభ్య పదజాలంతో దూషిస్తూ, మానసికంగా వేధిస్తున్నాడని, ఈ వేధింపులతో విసిగిపోయిన కార్మికులు విధులను నిలిపివేసి, ఎస్ఎఫ్ఏకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.యేసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షుడు వి.హరినాథ్ రావు, జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్ కార్మికులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా విధుల్లోకి తీసుకున్న నలుగురు కార్మికుల నుంచి ఒక్కొక్కరి వద్ద లక్ష రూపాయల చొప్పున మొత్తం సుమారు నాలుగు లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇఎస్ఐ, ఇపిఎఫ్ సౌకర్యాలు అమలు కావాలంటే అదనంగా రూ.10 వేల నుంచి రూ.20వేల వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతి నెలా ఒక్కో కార్మికుడి నుంచి రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వని వారి హాజరులో తేడాలు చూపిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ విధులు నిర్వహించేలా ఒత్తిడి చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని అన్నారు. మహిళా కార్మికులను అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధింపులకు పాల్పడుతున్న ఎస్ఎఫ్ఎపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే సస్పెండ్ చేయాలని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఎస్ఎఫ్ఎపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో మున్సిపల్ కార్మికులు జ్యోతి, గజ్వేలి స్వరూప, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ రంగంలో నిరోషకు డాక్టరేట్



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : రొమ్ము క్యాన్సర్ చికిత్సలో నానో సాంకేతికత ఆధారిత ఔషధ విధానాల అభివృద్ధిపై పరిశోధన చేసిన అనురాగ్ విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థిని బొల్లెద్ల నిరోష డాక్టరేట్ సాధించారు. ఆమె పరిశోధన భవిష్యత్తులో క్యాన్సర్ చికిత్సకు కొత్త మార్గాలను చూపే అవకాశం ఉందని విశ్వవిద్యాలయ వర్గాలు పేర్కొన్నాయి. పోచారం డివిజన్ పరిధిలోని వెంకటాపురంలోని అనురాగ్ విశ్వవిద్యాలయం ఔషధ విజ్ఞాన విభాగంలో డాక్టర్ వసుధ బక్షి మార్గదర్శకత్వంలో నిరోష పరిశోధన పూర్తి చేశారు. హార్మోన్ ప్రభావిత రొమ్ము క్యాన్సర్ కణాల్లో కణ మరణ ప్రక్రియను పెంపొందించేందుకు ఔషధ, పాలిమర్ ఆధారిత సూక్ష్మ కణాల అభివృద్ధి, వాటి లక్షణాల పరిశీలనపై ఆమె అధ్యయనం సాంగింది. అక్టోబర్ 13న నిర్వహించిన పరిశోధన మౌఖిక పరీక్షలో డాక్టర్ ఎన్. దామోదరం పరిశోధనను మూల్యాంకనం చేశారు. డాక్టరేట్ సాధించిన నిరోషను విశ్వవిద్యాలయ అధ్యాపకులు అభినందించారు. ఆమె పరిశోధన క్యాన్సర్ చికిత్సలో నానో సాంకేతికత ఆధారిత ఔషధ విధానాల అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశా రు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడు మృతి



ప్రజాపక్షం/చర్లపల్లి: రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీ కొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేజ్ 4లోని ఎల్ఎన్ ఫార్మా కంపెనీ సమీపంలో రోడ్డు దాటుతున్న కొలిపాక బాలరాజు(63)ను కేబుల్ చౌరస్తా నుండి చర్లపల్లి వైపు వెళ్తున్న ప్యాషన్ ప్రో(ఏపి 29 ఏఎన్ 1229) ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యంగా నడుపుతున్న మంచోజుల అజయ్ అనే యువకుడు ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే 108 అంబులెన్స్ ద్వారా ఇసిఐఎల్ శ్రీకర ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు మృతిడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ పొదుపుగా వాడండి

తాండూరు విద్యుత్ అధికారులు

ప్రజాపక్షం/తాండూరు: రైతులు, విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి విద్యుత్ వినియోగదారుల దినోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తాండూరు సబ్ డివిజన్ విద్యుత్ డిఇ, ఎడిఇ సూర్య, శంకర్ నాయకులు సూచించారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాండూరు విద్యుత్ కార్యాలయం లో నిర్వహించిన కార్యక్రమంలో వినియోగాదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ విధ్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విధ్యుత్‌ను సరఫరా చేయడానికి తమ సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటారని అన్నారు. వినియోగాదుల సమస్యలను తక్షణమే పరిష్కారించడానికే విధ్యుత్ వినియోగదారుల దినోత్సవాలను ప్రభుత్వం చేపట్టిందన్నారు. కొన్ని సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో ప్రభావంతో విధ్యుత్ వాడకాన్ని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వృదాను అరికట్టి విధ్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు. చిన్న సమస్యలు ఏమైన ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుల్ ఎఎఒలు, ఎఈలు, విద్యుత్ వినియోదారులు పాల్గొన్నారు.





పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టవంతం

ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి రాంకీ సంస్థ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. పారిశుద్ధ్య పనులకు అవసరమైన వాహనాల కొరతను నివారించేందుకు వారంలోగా 10 టిప్పర్లు, రెండు బాబ్‌కాట్లు, మూడు రిజర్వ్ వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ప్రతి వార్డుకు ఫీల్డ్ అసిస్టెంట్, ప్రతి సర్కిల్, జోన్‌కు ప్రత్యేక ఇన్‌చార్జ్‌లను నియమిం చి పర్యవేక్షణను బలోపేతం చేయాలని సూచించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ నివేదికలను ప్రతిరోజూ పరిశీలించి అధికారులకు అందుబాటులో ఉంచే విధంగా ప్రత్యేక వ్యవస్థను అమలు చేయనున్నట్లు రాంకీ సంస్థ తెలిపింది.

పర్యవేక్షణకు వార్డు వారీగా నోడల్ అధికారులు

పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసేందుకు వార్డు వారీగా నోడల్ అధికారులను నియమిస్తూ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్.బి.నగర్ జోన్‌లలోని ప్రతి వార్డు కు ప్రత్యేక అధికారులను కేటాయించి రోడ్ల శుభ్రత, చెత్త సేకరణ, బహిరంగ ప్రదేశాల పరిశుభ్రత, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించి క్రమం తప్పకుండా ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ఈ విధానాన్ని నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ స్పష్టం చేశారు.

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ వెంటనే ఎత్తివేయాలి

అఖిలపక్ష సమావేశంలో ఉమా మహేష్ డిమాండ్



ప్రజాపక్షం/జవహర్ నగర్: జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. కీసర సర్కిల్ పరిధిలోని దమ్మెగూడ డివిజన్, నాగారం ప్రాంతంలోని ఎంఆర్ వై ఫంక్షన్ హాల్ లో ఈ సమావేశం మంగళవారం జరిగింది. ఈ వివరాలను సిపిఐ జవహర్ నగర్ నాయకులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తొలగింపు సాధన కోసం అఖిలపక్ష రాజకీయ పార్టీల భాగస్వామ్యంతో జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారంలో గత ప్రభుత్వాలు, ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని మండిపడ్డారు. ఈ నిర్లక్ష్యం వల్ల డంపింగ్ యార్డ్ లక్షలాది మంది ప్రజల పాలిట మరణశాసనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాన సమస్యలు డిమాండ్లు

విపరీతమైన కాలుష్యం హైదరాబాద్ నగరం నుండి ప్రతిరోజూ సుమారు 12,000 మెట్రిక్ టన్నుల చెత్తను ఇక్కడకు తరలిస్తుండటంతో గుట్టలుగా పేరుకుపోయి పరిసర ప్రాంతాల్లో తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది.

భూగర్భ జలాలు కలుషితం

డంపింగ్ యార్డ్ నుండి వెలువడే రసాయనాలు (లిచేట్) భూమిలోకి ఇంకిపోవడంతో తాగునీరు కలుషితమై ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు.

వ్యాధుల భయం:

వయస్సుతో సంబంధం లేకుండా ప్రజలు డెంగ్యూ, మలేరియా, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఒప్పందాల ఉల్లంఘన:

రాంకీ సంస్థతో ప్రభు త్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం రీసైక్లింగ్, చెత్త నుండి విద్యుత్ ఉత్పాదన, ఆధునిక యంత్రాల వినియోగం సరిగ్గా జరగడం లేదని విమర్శించారు. హైదరాబాద్ లోని చెత్తను ఎక్కడికక్కడే ప్రాసెస్ చేసేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) రూపొందించాలని, జవహర్ నగర్ ప్రాంతాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే జెఎసి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేపడతామని, ఈ పోరాటం లో సిపిఐ ప్రత్యక్షంగా భాగస్వామ్యమవుతుందని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జవహర్ నగర్ మాజీ మేయర్లు మేకల కావ్య, దొంతగాని శాంతి, నాయకులు యాదగిరి గౌడ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, జిల్లా కమిటీ సభ్యులు సంతోష్ రాథోడ్, కీసర మండల కన్వీనర్ బంగారు నర్సింగరావు, జవహర్ నగర్ డివిజన్ కన్వీనర్ శివన్నారాయణ, భాలు, అశోక్ లతో పాటు కాంగ్రెస్, బిఆర్ఎస్, సిపిఐ, సిపిఐ (ఎంఎల్), సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, తెలుగుదేశం పార్టీల నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మహిళా భవనం నిర్మించాలి


సిపిఐ నేత పాలబిందెల శ్రీనివాస్



ప్రజాపక్షం/ కుత్బుల్లాపూర్ : నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ఇంద్రన్న కాలనీలో స్థానిక మహిళలు, కాలనీవాసుల అవసరాల దృష్ట్యా ఇందిరమ్మ మహిళా భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బాచుపల్లి మండల కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఇంద్రన్న కాలనీ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీవాసులతో కలిసి మహిళా భవనం నిర్మాణం కోసం పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, మండల తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కోసం ఎన్నో ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇప్పటివరకు ఎలాంటి కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాణిరెడ్డి బాచుపల్లి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ నుంచి స్థల సర్వే నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. అప్పటి తహసీల్దార్ సర్వేయర్‌గా పనిచేస్తున్న సింధుకు సర్వే చేయాలని మెమో జారీ చేసినప్పటికీ, ఆమె కాలయాపన చేయడంతో ఇప్పటివరకు సర్వే పూర్తికాలేదని ఆరోపించారు. ఓటరు నమోదు కార్యక్రమం కారణంగా కూడా కొంత జాప్యం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీకి సంబంధించిన స్థలాన్ని వెంటనే సర్వే చేసి, ఇందిరమ్మ మహిళా భవనం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని బుూయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్న కంటి దస్తగిరి, నర్సింహా, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవం

పాల్గొన్న అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమలం శిరీషా కృష్ణారెడి



ప్రజాపక్షం/శామీర్‌పేట: శామీర్‌పేట మండల కేంద్రంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయ 9వ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారి కల్యాణ మహోత్సవం మంగళవారం కన్నుల పండవగా జరిగింది. శామీర్‌పేట గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి శామీర్‌పేట మండల ప్రజలు, నగరం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని భక్తులు, దూడల కుటుంబీకులు, గౌడ సంఘం కులస్థులు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ కల్యాణంలో ఉదయం పూజలు జరిపి అమ్మవారికి ఘటం తీసుకు వెళ్లారు. అనంతరం అమ్మవారికి సూర్య బోనం సమర్పించగా భక్తులు ఒడి బియ్యం పోసి తమ మొక్కులు తీర్చుకున్నారు.ఈ కల్యాణ మహోత్సవంలో అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమలం శిరీషా కృష్ణారెడ్డి, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, బిఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ చామకూర మహేందర్‌రెడ్డి, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కొండ నర్సింహారెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జానకి రాములు, కట్ట మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ భూమిరెడ్డి, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భవనంపై నుండి దూకి బాలిక మృతి



ప్రజాపక్షం/చర్లపల్లి: ఓ భవనంపై నుండి దూకి బాలిక మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరా ల ప్రకారం చర్లపల్లి న్యూమింట్ కాలనీలో తనీషా(17) అనే బాలికను సోమవారం రాత్రి తన ఇన్‌స్టాగ్రామ్ చాటింగ్ విషయమై కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై భవనంపై నుండి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఘటనా స్థలానికి పోలీసులు సిసి టివి ఫుటేజ్‌ను పరిశీలించగా తెల్లవారుజామున 4.28 గంటలకు భవనంపై నుండి దూకినట్లు గుర్తించామని, ఇంట్లో సూసైడ్ నోట్ కూడా లభించిదని మృతురాలు తల్లిదండ్రులు ఎటువంటి అనుమానం లేదని తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాఠశాలలో పాములు.. పట్టించుకోని అధికారులు

కౌన్సిలర్ గాదె వెంకటేష్

ప్రజాపక్షం/శామీర్‌పేట అలియాబాద్ మున్సిపాలిటిలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో చుట్టు పిచ్చి మొక్కలు మొలిచి పాములు, విష పురుగులు సంచరిస్తున్న పట్టించుకున్న నాధుడే లేడని అలియాబాద్ 7వ వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్ ఆరోపించారు. మంగళవారం అలియాబాద్ మున్సిపాలిటిలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలను తన సొంత ఖర్చులతో కూలీలను ఏర్పాటు చేసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటిలోని ఎస్‌సి కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయని దీంతో విష పాములు సంచరిస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. ఇట్టి విషయమై మున్సిపల్ సాధారణ సమావేశాల్లో కమిషనర్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదని ఆవేదన చెందారు. మూడు నెలలుగా ఇట్టి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని దీంతో నా సొంత ఖర్చులతో కూలీలతో పిచ్చి మొక్కలు తొలగించానని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాఠశాలపై దృష్టిసారించి సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు.



అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

ఎస్ఐ రమేష్ కుమార్

ప్రజాపక్షం/కుల్కచర్ల: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌కుమార్ హెచ్చరించారు. కుల్కచర్ల మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో ముసలి హనుమంతుకు చెందిన ట్రాక్టర్ నెంబర్ 31ఎచ్ 3371 గల ట్రాక్టర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పోలీసులు ట్రాక్టర్‌తో పాటు యాజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల తప్పనిసరిగా పాటించాలని కోరారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడే వారి సమాచారం పోలీసులకు అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రజలకు సూచించారు.



తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళిక

ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్

ప్రజాపక్షం/దుండిగల్: దుండిగల్ సర్కిల్ పరిధిలో మంగళవారం దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో హైదరాబాద్ వాటర్ వర్క్స్, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్ ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సర్కిల్ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న వాటర్ వర్క్స్ ప్రాజెక్టుల పురోగతిని, త్వరలో చేపట్టబోయే నూతన ప్రాజెక్టుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా అదనపు పనులు లేదా టెండర్లు చేపట్టాల్సి ఉంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదానికి పంపాలని ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం కారణంగా రాబోయే రోజుల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఎద్దడి కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కుతుబుల్లాపూర్ జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. బౌరంపేట్ ప్రాంతంలో ఉన్న తాగునీటి మరియు సీవరేజ్ సమస్యలపై ప్రత్యేకంగా చర్చించారు. బౌరంపేట్ ప్రజ ఎదుర్కొంటున్న నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు అవసరమైన శాశ్వత ప్రతిపాదనలను వెంటనే రూపొందించాలని హెచ్ఎమ్‌డబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులను ఆదేశించినారు. ఈ సమీక్షా సమావేశంలో దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకట మణికరణ్, హెచ్ఎండబ్ల్యూ ఎస్ఎస్‌బి జనరల్ మేనేజర్ నాగ పర్మిల, ఏజీఎం శ్రీనివాస్, మేనేజర్ వెంకటేష్, అలాగే సర్కిల్ కార్యాలయం ఇంజనీరింగ్ విభాగం నుండి సూపరింటెండింగ్ ఇంజనీర్ సక్కుబాయి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోవర్ధన్ గౌడ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్, అశోక్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి ఆదేశం

ప్రజాపక్షం/కొడంగల్ : కొడంగల్ నియోజకవర్గం హకీంపేటలో రాష్ట్ర ముఖ్యమంత్రి మూడు రోజుల పాటు పర్యటనలో రైతు మేళా, ప్రారంభోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి, జిల్లా ఎస్పి స్నేహమెహ్రాతో కలిసి మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేట్‌లో ఈ నెల 7నుంచి 9వ తేదీ వరకుకు నిర్వహించనున్న రైతు మేళా కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో రైతులను తరలించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన సభాప్రాంగణం, వేదిక నిర్మాణం, ప్రజలు, రైతులకు అవసరమైన సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్యం సేవలు, విద్యుత్ సరఫరా, రవాణ, పార్కింగ్ ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రైతు మేళాకు హాజరయ్యే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని సౌకర్యలు కల్పించాలని, స్టాళ్లు, ప్రభుత్వ పథకాల వివరాలను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు.



ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ దరఖాస్తును తహసీల్దార్‌కు అందజేసిన శ్రీనివాస్

ప్రజాపక్షం/కొడంగల్ : దుద్యాల మండల కుదురుమల్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నియోజకవర్గంలోని అధ్యక్షులు శ్రీనివాస్ తన ఓటరు నమోదు దరఖాస్తును దుద్యాల తహసీల్దార్ కిసాన్‌నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ వరకు ఉన్నందున తమ దరఖాస్తులను సంబంధిత జిరాక్స్ పత్రాలను గ్రామ బిఎల్ఒకు లేదా గ్రామ కార్యదర్శులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దుద్యల సర్పంచు రమేష్ ముదరాజ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నీటిలో మునిగి యువకులు మృతి

ప్రజాపక్షం/ధారూర్ : సుద్దగుంతలో గొర్రెలను కడగటానికి వెళ్లి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మంగళవారం ధారూర్ మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన సకిల శ్రీనివాస్ (40), మున్నూర్ అశోక్ (18)లు ప్రతి ఏడాది లాగే తమ గొర్రెలను కడగటానికి సుద్ద తీసిన గుంతలో ఉన్న నీటిలోకి వెళ్లి గొర్రెలను కడుగుతుండగా,అందులోని గొర్రె తప్పించుకొని పోవడానికి వెళ్లగా దానిని పట్టుకునే ప్రయత్నంలో మున్నూర్ అశోక్ నీటి గుంతలో పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగిపోతుండగా అక్కడే ఉన్న సకిల శ్రీనివాస్ కాపాడటానికి నీటిలోకి వెళ్లగా, అతనిని గట్టిగా పట్టుకున్నాడు. ఇద్దరు ఈదలేక నీటిలో మునిగిపోతున్నారు. అక్కడే ఉన్న మరో వ్యక్తి కాపాడటానికి తన దగ్గర ఉన్న టవల్ అందజేయగా వారిద్దరు మునిగిపోతున్న క్రమంలో, టవల్ అందించిన వ్యక్తిని లాక్కనే ప్రయత్నంలో అతను తప్పించుకొన్నాడు. చుట్టుపక్కల వారు వచ్చి నీటిలో మునిగిన వారిని వెతికి తీయగా అప్పటికే వారు చనిపోయారు. విషయం తెలుసుకున్న ధారూర్ పిఐ రఘురాములు, ఎస్ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

మరింత పరిశుభ్రంగా, సుస్థిరంగా నగరం

మున్సిపల్ అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించడం అత్యంత అవసరం

హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్





ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరాలను మరింత పరిశుభ్రంగా, సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించడం అత్యంత అవసర మని మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రభుత్వ కార్యదర్శి, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. మహానగర పాలక సంస్థ(జిహెచ్ ఎంసి), అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హైదరా బాద్‌లోని ఆస్కీ ప్రాంగణంలో మున్సిపల్ అధికారుల కోసం ఒకరోజు ప్రత్యేక సమర్థత పెంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణ, పట్టణాభివృద్ధి లక్ష్యంగా సాగిన ఈ సదస్సులో సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, ఎన్‌డబ్ల్యూఎమ్ రూల్స్ 2026, బల్క్ వేస్ట్ మేనేజ్ మెంట్, స్వచ్ఛ భారత్ మిషన్ (ఎన్‌బిఎమ్) 2.0 అర్బన్, ప్రగతి 50 సిటీస్, స్వచ్ఛ సర్వేక్షన్ సూచికలు, సర్టిఫికేష న్‌లపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్ర మానికి ప్రధాన వక్తగా హాజరై సర్ఫరాజ్ అహ్మద్ మాట్లా డుతూ పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ పారిశుద్ధ్య ప్రమా ణాలను పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన వాతావర ణాన్ని పౌరులకు అందించవచ్చన్నారు. నగర పాలనను మరింత బలోపేతం చేయడం, అధికారుల పనితీరు సామర్థ్యాన్ని పెంచేందుకు జిహెచ్ఎంసి, ఆస్కీల మధ్య ఒక అవగాహనా ఒప్పందం. సంస్థాగత సహకారాన్ని పెంపొందించుకోవడంలో ఈ ఒప్పందం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. సమావేశంలో జిహెచ్ఎంసి కమిష నర్ ఆర్వి.కర్ణన్, విశ్రాంత ఐఎఎస్ అధికారులు డాక్టర్ ఎన్.రమేష్ కుమార్, డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డిలతో పాటు జిహెచ్ఎంసి అదనపు కమిషనర్లు బి.సంతోష్‌కుమార్, ఎన్.రవికిరణ్, జె.శంకరయ్య, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి, చీఫ్‌సిటీప్లానర్ బి.భవానిరాణి, యుబిడి డైరక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌డ బ్ల్యూఎం సూపరిడెంట్ ఇంజనీర్ నర్సింగ్‌రావు, ఎస్‌డ బ్ల్యూఎం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అజయ్, చీప్‌వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ వకీల్, డాక్టర్ ఎమ్.స్నేహలత, డాక్టర్ వల్లి మాణిక్యం, డాక్టర్ ఓ.పి.సింగ్, ఉదయ్ సింగ్ గౌతమ్, కె.బి.రంజిత్‌కుమార్, డి.ఫణికృష్ణ పాల్గొన్నారు.

వరద నీటి పైపులైన్ నిర్మాణాలకు నిధులు మంజూరు



ప్రజాపక్షం/ఎల్‌బినగర్ : సాహెబ్‌నగర్, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యకు త్వరలో పరి ష్కారం లభిస్తుందని సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేతా వత్ రమేష్ నాయక్ తెలిపారు. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ చొరవతో బిఎన్‌రెడ్డి నగర్‌లోని కాప్రాయి చెరువు నుంచి హయత్ నగర్‌లోని కుమ్మరికుంట వరకు వరద నీటి పైప్‌లైన్ నిర్మాణానికి రూ.5.95 కోట్ల నిధులు మంజూరయ్యాయని, పనులు త్వరలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. మంగళవారం సాహెబ్‌నగ ర్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భవాని సరస్వతి, చంద్రకాంత్ గౌడ్, రాంబాబు గౌడ్, శంకర్ నాయక్, పారంద స్వామి, చిత్త రంజన్, రామకోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎలికట్ట వద్ద ఆగని కేబుల్ పనులు



ప్రజాపక్షం/షాద్‌నగర్: రోడ్డు విస్తరణకు అటంకంగా మారుతున్న విద్యుత్ కేబుల్ పనులను నిలిపివేయాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశిం చినా పనులు మాత్రం జోరుగా సాగుతున్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామం వద్ద పరిగి రోడ్డుపై యదేచ్ఛగా ఆదాని కంపెనీకి చెందిన నిర్వాహకులు 220కెవి విద్యుత్ పనులు కొనసాగిస్తున్నారు. ఒకవైపు ట్రాఫిక్, మరోవైపు రోడ్డు మధ్యలో తవ్వకాలు చేపడుతుంటంపై వాహనదా రులతోపాటు ప్రజలు మండిపడుతున్నారు. రహదారి భద్రతను దృష్టిలో పెట్టుకొని తక్షణమే రోడ్డు తవ్వకాలను నిలిపివేయాలని, సంబంధిత శాఖ అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నిత్యావసర ధరల అదుపులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని నిరసిస్తూ, కాంగ్రెస్ ప్రభు త్వాన్ని వ్యతిరేకంగా ఎల్‌బి నగర్ బిఆర్ఎస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగాయన్నారు. బియ్యం, నూనె, గ్యాస్, పాలు చెక్కర, కందిపప్పు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర రోజు రోజుకు పెరుగుతుండడంతో సామాన్య ప్రజలు తీవ్రంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్ నగర్ అభివృ ద్ధికి కృషి చేస్తామని వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంక టేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని పలు కాలనీలకు సీనియర్ సిటిజన్ భవనం, ఓపెన్ జీమ్, రోడ్లు తదితర సమస్యలపై ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో వారి కార్యాలయంలో కాలనీ వాసులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కర్ణా కర్‌రెడ్డి, యువిఎన్ బాబు, రంగయ్య చౌదరి, బిజెఎం రెడ్డి, వీరాస్వామి, ఉపేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు చేరుకోకపోతే చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్

ప్రజాపక్షం/శంకర్‌పల్లి: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శంకర్‌పల్లి మండలంలోని కొండకల్ గ్రామపంచాయతీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణ పనులతో పాటు జల సిరి కార్యక్రమం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి.ప్రవీణ్‌కుమార్, మండల పంచాయతీ అధికారి గిరిరాజు, ఎఇ పిఆర్ నందకిషోర్, ఎఇ (ఎంట్రా) వెంకటేశ్వర్లు, ఎపిఒ నాగభూషణం, ఇసి జనా ర్ధన్ రెడ్డి, టిఎ యాదయ్య పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి



ప్రజాపక్షం/కొత్తూరు: గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని అమ్మవారికి వేడుకున్నట్లు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలి పారు. మంగళవారం కొత్తూరు మండలం కోడిచర్ల మైసమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పెంజర్ల ఉపసర్పంచ్ శాంతన్‌రెడ్డి, వార్డుసభ్యులు మామిడి భారతమ్మ, కాటం రమాదేవి, కంటికె మైబుజ్జి, కమ్మరి వేదంతా చారి, షేక్ అర్బస్, మంద మాధవి, రాముట్ల రాములు, మాధవి, దేశాల శారద, కోడిచర్ల ఉప సర్పంచ్ రాందాస్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

వన్ హెల్త్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం





ప్రజాపక్షం/హైదరాబాద్ : వన్ హెల్త్ డే సందర్భంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) ఆధ్వర్యంలో మానవ, జంతు, పర్యావరణ ఆరోగ్య పరి రక్షణపై ప్రత్యేక నిఘా, అవగాహన కార్య క్రమం నిర్వహించారు. వెటర్నరీ, వైద్య, పారిశుద్ధ్య విభాగాలు, మెట్రోపాలిటన్ సర్వేలైన్స్ యూనిట్ సంయుక్తంగా 11 మాంసం దుకాణాలు, నాలుగు డెయిరీ ఫారాలను తనిఖీ చేసి పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్య ప్రమాణాలను పరిశీలించాయి. మాంసం విక్రేతలు, డెయిరీ కార్మికులకు సురక్షిత నిర్వహణ, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యర్థాల సక్రమ పారవేతపై అవగాహన కల్పించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఈ తరహా కార్యక్రమాలను కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

పౌరసదుపాయాల మెరుగుకు.. సిఎంసి స్థాయీసంఘం గ్రీన్ సిగ్నల్

ప్రజాపక్షం/హైదరాబాద్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ సాధారణ స్థాయీసంఘం సమావేశంలో పౌర మౌలిక సదుపాయాల అభివృద్ధి, వర్షపు నీటి పారుదల వ్యవస్థ బలోపేతం, పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి సంబం ధించిన పలు కీలక ప్రతిపాదనలను పరిశీలించారు. అమీన్‌పూర్‌లో రూ.6 కోట్లతో కొత్త సర్కిల్ కార్యాలయం, శేరిలింగంపల్లిలో కాలువల పునర్నిర్మాణం, కూకట్‌పల్లి జోన్‌లో డ్రెయిన్ అభివృద్ధి, చందానగర్‌లో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణ ప్రతిపాదనలు సమావేశంలో చర్చించారు. అలాగే సిఎంసిలో విలీన మైన పూర్వ మున్సిపాలిటీల ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు, శానిటరీ ఫీల్ట్ అసిస్టెంట్లు, శానిటరీ రిసోర్స్ పర్సన్ల వేతనాల పెంపుపై కూడా చర్చించి ప్రభుత్వ ఆమోదానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు.

జిహెచ్ఎంసి పరిధిలో తుది దశకు 'ఎస్ఐఆర్' ప్రక్రియ

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్ఎంసి పరిధిలో బోగస్, రీపి ట్రేడ్ డూప్లికేట్, అనామలస్ ఓట్లను ఏరివేసేందుకు చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ప్రక్రియ తుది దశకు చేరుకుంది. నోటీసులు జారీ చేసిన ఓటర్లపై బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్ఓలు) లోతుగా విచారణ జరుపుతుండ టంతో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. హైద రాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సుమారు 12.53 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీచేయగా, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లోనూ లక్షల సంఖ్యలో నోటీసులు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగ రంలో జారీ చేసిన నోటీసుల్లో సింహభాగం విచారణలు పూర్త యినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ వెల్లడించారు. కాగా, నోటీసులు జారీ చేసి నెలలు గడుస్తున్నా సనత్‌నగర్ నియోజకవర్గంలో 12 మంది నేపాలీలు, రంగారెడ్డి జిల్లాలో కొందరు రోహింగ్యాల నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. దీంతో అధికారులు చేప ట్టిన విచారణలో వారు అక్రమంగా ఓటు హక్కు పొందినట్లు గుర్తించారు. వీరికి దేశ పౌరసత్వాన్ని నిరూపించే జనన ధ్రువీ కరణ పత్రా లు లేకపోవడంతో వీరి ఓటు హక్కును రద్దు చేసేం దుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సర్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ నెల 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. మరో వైపు, సర్ ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్ల తొలగింపు జరుగు తోందనేది కేవలం పుకారు మాత్రమేనని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. స్వస్థలాల్లో ఓటుహక్కు ఉండి హైదరాబాద్‌లో ఉపాధి, విద్య కోసం ఉంటున్న వేలాది మంది ఓటర్లు విచార ణకు హాజరుకాకపోవడం, ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పిం చకపోవడమే నోటీసులకు ప్రధాన కారణమని వివరించారు. ఈ ప్ర క్రియ వల్ల బోగస్ ఓట్లు తొలగిపోయి నిజమైన ఓటర్లు మాత్ర మే జాబితాలో ఉంటారని, దీనివల్ల ఎన్నికల వ్యయం కూడా తగ్గుతుండటంతో ప్రజాప్రతినిధులు సైతం ఈ చర్యను స్వాగతిస్తున్నారని అధికారులు తెలిపారు.

రెండు పార్కులు పరిరక్షించిన 'హైడ్రా'



ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూ రులోని మంజీరా కాలనీలో ఆక్రమణకు గురైన 577 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా మంగళవారం స్వాధీనం చేసుకుంది. లేఅ వుట్‌లో పార్కుగా కేటాయించిన స్థలాన్ని ప్లాట్లుగా విక్రయించి నిర్మాణాలకు సిద్ధమ వుతుండగా స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగింది. స్థలాన్ని పరిశీలించిన అధికారులు లేఅవుట్ ప్రకారం అది పార్కే



నని నిర్ధారించి నిర్మించిన ప్రహరీలను తొల గించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అలాగే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చెంగిచెర్లలో శ్రీ లక్ష్మీ నగర్ కాలనీలో పార్కు, ప్రజాప్రయోజ నాల కోసం కేటాయించిన 639 గజాల స్థలాన్ని కూడా ఆక్రమణల నుంచి విముక్తం చేశారు. ఇదిలా ఉండగా తెల్లాపూర్‌లో అక్రమ బోర్ల తొలగింపు చర్యలను కొనసా గిస్తూ మరో మూడు బోర్లు, మూడు సంపు లను హైడ్రా తొలగించింది.



రోడ్డు ప్రమాద నివారణకు చర్యలు

రవాణా శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వాసుదేవారావు

ప్రజాపక్షం/కొత్తూరు: రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రవాణా శాఖ రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వాసుదేవారావు వివరించారు. మంగళవారం కొత్తూరు మండల కేంద్రం లోని బైపాస్ రహదారిపైన నిత్యం చోటు చేసుకుంటున్న ప్రమాదాల ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాసుదేవారావు మాట్లా డుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సేవ్ లైఫ్ ఫౌండేషన్ అందించిన డేటా ఆధారంగా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను గురించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఏడు జిల్లాలు ఈ జాబితాలో ఉన్నాయని, వాటిలో రంగారెడ్డి జిల్లా ఉందని, కొత్తూరు మండల పరిధిలో మూడు ప్రాంతాలు, నంది గామ పరిధిలో ఒకటి, పెంజర్లలో ఒకటి కలిపి మొత్తం ఐదు ప్రాంతాలను ఇన్‌స్పెక్టర్ కమ్ అడ్మిన్ ట్రాఫిక్ బృందం పరిశీలించినట్లు వివరించారు. ప్రమాదాల నివారణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిం చడంతో పాటు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామని తెలి పారు. అవసరమైన భద్రత చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నియం త్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వాహనాలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వేగ నియంత్రణ, హెల్మెట్, సీట్‌బెల్ట్ విని యోగం ంటి భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కొత్తూరు సిఐ నాగార్జునరెడ్డి, సహాయ మోటర్ వాహన తనిఖీ అధి కారిణి బి.స్వాతి, ట్రాఫిక్ సిఐ ఉపేందర్, నందిగామ ఎస్ఐ దేవరాజ్, ఆర్ అండ్‌బి అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

యువత ఆత్మహత్యలకు పాల్పడవద్దు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రజాపక్షం/షాద్‌నగర్: యువత క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడవ ద్దని, ధైర్యంగా ఉంటూ సమస్యలను ఎదుర్కొనేందుకు కృషి చేయాలని షాద్‌న గర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో మృతిచెందిన విద్యార్థిని చంద్రకళ కుటుంబాన్ని పరామర్శించి రూ.25వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లా డుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించి ఉన్నత స్థాయికి తీసుకువచ్చేం దుకు కృషి చేస్తుంటే క్షణికావేశాలకు గురై ఆత్మహత్యలు చేసుకోవడం సరికా దని యువతకు సూచించారు. వెనుకబడిన సామాజిక వర్గానికి చెందిన చంద్ర కళ ఆత్మహత్య చేసుకోవడం బాధకరంగా ఉందని, ప్రభుత్వం తరుపున ఆదు కునేందుకు కృషి చేస్తామని తెలిపారు. కరీంనగర్‌లోని శాతవాహన విశ్వ విద్యాలయంలో ఎల్ఎల్‌బి ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి చంద్రకళ ఆత్మహత్య చేసుకోవడం విషాధకరమన్నారు. మృతురాలి తల్లి లక్ష్మమ్మ, తండ్రి చిన్నయ్యలకు ధైర్యం చెప్పడంతోపాటు ఆర్థిక సహకారం అంధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నియో జకవర్గ చైర్మన్ జాంగారి రవి, మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నేతలు ఆగిర్యాల కృష్ణారెడ్డి, రఘునాయక్, జమ్మద్‌ఖాన్, బాదేపల్లి సిద్ధార్థ, కౌన్సిలర్ అప్పి, గోదా మాదవులు, చించోడు ఆనంతం, వీర్లపల్లి అన్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





చంద్రకళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

విద్యార్థినీలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు కృషి చేయాలని, ఆత్మ హత్యలు పరిష్కారం కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో విద్యార్థిని చంద్రకళ కుటుం బాన్ని పరామర్శించడంతోపాటు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. చంద్రకళ అంత్యక్రియల్లో మందకృష్ణ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవి ద్యాలయంలో న్యాయ విద్య అభ్యసిస్తున్న ఓ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని దాకూరి చంద్రకళ ఆత్మహ్య చేసుకొని మృతిచెందడం అత్యంత విచారకరమన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఆమె కుటుంబా న్ని ప్రభుత్వం మానవీయ కోణంలో అన్ని విధాల అదుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రకళ మృతికి కారణమైన వారికి గుర్తిం చి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ, ఎంఎస్పీ రంగా రెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు రావుగాళ్ల బాబు మాదిగ, పెంటనోళ్ల నర్సంహా మాదిగ, అనేగాళ్ళ ఆనంద్ మాదిగ, అశోక్ మాదిగ, మల్లెపల్లి బాలరాజు మాదిగ, మహేందర్ మాదిగ, నాగభూషణం మాదిగ, పండు మాదిగ, మల్లిఖా ర్జున్ మాదిగ, ప్రవీణ్‌కుమార్ మాదిగ, ప్రశాంత్ మాదిగలు పాల్గొన్నారు.

యువతలో ప్రతిభ వెలికితీసేందుకు యువజన ఉత్సవాలు

నవంబర్ 12న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో పోటీలు

జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.స్వర్ణల

ప్రజాపక్షం/రంగారెడ్డి: యువతలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీసి, వారిని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రోత్సహించడమే లక్ష్యంగా జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధి కారి ఎస్.స్వర్ణలత తెలిపారు. 30వ జాతీయ యువజన ఉత్సవాలు 2027ను పురస్కరించుకొని ఈనెల 12న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ కళా నైపుణ్యాలను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఉత్సవాలు నవంబర్ 12, గురువారం నుంచి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, ఎల్‌బి.నగర్, హైదరాబా ద్‌లో ప్రారంభం కానున్నాయని తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలి పారు. ఒక్కో కళాకారుడు ఒక పోటీ విభాగంలో మాత్రమే పాల్గొనాలి. పోటీల్లో న్యాయనిర్ణేతల నిర్ణయమే తుది నిర్ణయంగా ఉంటుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులను రాష్ట్ర స్థాయి యువజన ఉత్సవాలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు 2027 జనవరి 10 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొనే అవ కాశం పొందుతారు. పోటీల్లో పాల్గొనదలచిన అభ్యర్థులు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 9849909077 నంబర్‌లో సంప్రదించ వచ్చు. జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం, ఇండోర్ స్టేడియం, సరూర్‌నగర్‌లో వివరాలు పొందవచ్చు. జిల్లా యువత తమలోని సృజనాత్మ కతను, కళా నైపుణ్యాలను వెలికితీసి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఈ ఉత్స వాలు వేదికగా నిలుస్తాయని, ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని జిల్లా యువజన,క్రీడల అధికారి ఎస్.స్వర్ణలత కోరారు.

ఎఐపిఎస్ఒ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పల్లె వెంకన్న

ప్రజాపక్షం/రంగారెడ్డి: అఖిల భారత శాంతి సంఘీ భావ సంఘం(ఎఐపిఎస్ఒ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా పల్లె వెంకన్న నియమితులయ్యారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రంగా రెడ్డి జిల్లా నాలుగో మహాసభలో పూర్తిస్థాయి నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అందులో భాగంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పల్లె వెంకన్న ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి సాధన కోసం అఖిలభారత సంఘీభావ సంఘం పనిచేస్తుందన్నారు. జిల్లాలో శాంతిని కోరుకునే ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేసి శాంతి సంఘీభావ సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం



ప్రజాపక్షం/బేగంపేట్: మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని మెకలగూడలో మురుగునీరు ఓవర్ ఫ్లో అయ్యి రోడ్డుపై ప్రవహిస్తుందని ఇటీవల స్థానికులు శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి విన్నవించారు. స్పందించిన ఆయన మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి మురుగునీరు పొంగి ప్రవహిస్తున్న ప్రాంతంలో పర్యటించారు. పర్యటనలో వాటర్‌వర్క్స్ జిఎం వెంకట్‌రెడ్డి, డిజిఎం ఆశిష్, మాజీ కార్పొరేటర్లు అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, బిఆర్ఎస్ నేతలు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు టి.శ్రీహరి, సతీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీవరేజ్ పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/జూబ్లీహిల్స్: డ్రైనేజీ సమస్య పరిష్కారంలో భాగంగా యాదగిరినగర్‌లో సీవరేజ్ పనులు ప్రారంభమయ్యాయి. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ సహకారంతో ఎజి కాలనీ డివిజన్ పరిధిలోని యాదగిరినగర్ బస్తీ దవాఖాన సమీపంలో రూ.10.50 లక్షల వ్యయంతో చేపడుతున్న సీవరేజ్ పనులను కాంగ్రెస్ నాయకుడు చిన్న శ్రీశైలంయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏజీ కాలనీ డివిజన్ అధ్యక్షుడు మనోజ్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు



ప్రజాపక్షం/బేగంపేట్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు కావాలని పలువురు బిఆర్ఎస్ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని ఉప్పలమ్మ ఆలయం లేన్‌లో బిఆర్ఎస్ నాయకులు ఎస్.రాజేందర్, జి.సాయికృష్ణ గ్రాడ్యుయేట్‌లు నిందిన దరఖాస్తుల ఎన్‌రోల్‌మెంట్ ఫారాలను సేకరించడం జరిగింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు ప్రేమ్ కుమార్, దేశాపాక శ్రీనివాస్, అరుణ్ గౌడ్, వినయ్ సుంకపక, కుమార్ యాదవ్, మెట్టు సాయి, దాకి అశోక్, చిన్న, జగదీష్ గౌడ్, లక్ష్మి , జాఫర్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన




ప్రజాపక్షం/ఫలక్‌నుమా: వినియోగదారుల అవగాహన దినోత్సవం సందర్భంగా ఫలక్‌నుమా సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యుత్ సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ఫలక్‌నుమా ఆపరేషన్స్ ఎఇ రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సబ్ డివిజన్‌లోని చత్రినాక డివిజన్‌లో దస్తగిరి, ఫలక్‌నుమా డివిజన్‌లో శివకుమార్, చాంద్రాయణగుట్ట డివిజన్‌లో అబ్దుల్ జమీర్ వినియోగదారుల సందేహాలను నివృత్తి చేయడం జరిగింది. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు కొత్తగా టిఆర్‌ల ఏర్పాటు, కొత్త లైన్ల ఏర్పాటు, 11 కెవి ఫీడర్ల విభజన వంటి పనులు చేపట్టడం జరిగింది.

దీపావళి ఉత్సవాలకు ఆహ్వానాలు



ప్రజాపక్షం/చార్మినార్: దీపావళి పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రారంభం కానున్న మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ పలువురు ప్రముఖులకు ఆలయ ట్రస్టీ చైర్మన్ శశికళ ఆహ్వానాలు అందించారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రసాద్ శుక్ల, మాజీ మంత్రులు కేటిఆర్, తలసాని, రావుల శ్రీధర్‌రెడ్డి, దానోజు శ్రవణ్‌కుమార్‌లకు వేర్వేరుగా ఉత్సవాల ఆహ్వాన పత్రాలను అందించడం జరిగింది. ప్రత్యేక పూజలు, దీపాలంకరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని, అమ్మవారి ఆశీస్సులు పొందాలని శశికళ కోరారు.

ఉద్యోగుల పదవీ విరమణ



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 23 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వీరిలో ఆపరేషన్స్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించిన వాసా సత్యనారాయణ సహా.. పలు స్థాయుల్లో పనిచేసే ఉద్యోగులు ఉన్నారు. వీరందరిని ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జిఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సిఎలో రాజ్యాంగబద్ధ పాలన పునరుద్ధరించాలి

- *హెచ్‌సిఎ కార్యకలాపాలు హైదరాబాద్‌కే పరిమితం చేయాలి*
- *టిజి-20 లీగ్ ఖాతాలపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలి: టిసిఎ డిమాండ్*



ప్రజాపక్షం/ హైదరాబాద్:హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో రాజ్యాంగబద్ధ పాలనను పునరుద్ధరించి, పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) డిమాండ్ చేసింది. గడువు ముగిసిన అపెక్స్ కౌన్సిల్‌కు పొడిగింపులు ఇవ్వడం, ఆర్థిక అక్రమాలు, పరిపాలనా లోపాలను అరికట్టాలని హైకోర్టు నియమించిన సింగిల్ మెంబర్ కమిటీ కి విజ్ఞప్తి చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం హెచ్‌సీఏ కార్యకలాపాలను హైదరాబాద్‌కే పరిమితం చేసి, మిగిలిన 32 జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి బాధ్యతలను టిసిఎకు అప్పగించాలని కోరింది. మంగళవారం టిసిఎ అండర్16 రాష్ట్ర లీగ్ ఫేజ్ 1 షెడ్యూల్ విడుదల సందర్భంగా టిసిఎ జనరల్ సెక్రటరీ డి.గురువా రెడ్డి ఈ డిమాండ్లు చేశారు. బిసిసిఐ గుర్తింపు, స్వతంత్ర పూర్తి సభ్యత్వం కోసం తమ సంఘం కృషి చేస్తోందని, జిల్లాల్లో యువ క్రికెట్ ప్రతిభను వెలికితీసి బిసిసిఐ టోర్నమెంట్లలో పాల్గొనేలా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. హెచ్‌సిఎ అపెక్స్ కౌన్సిల్ మూడేళ్ల పదవీకాలం అక్టోబర్ 20తో ముగిసినా, అక్టోబర్ 29న మధ్యంతర పొడిగింపు ఇవ్వడాన్ని టిసిఎ ప్రశ్నించింది. ఈ నిర్ణయాన్ని బాధిత క్లబ్‌లతో కలిసి హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాలు చేసినట్లు వెల్లడించింది. జనరల్ బాడీ అనుమతి లేకుండా టీజీ20 లీగ్ కోసం రూ.52 కోట్లకు పైగా ఖర్చు చేశారని ఆరోపిస్తూ, లీగ్ ఖాతాలపై కోర్టు పర్యవేక్షణలో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. తక్కువ ధరలకు వచ్చిన బిడ్లను ఎందుకు తిరస్కరించారో సమాధానం చెప్పాలని కోరింది. ప్రతిపాదిత సిట్ విచారణలో ప్రయోజనాల ఘర్షణకు అవకాశం ఉందని పేర్కొన్న టిసిఎ, నిష్పాక్షికత కోసం సిబిఐ, ఇడి లేదా ఎస్ఎఫ్ఐఒ వంటి స్వతంత్ర సంస్థలతో కోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేసింది. జిల్లాల పేర్లతో ఉన్న క్లబ్‌లు హైదరాబాద్ నుంచే పనిచేస్తున్నాయని విమర్శించింది.హెచ్‌సిఎలో పారదర్శకంగా వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించాలని, బిసిసిఐ సంస్కరణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం స్వతంత్ర ఎన్నికల అధికారిని నియమించాలని టిసిఎ డిమాండ్ చేసింది. హైదరాబాద్ వెలుపల జిల్లాల్లో క్రికెట్ నిర్వహణ బాధ్యతలను టిసిఎకు అప్పగించేలా బిసిసిఐకి సిఫార్సు చేయాలని కోరింది. పరిపాలనా వివాదాలు, ఆర్థిక అక్రమాల వల్ల తెలంగాణ యువ క్రికెటర్ల భవిష్యత్తు దెబ్బతినకూడదని గురువా రెడ్డి పేర్కొన్నారు.

మాతా సందర్శనకు ఏర్పాట్లు



ప్రజాపక్షం/కంటోన్మెంట్: ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మాత అమృతానందమయి నగర పర్యటన నేపథ్యంలో తగిన ఏర్పాటు చేయాల్సిందిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అధికారులకు సూచించారు. మంగళవారం మహేంద్రహిల్స్‌లోని అమృతానందమయి మఠం నిర్వాహకులు, కంటోన్మెంట్, పోలీస్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం నగరానికి రానున్న అమృతానందమయి 12వ తేదీ వరకు ఇక్కడే బస చేయనున్నారు. సుమారు 1000 మంది భక్తులు వాలంటీర్లతో ఆమె ఇక్కడికి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆమె బస్సుతో పాటు అనుచరుల వాహనాల పార్కింగ్ ఇతరత్రా సదుపాయాలు కల్పించాలని సూచించారు.

పైప్‌లైన్ పనులు ప్రారంభం



ప్రజాపక్షం/కంటోన్మెంట్: తాగునీటి సమస్య పరిష్కారం కోసం కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 4వ వార్డు, రాజలింగం గార్డెన్, శ్రీనివాస గార్డెన్ ప్రాంతాల్లో మంచినీటి పైప్‌లైన్ పనులు చేపట్టారు. కంటోన్మెంట్ బోర్డు నిధులు రూ. 9 లక్షల వ్యయంతో చేపట్టిన పనులను నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద ప్రారంభించారు.

కేటాయించిన స్థలాలే ఇవ్వాలి

జెఎన్‌జెహెచ్‌ఎస్ మహాధర్నాలో విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: జర్నలిస్టులకు కేటాయించిన నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాల విషయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకుని సభ్యుల బా ధలను తొలగించి మానసిక స్థయిర్యా న్ని కల్పించాల్సిందిగా జెఎన్‌జెహెచ్‌ఎస్ మహాధర్నాలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్, పేట్ బషీరాబాద్ స్థలాలను జవహర్ లాల్‌నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ ధర్నాచౌక్ వద్ద టీమ్ జెన్జీ నిర్వహించిన మహాధర్నాలో తీర్మానం ఆమోదించారు. ఈ సందర్భంగా ఆంధ్రభూమి మాజీ సంపాదకుడు ఎంవిఆర్ శాస్త్రి మాట్లాడుతూ.. జెన్‌జె సొసైటీ సభ్యులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించి చివరికి వీధుల పాలుచేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జెఎన్‌జె సభ్యులకు ఇండ్ల స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. న్యాయపరంగా వెసులుబాటు ఉన్నందున ఈ రెండు స్థలాలు విషయంలో ప్రభుత్వం ఆలోచన చేసి కొత్త ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్ పివి రమణరావు మాట్లాడుతూ, ప్రభుత్వానికి డబ్బు చెల్లించి 18 ఏండ్లు గడుస్తున్నా స్థలాలు దక్కడం లేదని వాపోయారు. కొంతమంది గిట్టని వాళ్ళు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మరాదన్నారు. ధర్నాలో పలువురు జర్నలిస్టులు పాల్గొని ప్రసంగించారు.

భద్రతే లక్ష్యంగా నిర్మాణాలు

26 నుంచి హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు




ప్రజాపక్షం/ఖైరతాబాద్: పెరుగుతున్న పట్టణీకరణ, ప్రకృతి వైపరీత్యాలు, మౌలిక సదుపాయాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రంగంలో ఆధునిక సాంకేతికత, సుస్థిర నిర్మాణ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ (ఏసీసీఈ) హైదరాబాద్ సెంటర్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 26, 27 తేదీల్లో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అంతర్జాతీయ సదస్సు, బిల్ టెక్ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు చైర్మన్ భీంరావు జాలిగామ, ఆర్గనైజింగ్ చైర్మన్ రాజ్‌కుమార్ కాచర్ల వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన నివాసాలు అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చే నిర్మాణ విధానాలపై సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధులు కాశీరాం, మహేందర్ రెడ్డి, రమేష్ కుమార్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు గడువు పొడిగించాలి



ప్రజాపక్షం/ఉస్మానియావర్సిటీ: పట్టభద్రుల ఓటరు నమోదు గడువు పొడిగించాలని విద్యార్థి సేన డిమాండ్ చేసింది. మంగళవారం మహబూబ్‌నగర్— రంగారెడ్డి—హైదరాబాద్‌తో పాటు వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ని యోజకవర్గాల ఓటరు నమోదు గడువును పొడిగించాలని కోరుతూ విద్యా ర్థి సేన ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చింతల పవన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రిషబ్ జైన్‌తో కలిసి అదనపు ప్రధాన ఎన్నికల అధికారి జి.శ్రీనివాసచారిని కలిసి వినతిపత్రం అందించడం జరిగింది. దసరా, దీపావళి పండుగలు, ఓటరు నమోదుపై సరైన అవగాహన లేకపోవడం, ఆన్‌లైన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యల కారణంగా ఇంకా అనేకమంది అర్హులైన పట్టభద్రులు ఫారం18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోలేకపోయారని విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు టికె శివప్రసాద్ తెలిపారు.

పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు



ప్రజాపక్షం/బేగంపేట్: ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా నిర్వహించిన మహాయాత్రను విజయవంతం చేసిన శ్రేణులకు బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్(నందు) కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. కేంద్ర హోంమంత్రి పాల్గొన్న ర్యాలీ విజయవంతం కావడం చూస్తుంటే ప్రజలు ఈ సారి కచ్చితంగా బిజెపిని అధికారంలోకి తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నేతలు సి.విజయ్ కుమార్, అశోక్‌యాదవ్, శ్రవణ్, బాబురావు, మైసూర్ మధుసూదన్, జె.ఆనంద్, పాండియన్, క్రాంతి, యాదగిరి, అభిషేక్, యాకూబ్ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కాండ్యూట్ మరమ్మతు పనులు



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: తాగునీరు అందించేందుకు గండిపేట్ నుంచి ఏర్పాటైన కాండ్యూట్ మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి. వందేళ్ల క్రితం తాగునీటిని సరఫరా చేసేందుకు ఏర్పాటైన కాండ్యూట్‌కు లీకేజీలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలోనే సబ్జా కాలనీ, టోలిచౌకి, మణికొండ ప్రాంతాల్లో ఏర్పడిన లీకేజీలను అరికట్టేందుకు జలమండలి మంగళవారం ఉదయం 6 గంటల నుంచి 4వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటల వరకు 36 గంటల పాటు షట్‌డౌన్ ప్రకటించి పనులు చేపట్టడం జరిగింది. ఈ నేపథ్యంలో 20 ఎంజీడీల సామర్థ్యం కలిగిన కాండ్యూట్ మరమ్మతు పనులను అధికారులు వేగవంతం చేశారు. నిర్ణీత గడువు కంటే ముందుగానే పనులు పూర్తి చేసి, ప్రభావిత ప్రాంతాలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతున్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి

జాయింట్ డైరెక్టర్‌కు యూనియన్ వినతి



ప్రజాపక్షం/తిరుమలగిరి: సమస్యలను పరిష్కరించాలని బోయిన్‌పల్లి వెజిటేబుల్ మార్కెట్ హమాలీలు డిమాండ్ చేశారు.ప్రతి రెండు సంవత్సరాలకు పెంచవలసిన హమాలీ రేట్లు పెంచాలని అనేక రోజులుగా కోరుతున్నా పెంచడం లేదని, మార్కెట్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, యూనిఫారం, వైద్య సదుపాయాలు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల సౌకర్యం లేకుండా ఉన్నామని.. తక్షణం సమస్యలను పరిష్కరించాలని మంగళవారం బోయిన్‌పల్లి మార్కెట్ వ్యవసాయ మార్కెట్ యార్డ్స్ జాయింట్ డైరెక్టర్‌కు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహా మాట్లాడుతూ, హమాలీ రేట్ల పెంపుదల కోసం సెప్టెంబర్ 17వ తేదీన లెటర్ ఇచ్చినా.. ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమని ఆందోళన వ్యక్తం చేశారు. యూనిఫారం దాదాపు సంవత్సర కాలంగా పెండింగ్‌లో ఉన్నదని, మంచినీటి ట్యాంకులు రిపేర్‌లో ఉన్నాయని, దోమల బెడద అధికంగా ఉన్నదని, మరుగుదొడ్ల సౌకర్యం, ప్రథమ చికిత్స ఆసుపత్రి వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవని వారు వివరించారు. ఈ సందర్భంగా వినతిపత్రం తీసుకున్న మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డిబి దేవేందర్, ఉన్నత శ్రేణి కార్యదర్శి వెంకన్న స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కార్మికుల సమస్యలను తక్షణ పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఏ.గట్టయ్య, ఉపాధ్యక్షులు సమ్మయ్య, రాజు, రాజయ్య, లింగం, శ్రీశైలం ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

50శాతానికి రిజర్వేషన్లు పెంచాలి

తెలంగాణ ముదిరాజుల ఆత్మగౌరవ పోరాట సంఘం



ప్రజాపక్షం/ఖైరతాబాద్: బిసిల జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగాలు, శాసనసభలు, స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలంగాణ ముదిరాజుల ఆత్మగౌరవ పోరాట సంఘం (టిమాప్స్) డిమాండ్ చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర కన్వీనర్, హైకోర్టు న్యాయవాది పిట్టల భూమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణలో బిసిల జనాభా 56.4 శాతంగా ఉన్నప్పటికీ తగిన ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. బిసిలకు జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు కల్పించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు అవగాహన



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: విద్యుత్ వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం చూపించడమే లక్ష్యంగా టిజిఎన్‌పిడిసిఎల్ పరిధిలోని 21 సర్కిళ్లలో మంగళవారం జాతీయ విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ జోన్లు, సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది, వినియోగదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా, లో వోల్టేజ్, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ బిల్లులు, కొత్త సర్వీసులు, 11 కేవీ హెల్పీ సర్వీసులు, యూనిఫామ్ సర్వీస్ లైన్ ఛార్జీలు, సోలార్ నెట్ మీటర్లు, గృహ జ్యోతి తదితర అంశాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. వారి ఫిర్యాదులు, సూచనలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట్, సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట్, మేడ్చల్, యాదాద్రి, నల్గొండ తదితర సర్కిళ్ల పరిధిలోని దేవరకద్ర, జడ్చర్ల, ఆర్సీ పురం, కీసర, జీడిమెట్ల, కూకట్‌పల్లి, కల్వకుర్తి, కోస్గి, నర్సాపూర్, దుబ్బాక, హుస్నాబాద్, చౌటుప్పల్, తాండూరు తదితర ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల రైతులు, ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

మెట్రో జోన్ కార్యాలయంలో..

మింట్ కాంపౌండ్‌లోని మెట్రో జోన్ సీఈ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి విద్యుత్ వినియోగదారుల అంబుడ్స్‌మెన్ ఎం.శ్రీనివాస్ చారి, సిజిఆర్ఎఫ్1 చైర్‌పర్సన్ కె.సాయిబాబా, సిజిఆర్ఎఫ్2 చైర్‌పర్సన్ డి.నురేష్, సభ్యులు శోభారాణి, లలిత బాతుల, బి.అనిల్‌రెడ్డి, మెట్రో జోన్ సీఈ పి.కరుణాకర్ బాబు హాజరయ్యారు. ఇదిలా ఉండగా... కొండాపూర్ డివిజన్‌లో మెరుగైన సేవలు అందించినందుకు కెపిహెచ్‌బి సెక్షన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ సిబ్బందికి ధర్నారెడ్డి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది.

బియ్యం వ్యాపారస్థులపై దాడులు

- *13క్రిమినల్ కేసులు, 22లీగల్ మెట్రాలజీ కేసులు*
- *ప్రధాన రేషనింగ్ అధికారి శ్రీనివాస్*



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: హైదరాబాద్ జిల్లాలో బియ్యం వ్యాపారస్థులపై దాడులు జరిపి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారని ప్రధాన రేషనింగ్ అధికారి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే బియ్యం రకాలకు కూడా ధరలను ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. గత పది రోజులుగా జరిపిన దాడుల్లో జిల్లాలో 13 క్రిమినల్, 22లీగల్ మెట్రాలజీ కేసులు నమోదు చేసామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం అమ్మాలని, వాటిపై వ్యాపార సంస్థలు, దుకాణాల ముందు ప్రదర్శించాలని ఆయన తెలిపారు. వినియోగదారులు బియ్యం కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై ముద్రించిన ధరలను, బరువును తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. అధిక ధరలకు విక్రయించడం, తూకంలో తేడాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

అరేబియా సముద్రంలో భారత్ నేవీ రెస్క్యూ ఆపరేషన్

- ఇరాన్ జాలరి నౌకలో చెరలో ఉన్న 20 మంది సిబ్బందికి విముక్తి
- నౌకల భద్రతకు కట్టుబడి ఉన్నామని ప్రకటన
- భారత్ నావికుల వృత్తి నైపుణ్యాన్ని ప్రశంసించిన ఇరాన్
- ఇరుదేశాల మైత్రికి ఈ ఆపరేషన్ ప్రతిబింబమని ప్రకటన





న్యూఢిల్లీ: ఇరాన్ మత్స్యకారులనౌకను సోమాలియా సముద్ర దొంగలు హైజాక్ చేశారు.భారత నౌకాదళం మొట్టమొదట స్పందించి చాలా చాకచక్యంగా పోరాడి అరేబియా సముద్రంలో వేల కిలోమీటర్ల దూరం వెళ్లి విజయవంతంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించింది.ఇరాన్ మత్స్యకారుల నౌకలో ఉన్న 20 మంది సిబ్బందిని సురక్షితంగా విడిపించింది.భారత నౌకాదళం ఎలాంటి హింస చెలరేగకుండా నైపుణ్యంతో 48 గంటలసేపు ఈ ఆపరేషన్ నిర్వహించి ఇరాన్‌కు చెందిన మత్స్యకారులు, ఇతర సిబ్బందిని నవంబరు రెండో తేదీన విజయవంతంగా విడిపించింది. దీంతో ఇరాన్ దౌత్య కార్యాలయం భారత్‌కు సోషల్ మీడియా ద్వారా కృతజ్ఞతలు తెలియజేసింది. సముద్ర దొం గలు అక్టోబరు నెలారంభంలో హైజాక్ చేసిన జాలర్ల నౌకను చాలా జాగ్రత్తగా గమనిస్తూ,దాని మా ర్గాన్ని నావికులు అనుసరించారు.హైజాక్‌కు గు రైన నౌక కదలికలపై నిఘా కొనసాగించారు. భారత నౌకకు అండగా ఉండేందుకు వైమానికదళం సి–17 ఎయిర్ క్రాఫ్ట్‌ను ఉపయోగించారు. ఉమ్మడి సమన్వయ చర్యల ద్వారా ఎంతో ఉపాయంతో నౌకలోకి ప్రవేశించారు. 20 మంది జాలర్లను విడుదల చేయించారు.ఈ ఆపరేషన్ భారత నావికుల సన్నద్ధతను, సంక్లిష్టమైన నావికాదళ భద్రత కార్యకలాపాలలో సమన్వయపూర్వక సేవలను ఈ ఆపరేషన్ చాటి చెప్పిందని భారత నావికాదళం పేర్కొంది. మొట్టమొదట అందరికంటే ముందుగా స్పందించిన దేశంగా ఒక భద్రతా భాగస్వామిగా హిందూమహాసముద్ర ప్రాంతంలో భద్రతకు భారత్ కట్టుబడి ఉందని నావికాదళం స్పష్టం చేసింది. ఎంతో చిత్తశుద్ధితో భారత నావికులు సమర్థవంతంగా ఈ ఆపరేషన్ నిర్వహించి తమ దేశ జాలర్లను కాపాడారని ఇరాన్ దౌత్య కార్యాలయం పేర్కొంది. భారత నావికుల ధైర్య, సాహసాలను, వృత్తినైపుణ్యాన్ని ప్రశంసించింది. మానవతాసహాయం, వైపరీత్యాల నియంత్రణలో సహకంపట్ల భారత్కు ఉన్న బలమైన చిత్తశుద్ధిని, సరిహద్దులకు అతీతంగా భారత్‌పాత్రను ఈ ఆపరేషన్ ప్రతిబింబించిందని,ఇరు దేశాల మైత్రికి ఒక సాక్షీభూతంగా నిలిచిందని ఇరాన్ కొనియాడింది. ఈ ఆపరేషన్ సందర్భంగా నావికులు, జాలర్లు ఎవ్వరూ గాయపడలేదని భారత నావికాదళం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో భారత యుద్ధ నౌక ఐఎన్ఎస్–కోల్‌కతా, వైమానికి దళానికి చెందిన సి–17 విమానాలు, మెరైన్ కమాండోలు పాల్గొన్నారు. నౌకాదళం, వైమానికదళం ఎంతో సమన్వయంతో ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అజిని అనేక ఇరాన్‌కు చెందిన జాలర్ల నౌకను సాయుధులైన సోమాలియా సముద్ర దొంగల గ్రూపు గతనెలలో హైజాక్ చేసింది.ఈ హైజాకింగ్ వల్ల సముద్రంలో నౌకల భద్రతకు ఇకమీదట అతి పెద్ద ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని, దీనిని ఉపేక్షించకూడదని, ఉపేక్షిస్తే ఈ పరిస్థితులు మితిమీరిపోతాయనే ఉద్దేశంతో భద్రతను కట్టుదిట్టం చేసేందుకు అహింసాత్మక పద్ధతులలో ఈ ఆపరేషన్‌ను భారత్ నావికాదళం నిర్వహించింది. సముద్ర దొంగలు ఈ నౌకను ప్రధాన వేదికగా చేసుకుని ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలకు వ్యతిరేకంగా మరిన్ని దాడులకు పాల్పడే ప్రమాదం ఉందని, లక్ష్యంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు.

మరో పర్యావరణ విపత్తు

మహారాష్ట్ర విద్యుత్ ప్రాజెక్టు కోసం చెట్లను నరికివేయడాన్ని తప్పుబట్టిన కాంగ్రెస్



న్యూఢిల్లీ : మహారాష్ట్రలోని పశ్చిమ కనుమలలో ఒక జలవిద్యుత్ ప్రాజెక్ట్ కోసం దాదాపు 1,100 చెట్లను నరికివేశారన్న వార్తలను కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ మంగళవారం తీవ్రంగా ఖండించారు. ఇది దేశ ప్రజలపై రుద్దుతున్న 'పర్యావరణ విధ్వంసానికి' మరో ఉదాహరణ అని ఆయన అన్నారు. దాదాపు 1,100 చెట్లను నరికివేశారని, వాటిలో 32,000కు పైగా చెట్లను తొలగింపునకు గుర్తించారని పేర్కొన్న ఒక మీడియా నివేదికను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ షేర్ చేశారు. మహారాష్ట్రలోని పశ్చిమ కనుమలలోని ఒక పంప్డ్‌స్టోరేజ్ జలవిద్యుత్ ప్రాజెక్ట్ అటవీ హక్కులు, గిరిజనుల జీవనోపాధి, పర్యావరణ ప్రభావంపై ఆందోళనలను రేకెత్తించింది. 'మన దేశ ప్రజలపై రుద్దబడుతున్న పర్యావరణ విధ్వంసానికి ఇది మరో ఉదాహరణ' అని ఆ నివేదికను ట్యాగ్ చేస్తూ, రమేశ్ పేర్కొన్నారు. దీని వల్ల కలిగే ప్రయోజనాలను ఎవరు పొందుతున్నారు, నష్టాన్ని ఎవరు భరిస్తున్నారు? అని ప్రశ్నించారు. వచ్చే నెలలో ఒక జలవిద్యుత్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాకకు ముందు, పర్యావరణ సున్నితమైన భీమాశంకర్ వన్యప్రాణుల అభయారణ్యం సమీపంలో 32,000 పైగా చెట్లను నరికివేయాలని మహారాష్ట్ర అటవీ శాఖను ఆదేశించారని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ ఆరోపించిన కొద్ది రోజులకే రమేశ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాయ్‌గడ్ జిల్లాలో రూ.13,505 కోట్ల సైదొంగార్ –1 కర్జత్ పంప్డ్ స్టోరేజ్ జలవిద్యుత్ ప్రాజెక్టు కోసం 233 హెక్టార్ల భూమిని మళ్లించడానికి అనుమతి మంజూరైనట్లుగా ఒక అటవీ అధికారి జారీ చేసినట్లుగా భావిస్తున్న లేఖను రౌత్ ఎక్స్ పోస్టులో పంచుకున్నారు. ఈ ప్రాజెక్టు కోసం చెట్లను నరికివేయడాన్ని ప్రతిపక్షాలు, పర్యావరణ కార్యకర్తలు తీవ్రంగా ఖండించారు. మహాయుతి ప్రభుత్వం అడవులను, వన్యప్రాణులను నాశనం చేస్తోందని వారు ఆరోపించారు.

భారత్–రష్యా సంబంధాలు...
శతాబ్దాల ప్రజల సంబంధాలలో వేళ్లూనుకున్నాయ్

రష్యన్ దౌత్యవేత్త పీటర్ సిజోవ్



న్యూఢిల్లీ : భారత్–రష్యా సంబంధాలను మరెవ్వరూ మార్చలేరని, మారుతున్న ప్రపంచ భోగోళిక రాజకీయ పరిస్థితుల్లోనూ, ఈ బంధం కాలపరీక్షను తట్టుకుని నిలిచిందని ఒక రష్యన్ దౌత్యవేత్త అన్నారు. సోమవారం సాయంత్రం ఇక్కడి 'ఇండియా హ్యాబిటేట్ సెంటర్‌లో' జరిగిన ఒక రష్యన్ సాంస్కృతిక కార్యక్రమంలో రష్యన్ రాయబార కార్యాలయ ప్రతినిధి పీటర్ సిజోవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'మేం స్నేహితులం. మమ్ములను ఇంకెవ్వరూ మార్చలేరు' అని సిజోవ్ 'పిటిఐ'తో మాట్లాడిన సందర్భంగా వ్యాఖ్యానించారు. రెండు దేశాల మధ్య సంబంధాలు కేవలం దశాబ్దాల దౌత్యసంబంధాలలో కాకుండా శతాబ్దాల ప్రజల మధ్య సంబంధాలలో కూడా పాతుకుపోయాయని ఆయన తెలిపారు. మహాత్మాగాంధీ, రష్యన్ రచయిత లియోటాల్ స్టాయ్‌ల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను ప్రస్తావిస్తూ గాంధీ టాల్ స్టాయ్‌ను గురువుగా భావించారని, వారిద్దరూ వ్యక్తిగతంగా ఎప్పుడూ కలుసుకోనప్పటికీ ఉత్తరాలు పరస్పరం మార్పిడి చేసుకున్నారని సిజోవ్ పేర్కొన్నారు. ఇది రెండు దేశాల మధ్య చారిత్రక ప్రజల సంబంధాల పటిష్టతకు ఒక ఉదాహరణగా చెప్పారు. రష్యాలో భారతీయ సినిమాకు, భారతదేశంలో రష్యన్ బాలెట్‌కు ఉన్న దీర్ఘకాలిక ప్రజాదరణను కూడా సిజోవ్ నొక్కిచెప్పారు. సాంస్కృతిక మార్పిడులు ద్వైపాక్షిక సంబంధాలలో ఒక ముఖ్యమైన భాగంగా నిలిచాయని అన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్యసంబంధాలు ఏర్పడి 80 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, భారతదేశంలో పలు సంగీత, కళా, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని రష్యా యోచిస్తోందని పీటర్ సిజోవ్ చెప్పారు. భారతదేశంలో రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ సతీమణి దయానా అలిపోవా, ద్వైపాక్షిక సంబంధాలను కేవలం ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారానికి మించి ముందుకు తీసుకెళ్లి, ప్రజల మధ్య ప్రత్యక్ష సంబంధాలను నిర్మించడంలో సాంస్కృతిక దౌత్యం ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. 'సాంస్కృతిక సంబంధం చాలా ముఖ్యం. ఎందుకంటే సంస్కృతి ప్రజల్లోకి వెళుతుంది. అది ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తి వెళ్లినట్టు ఉంటుంది. ఇది ప్రభుత్వ సంబంధం కాదు. కానీ ముఖాముఖీ సంబంధం' అని ఆమె పిటిఐకి తెలిపారు. యువతను పరిచయం చేయడానికి రష్యా ప్రయత్నం చేస్తోందని అలిపోవా అన్నారు. ప్రత్యక్ష ప్రదర్శనల ద్వార భారతీయులకు వారి సంస్కృతిని పరిచయం చేస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలలో వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ఢిల్లీలోని పాఠశాలలతో కలిపి పనిచేస్తోంది. రష్యా సాంస్కృతిక దినోత్సవాలలో భాగంగా, హోలీ ట్రినిటీ–సెయింట్ సెర్గియస్ లావ్రా, మాస్కో థియోలాజికల్ అకాడమీల సంయుక్త గాయక బృందం రష్యన్ పవిత్ర గాయక బృందం సంగీతాన్ని, సాంప్రదాయ జానపద గీతాలను ప్రదర్శించిన కార్యక్రమం ఇది. భారతదేశం, రష్యా మధ, ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో కొనసాగుతున్న సాంస్కృతిక మార్పిడులలో ఈ కార్యక్రమం ఒక భాగం.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా...
మరింత అందుబాటులోకి న్యాయవ్యవస్థ

సిజెఐ సూర్యకాంత్



రాంచీ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా న్యాయవ్యవస్థను మరింత అందుబాటులోకి, సమర్థవంతంగా, ప్రతిస్పందించేలా చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ అన్నారు. డిజిటల్ ఆవిష్కరణలు న్యాయపరమైన వివేకానికి, మానవ తీర్పుకు పూరకంగా ఉండాలి తప్ప వాటి స్థానాన్ని భర్తీ చయకూడదని ఆయన నొక్కిచెప్పారు. సిజెఐ సూర్యకాంత్ సోమవారం ఇక్కడ జార్ఖండ్ హైకోర్టు డేటా సెంటర్ ప్రారంభోత్సవంలో ఒక సభను ఉద్దేశించి మాట్లాడారు. న్యాయవ్యవస్థలో సాంకేతిక కార్యక్రమాల విజయాన్ని ఏర్పాటుచేసిన వ్యవస్థల అధునాతనతో కాకుండా అవి వ్యాజ్యదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, పౌరులకు కలిగించే స్పష్టమైన మార్పుతో కొలవాలని ఆయన అన్నారు. ఈ ప్రారంభోత్సవంతో పాటు హైకోర్టు నవీకరించిన వెబ్‌సైట్, జార్ఖండ్ సివిల్ కోర్టుల కోసం ఆన్‌లైన్ ధృవీకరించిన కాపీ అప్లికేషన్, వ్యక్తిగతీకరించిన కేసుల జాబితా, స్పీచ్ టూ టెక్స్ట్ సాఫ్ట్‌వేర్‌లను కూడా సూర్యకాంత్ ప్రారంభించారు. న్యాయపరిపాలనను బలోపేతం చేసే దిశగా ఈ చర్యలు ముఖ్యమైనవని అభివర్ణిస్తూ, ఆధునిక న్యాయస్థానాలు డిజిటల్ రికార్డులు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, సమాచారాన్ని సకాలంలో పొందడంపై ఆధారపడుతున్నాయని సిజెఐ పేర్కొన్నారు. 'అందువల్ల, ఈ అవసరాలను తీర్చడానికి, న్యాయం అందించడంలో మరింత విశ్వసనీయత, సామర్థ్యాన్ని నిర్ధారించడానికి న్యాయవ్యవస్థ మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందాలి' అని సూర్యకాంత్ ఉద్ఘాటించారు. సాంకేతిక పురోగతితో పాటు, పటిష్టమైన సైబర్ సెక్యూరిటీ రక్షణలు, నమ్మకమైన బ్యాకప్ ఏర్పాట్లు, రెగ్యులర్ సిస్టమ్ పరీక్షలు, తగినంత శిక్షణ పొందిన సాంకేతిక సిబ్బంది కూడా ఉండాలని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నొక్కిచెప్పారు. 'న్యాయ రికార్డులలో సున్నితమైన సమాచారం ఉంటుంది. వాటిని గోప్యంగా ఉంచాలి. అనధికార ప్రవేశం, నష్టం, అంతరాయం నుంచి రక్షణ కల్పించబడింది' అని తెలిపారు. న్యాయ పరిశోధన, పత్రాల తయారీ, సమాచార నిర్వహణకు సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయపడగలవని, కానీ, కక్షిదారుల వాదనలను నిష్పక్షపాతంగా వినడం, సాక్షాలను అంచనావేయడం, చట్టాలకు అనుగుణంగా వివాదాలను పరిష్కరించడం వంటి న్యాయమూర్తి బాధ్యతను అవి భర్తీ చేయలేవని సిజెఐ సూర్యకాంత్ హెచ్చరించారు. న్యాయ వ్యవస్థలోని ప్రతీ సాంకేతిక కార్యక్రమానికి గోప్యత, కచ్చితత్వం, జవాబుదారీతనం, మానవ పర్యవేక్షణ కేంద్రంగా ఉండాలని ఆయన నొక్కిచెప్పారు. డిజిటల్ అక్షరాస్యత, నమ్మకమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ లేదా ఆన్‌లైన్ ప్లాట్‌ఫారములను ఉపయోగించే సామర్థ్యంలేని ప్రజలకు డిజిటలైజేషన్ కొత్త అడ్డంకులను సృష్టించకుండా చూడాలని సిజెఐ హెచ్చరించారు. సుమారు రూ.25 కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రధాన డేటా సెంటర్ ప్రాజెక్ట్, డిజిటల్ న్యాయ రికార్డులు, కోర్టు దరఖాస్తులకు మద్దతు ఇవ్వడానికి అవసరమైన కంప్యూటింగ్ సామర్థ్యం, స్టోరేజీ, కనెక్టివిటీ. భద్రత, బ్యాకప్ సౌకర్యాలను అందిస్తుంది. స్పష్టమైన, విశ్వసనీయమైన, వినియోగదారునికి అనుకూలమైన డిజిటల్ ప్లాట్‌ఫారమ్ సమయాన్ని ఆదా చేయ గలదని, అనిశ్చితిని తగ్గించగలదని, పారదర్శకతను మెరుగుపర్చగలదని సూర్యకాంత్ పేర్కొన్నారు.

మణిపూర్ కాంగ్‌పోక్పి జిల్లాలో రెండవ రోజూ బంద్

- స్తంభించిన జనజీవనం, మూతపడ్డ మార్కెట్లు, వాణిజ్య సంస్థలు
- యువకుల హత్యపై ప్రభుత్వం స్పందించకపోవడంతో బంద్‌కు పిలుపునిచ్చిన 'కమిటీ ఆన్ ట్రైబల్ యూనిటీ'



ఇంఫాల్ : కల్లోలిత మణిపూర్‌లోని కాంగ్‌పోక్పి జిల్లాలో మంగళవారం వరుసగా రెండో రోజు జనజీవనం స్తంభించింది. ఇద్దరు యువకుల హత్యకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ, ఒక గిరిజన సంస్థ పిలుపునిచ్చిన బంద్ కారణంగా మార్కెట్లు, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. జాతీయ రహదారి గుండా ఇంఫాల్ వైపు వస్తున్న అనేక వస్తు రవాణా వాహనాలు కాంగ్‌పోక్పిలోకి ప్రవేశించలేక, పొరుగున ఉన్న సేనాపతి జిల్లాలో నిలిచిపోయాయని పోలీసులు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లాలో అదనపు భద్రతా బలగాలను మోహరించినట్లు ఒక ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఇద్దరు కుకీ పౌరుల హత్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ 'కమిటీ ఆన్ ట్రైబల్ యూనిటీ' (సిఒటియు) ఈ బంద్‌కు పిలుపునిచ్చింది. కొన్ని రోజుల క్రితం అదృశ్యమైన ఇద్దరు యువకుల మృతదేహాలు, ఆదివారం ఉదయం పొరుగున ఉన్న సేనాపతి జిల్లాలోని కొండ ప్రాంతంలో విక్రుతమైన స్థితిలో లభ్యమయ్యాయి. మృతదేహాలు దొరికిన తర్వాత, సిఒటియు ఆదివారం నుంచి కాంగ్‌పోక్పిలో 24 గంటల బంద్‌ను ప్రకటించింది. ఆ తర్వాత సోమవారం రాత్రి దీనిని మరో 48 గంటల పాటు పొడిగించింది. 'ఇద్దరు అమాయక కుకీజో పౌరుల దారుణ, అమానవీయ హత్యకు సంబంధించి న్యాయం చేసేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం, సిగ్గుచేటైన నిర్లక్ష్యాత్మక లోపం, మౌనం వహించడం' వంటి వైఖరులకు నిరసనగా బంద్‌ను పొడిగించినట్లు ఆ కుకీ సంస్థ పేర్కొంది. మణిపూర్‌లో 2023 మే నెలలో లోయ ప్రాంతానికి చెందిన మైతేయి వర్గానికి, కొండ ప్రాంతానికి చెందిన కుకీ వర్గానికి మధ్య మొదలైన జాతి ఘర్షణల్లో ఇప్పటి వరకు కనీసం 306 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 49 మంది అదృశ్యమయ్యారు, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. ఇటీవలి నెలల్లో కుకీ, నాగా వర్గాల మధ్య కూడా ఘర్షణలు జరిగినట్లు సమాచారం.

నిరసన స్థలాన్ని...'అన్ని వేళలా' ఆక్రమించుకోలేరు

'రామ్‌లీలా మైదాన్'లో నిరసనలను నిలిపేయాలని కోరుతూ వ్యాపార సంఘం దాఖలుచేసిన పిటిషన్‌పై 'సుప్రీం'

న్యూఢిల్లీ : పండుగ సీజన్‌లో తమ వ్యాపారానికి నష్టం వాటిల్లుతున్నందున, ఢిల్లీలోని రామ్‌లీలామైదాన్‌లో జరుగుతోన్న నిరసనలను నిలిపివేయాలని కోరుతూ ఒక వ్యాపార సంఘం దాఖలు చేసిన పిటిషన్‌లో ఇండియా కూటమి పార్టీలను ప్రతివాదులుగా చేర్చాలని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. ఇలాంటి ప్రదేశాలను మీరు 'శాశ్వతంగా' ఆక్రమించుకోవడానికి వీలులేదని స్పష్టం చేసింది. తమ వ్యాపారాలకు నష్టం కలిగిస్తున్న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లోని నిరసనలను నిలిపివేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌లో ఇండియా కూటమి పార్టీలను ప్రతివాదుతుగా చేర్చాలని సుప్రీంకోర్టు ఒక వ్యాపార సంఘాన్ని కోరింది. ఇలాంటి ప్రదేశాలను శాశ్వతంగా ఆక్రమించుకోవడానికి వీలులేదని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన నిరసన సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్షనేత తనను తోసేశారని ఆరోపిస్తూ ఒక మహిళా జర్నలిస్ట్ దాఖలు చేసిన పిటిషన్‌పై తమ సమాధానాలు దాఖలు చేయాలని కాంగ్రెస్ పార్టీని, దాని నాయకులైన మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీలను కూడా సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కోరింది. రాజధానిలో ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా జరిగిన సామూహిక నిర్బంధం, పోలీసుల క్రూరత్వం, మెట్రో స్టేషన్ల మూసివేత, ఇంటర్నెట్ నిలిపివేత వంటి ఆరోపణలపై వ్యాపారులు దాఖలు చేసిన పిటిషన్లు సహా పలు పిటిషన్లను సుప్రీంకోర్టు విచారిస్తోంది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ, మహిళా జర్నలిస్ట్ దాఖలు చేసిన పిటిషన్‌పై తమ సమాధానాలను దాఖలు చేయాలని కాంగ్రెస్ పార్టీ, గాంధీ, ఖర్గేల తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీని కోరింది. ప్రారంభంలో, ఢిల్లీ కిరాణా కమిటీ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి తన వాదనలను వినిపిస్తూ 'నేను ఢిల్లీలోని వ్యాపార సంఘాలన్నింటికీ ప్రాతినిథ్యం వహిస్తున్నాను. దుకాణాలు అన్నీ మూసి ఉన్నాయి. ఈ రోజు కన్నాట్ ప్లేస్‌లో ఎవరూ లేరు' అని సమర్పించారు. పండుగ సీజన్‌లో అమ్మకాలు జరుగకపోతే మా అమ్మకాలు అన్నీ పడిపోతాయి. మా సిబ్బంది తీవ్రంగా నష్టపోతారు. నా అభ్యర్థన ఏమిటంటే వారు కొన్ని వినూత్న పరిష్కారాలను తప్పక చూడాలి' అన్నారు. దీనిపై స్పందించిన సిజెఐ 'మీరు నిరసన ప్రదేశాన్ని అన్ని వేళలా ఆక్రమించుకోలేరు' అని అన్నారు. రండి. ఇతర నిరసనకారులు కూడా ఉన్నారు. రైతులు, పాత్రికేయులు, న్యాయవాదులు మొదలైన వారు ఎక్కడకు వెళ్తారు?. నిరసన తెలిపే హక్కు ప్రతీ ఒక్కరికీ ఉంది. నిర్దిష్ట కాలానికి నిర్దిష్ట సమయం కేటాయించాలి. నిరసన తెలిపే హక్కును సరైన వ్యాపారం చేసుకునే జీవనోపాధి హక్కుతో, ముఖ్యంగా, రోజువారీ కూలీల విషయంలో సమతుల్యం చేసుకోవాల్సిన అవసరాన్ని అత్యున్నత న్యాయస్థానం నొక్కిచెబుతూ, పరస్పర విరుద్ధమైన వాదనలు ఉన్నాయని, నిరసన తెలిపే హక్కు, సరైన వ్యాపారం చేసుకుని జీవనోపాధిని కొనసాగించే హక్కు రెండూ రాజ్యాంగబద్ధంగా గుర్తించబడిన హక్కులే' అని ధర్మాసనం స్పష్టం చేసింది.'మేం కేవలం వాణిజ్యసంస్థల పరంగానే వ్యాపారం గురించి మాట్లాడటం లేదు. మేం రోజువారీ కూలీ జీవనాధారం గురించి మాట్లాడుతున్నాం. ఆ వ్యక్తి తన రోజువారీ ఆహారం కోసం ఎక్కడకు వెళతాడు' అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. వ్యాపారాలు వేల కోట్ల రూపాయల నష్టాన్ని చవిచూశాయని, ముఖ్యంగా, పండుగ సీజన్‌లో నిరసనలపై రెండు నెలల పాటు ఆంక్షలు విధించాలని వ్యాపార సంఘం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనాన్ని కోరారు. రామ్‌లీలా మైదాన్‌కు ఒక మైలు పరిధిలో లక్షలాది మంది ప్రజలు నివసిస్తున్నారని, అన్ని రకాల హోల్ సేట్ మార్కెట్లు ఉన్నాయని, నిరసనల చుట్టుపక్కల ప్రాంతాలలో సుమారు 50లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారని, ఆందోళనల కారణంగా కన్నాట్ ప్లేస్ వంటి ప్రదేశాలలో దుకాణాలు మూతపడ్డాయని, దీంతో, వాణిజ్య కార్యకలాపాలు తగ్గిపోయాయని వివరించారు.'ప్రభుత్వం ఇప్పుడు ఆలోచించి, ఢిల్లీ కోసమైన లేదా ఇతర రాష్ట్ర రాజధానుల కోసమైనా ఒక స్కీమ్‌ను ప్రకటించాలి. ఇది ఇకపై కేవలం జంతర్ మంతర్‌కు సంబంధించిన విషయం మాత్రమే కాదు' అని రోహత్గీ వాదించారు. ఈ విషయంలో హాజరైన సీనియర్ న్యాయవాది ఎన్.హరిహరన్ తన వాదాలను ధర్మా సనానికి వినిపిస్తూ, రామ్‌లీలా మైదాన్ నిరసనల కోసం కేటాయించిన ప్రదేశమని సమర్పించారు. పండుగ కాలంలో నిరసనలను నిలిపివేయాలని కోరుతూ ఢిల్లీ కిరాణ కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నోటీస్ జారీ చేసింది. అయితే, రామ్‌లీలా మైదాన్‌లో సిఇసికి వ్యతిరేకంగా జరుగుతోన్న నిరసనల నిర్వాహకులైన రాజకీయపార్టీలు లేదా సామాజిక సంస్థలు లేదా అలా చేయనిపక్షంలో, ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో తీర్పు ఇవ్వలేమని పేర్కొంది.ముఖ గుర్తింపు నిఘాకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థను, సేకరించిన డేటా వినియోగం, భద్రతను ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్‌పై కూడా ధర్మాసనం ఒక నోటీసు జారీచేసింది.

పేదలను శక్తివంతులను చేస్తాం

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం : ప్రధాని మోదీ



పుణె : భారతదేశంలో గత 10–12 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం నుండి బయటపడ్డారని ప్రపంచ బ్యాంక్ నివేదికను ఉటంకిస్తూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గతంలో పేదరిక నిర్మూలన పోరాటం కేవలం నినాదాలకే పరిమితమై ఉండేదని ఆయన గుర్తు చేశారు. పేదలను శక్తివంతులను చేయడం, సుపరిపాలన అందించడం తన ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మంగళవారం మహారాష్ట్రలోని పుణె మెట్రో లైన్–3 (పింక్ లైన్)ను ప్రధాని ప్రారంభించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ, 2014కు ముందు భారతదేశంలో 248 కిలోమీటర్ల మేర ఉన్న మెట్రో నెట్‌వర్క్, ప్రస్తుతం 1,200 కిలోమీటర్లకు విస్తరించిందని తెలిపారు. మెరుగైన పట్టణ మౌలిక సదుపాయాలు దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తాయని ఆయన స్పష్టం చేశారు. సుమారు రూ. 8,300 కోట్ల వ్యయంతో నిర్మించిన 23 కిలోమీటర్ల పొడవైన ఈ 'పింక్ లైన్', హింజేవాడి ఐటి హబ్‌ను డిస్ట్రిక్ట్ కోర్టు మెట్రో స్టేషన్‌తో అనుసంధానిస్తుంది.2014లో దేశం ఎన్‌డిఎ కూటమికి సేవ చేసే అవకాశం కల్పించినప్పుడు, నగరాల్లో నివసించే మధ్యతరగతి ప్రజలకు జీవన సౌలభ్యాన్ని, రవాణా సౌలభ్యాన్ని కల్పించాలనే సంకల్పంతో తాము ముందుకు సాగామని మోదీ చెప్పారు. మహారాష్ట్రలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులనుద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి, వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కేంద్ర ప్రభుత్వం వారికి పూర్తి మద్దతునిస్తుందని హామీ ఇచ్చారు. ప్రస్తుతం కొనసాగుతున్న పండుగ సీజన్‌లో రైతులను గుర్తుంచుకోవాలని, కరువుతో బాధపడుతున్న కుటుంబాలు కూడా దీపావళి ఆనందాన్ని అనుభవించేలా చూడాలని ఆయన దేశవ్యాప్తంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రూ.3 లక్షల కోట్ల రక్షణ ఉత్పత్తులే లక్ష్యం

2029 నాటికి 50 వేల కోట్ల రక్షణ ఎగుమతులు సాధించాలి : రక్షణశాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ: పటిష్టమైన దేశీయ రక్షణ వ్యవస్థను నిర్మించడంపై భారత్ దృష్టి సారిస్తోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. జాతీయ భద్రతా సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి, స్వదేశీ సైనిక సామర్థ్యాలు అత్యవసరమన్నారు. మంగళవారం జైసల్మేర్‌లో రక్షణ మంత్రిత్వ శాఖ సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొత్తగా తలెత్తుతున్న భద్రతా సవాళ్లు, యుద్ధ పద్ధతులు, సాంకేతిక పురోగతులు, భవిష్యత్తుకు సిద్ధంగా, సాంకేతికంగా శక్తివంతంగా, కార్యాచరణపరంగా చురుకుగా ఉండే సైన్యాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతపై సమగ్ర చర్చలు జరిగాయి. ఈ చర్చల సందర్భంగా వెలుగులోకి వచ్చిన కీలక అంశాలలో తదుపరి తరం ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధ వ్యవస్థల ప్రవేశాన్ని వేగవంతం చేయడం, త్రివిధ దళాల సమన్వయం, ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక, సామర్థ్యాల సమన్వయ వినియోగాన్ని బలోపేతం చేయడం వంటివి ఉన్నాయి. రాజ్‌నాథ్‌సింగ్ ప్రసంగిస్తూ, విదేశీ వనరులపై దేశం వ్యూహాత్మకంగా ఆధారపడటాన్ని తగ్గించే ప్రయత్నాలలో భాగంగా ప్రభుత్వం దేశీయ రక్షణ పరిశ్రమను ప్రోత్సహిస్తోందన్నారు. కొత్తగా తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి సైన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. సాంకేతికత ఆధారిత ఆధునిక యుద్ధంలో మారుతున్న అవసరాలను తీర్చడానికి సైన్యాన్ని సన్నద్ధం చేసేందుకు బడ్జెట్, మూలధన సేకరణ, సాంకేతికత, మానవ వనరులు వంటి కీలక అంశాలలో ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. 2026–27 ఆర్థిక సంవత్సరానికి రక్షణ బడ్జెట్‌ను రికార్డు స్థాయిలో రూ. 7.85 లక్షల కోట్లకు పెంచినట్లు, ఇందులో రూ. 2.19 లక్షల కోట్ల మూలధన కేటాయింపులు ఉన్నాయని సింగ్ తెలిపారు. రక్షణ రంగంలో స్వావలంబన దార్శనికతపై ఆయన మాట్లాడుతూ, రక్షణ ఉత్పత్తి 2014–15లో రూ. 46,429 కోట్ల నుండి 2025–26 నాటికి రికార్డు స్థా యిలో రూ. 1.78 లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు. 2014లో రూ. 2,0 00 కోట్ల కంటే తక్కువగా ఉన్న రక్షణ రంగ ఎగుమతులు, సుమారు రూ. 40,000 కోట్లకు పెరిగాయి. '2029 నాటికి రూ. 3 లక్షల కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తిని, రూ. 50,000 కోట్ల విలువైన రక్షణ ఎగుమతులను సాధించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాము' అని ఆయన తెలిపా రు. ఆధునిక యుద్ధంలో సాంకేతికత పోషిస్తున్న పరివర్తనాత్మక పాత్రను నొక్కిచెప్పారు. 'అసాని', 'భైరవ్', 'శక్తిబాన్' ప్లా టూన్‌లతో సహా భారత సైన్యం కొత్త వ్యూహాలు, సమకాలీన కార్యా చరణ అవసరాలను తీర్చడంలో, యుద్ధభూమికి సంబంధించి మారుతున్న గతిశీలతకు అనుగుణంగా మారడంలో అత్యంత ప్రభావవంతంగా నిరూపించుకుంటున్నాయి అని అన్నారు.

ఆంక్షలు ఉల్లంఘించి క్రాకర్ల విక్రయం
సుప్రీంకోర్టు సీరియస్

- కోర్టు ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రానికి ఆదేశం



న్యూఢిల్లీ : దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలు, వినియోగంపై విధించిన ఆంక్షలు అమలుకాకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. నిబంధనలు విధించినప్పటికీ ఢిల్లీ మార్కెట్లలో అన్ని రకాల క్రాకర్లు విక్రయిన్నట్లు వచ్చిన వార్తా కథనంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆదేశాలను ఉల్లంఘించి బాణసంచా అమ్ముతున్న వారిపై దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పిబి వరాలేతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీ మార్కెట్లలో బాణసంచా విక్రయాలపై ఓ ఆంగ్ల పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. ముందురోజు కోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా దుకాణాల్లో అన్ని రకాల క్రాకర్లు అందుబాటులో ఉన్నాయని ఆ కథనం పేర్కొన్నట్లు తెలిపింది. లైసెన్స్ ఉన్నవి, లేనివి, క్యూఆర్ కోడ్ కలిగినవి, లేనివి అనే తేడా లేకుండా మార్కెట్లలో విక్రయాలు జరుగుతున్నట్లు వార్తలో పేర్కొన్నారని గుర్తుచేసింది. ఈ విషయాన్ని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటికి తెలియజేస్తూ, విక్రయాల వ్యవహారాన్ని పరిశీలించాలని సూచించింది. కాగా, దీపావళి సందర్భంగా ఢిల్లీ పరిధిలో బాణసంచా వినియోగానికి సుప్రీంకోర్టు పరిమిత అనుమతులు ఇచ్చింది. నవంబర్ 7, 8 తేదీల్లో మాత్రమే గ్రీన్ క్రాకర్స్ కాల్చేందుకు అవకాశం కల్పించింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే బాణసంచా కాల్చాలని స్పష్టం చేసింది. ఈ సమయాలకు వెలుపల క్రాకర్లు పేల్చేందుకు అనుమతి లేదని పేర్కొంది. బాణసంచా వినియోగంపై సమయ పరిమితులతో పాటు ప్రత్యేక ప్రాంతాల్లోనూ నిషేధం విధించింది. ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆరోగ్య కేంద్రాలు, వృద్ధాశ్రమాల చుట్టూ 300 మీటర్ల పరిధిలో ఎలాంటి బాణసంచా కాల్చకూడదని ఆదేశించింది. ప్రజలకు ఈ నిషేధిత ప్రాంతాల వివరాలు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించింది.



తీరం దాటిన 'మురసు'

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 8.30 గంటలకు అదే ప్రాంతంలో కేంద్రీకృతమై ఉందని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నంలోని తుపాను హెచ్చరిక కేంద్రం (సిడబ్ల్యుసి) భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపిన వివరాల ప్రకారం, ఈ తుఫాన్ ఒంగోలుకు ఉత్తర–ఈశాన్య దిశలో 30 కి.మీ, బాపట్లకు నైరుతి దిశలో 40 కి.మీ, కావలికి ఉత్తర–ఈశాన్య దిశలో 90 కి.మీ, విజయవాడకు దక్షిణ–నైరుతి దిశలో 100 కి.మీ, మచిలీపట్నానికి పశ్చిమ నైరుతి దిశలో 120 కి.మీ దూరంలో ఉంది. మంగళవారం అర్ధరాత్రి నాటికి ఈ తుఫాన్ తీవ్ర అల్పపీడనంగా బలహీనపడుతుందని, అప్పుడు గాలి వేగం గంటకు 75 కిలోమీటర్ల వరకు ఉంటుందని అంచనా వాతావరణ కేంద్రం వేసింది. రాబోయే 12 గంటల పాటు దక్షిణ తీర ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ సూచించింది. సోమవారం ఉదయం 8.30 గంటల నుండి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన వర్షపాత వివరాల ప్రకారం.. బాపట్లలో 222.4 మి.మీ, నరసాపురంలో 198.6 మి.మీ, ఒంగోలులో 120.2 మి.మీ, మచిలీపట్నంలో 83.9 మి.మీ, బాంద్రావేలలో 75 మి.మీ మరియు పుదుచ్చేరిలో 65.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

తెలంగాణలో మూడు రోజులు వర్షాలు

రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశ ముందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ములుగు, వరంగల్, హనుమకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంద న్నారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో, కొన్ని ప్రాంతాల్లో 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. మిగిలిన జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందన్నారు. బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగుతాయ న్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముండగా, ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. గురువారం నుంచి ఆదివారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంద న్నారు. ఆదివారం నుంచి మంగళవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణం నెలకొనే అవకాశముందన్నారు.

రష్యా బాంబు దాడి:29మంది మృతి

మరో 48 మంది జాడ గల్లంతు

- చమురుశుద్ధి కేంద్రాన్ని ధ్వంసం చేసిన ఉక్రేన్



కీవ్: దక్షిణ ఉక్రేన్‌లో మానవతాసహాయం అందజేసే శిబిరాలవద్ద రష్యా చేసిన బాంబుదాడిలో మరణించిన వారి సంఖ్య 29 కి పెరిగింది. అదేవిధంగా ఈ దాడుల్లో ఇంకా 48 మంది జాడ తెలియడంలేదు. వారికోసం గాలిస్తున్నారు. ఉక్రేన్‌లో వివిధ ప్రాంతాలలో మానవతా సహాయం అందజేయడానికి అనేక శిబిరాలు ఏర్పాటు చేశారు. రష్యా–ఉక్రేన్ యుద్ధంలో భాగంగా ఈ శిబిరాలపై దాడులు జరిగాయి. ఈ దాడుల్లో నలుగురు పోలీసులు, ఇద్దరు సహాయ సిబ్బంది కూడా మరణించారు. మానవతాసహాయం చేయడానికి ఉపయోగిస్తున్న ఒక పాఠశాలను తొలుత లక్ష్యంగా చేసుకుని ఆ తర్వాత ఈ ఆశ్రయంపై దాడి చేసిందని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సోషల్ మీడియా వేదికగామంగళవారం పోస్టింగ్ పెట్టారు. రాత్రిపూట జరిగిన ఈ దాడులు విద్యుత్ ప్లాంటులను, ఆసుపత్రులను కూడా ధ్వంసంచేశాయని జెలెన్స్కీ చెప్పారు. రష్యా తొమ్మిది ఉక్రేన్ ప్రాంతాలపై 289 డ్రోన్లు ప్రయోగించిందని, 17 బాలిస్టిక్ క్షిపణులు, మరో 59 క్రూయిజ్ క్షిపణులతో దాడులు చేసిందని చెప్పారు. ఈ దాడులు అత్యవసర విద్యుత్ కోతలకు దారి తీశాయని చెప్పారు. అదేవిధంగా ఖేర్సన్‌లోని ఒక ఆసుపత్రిపై కూడా రష్యా బాంబు దాడి చేసిందని, ఈ దాడిలో 73 మంది గాయపడగా, మరో 200 మంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఉక్రేన్ చెప్పింది.

యుద్ధ ఉద్రిక్తతలను తగ్గించుకోవడానికి రష్యా ఇష్టపడటంలేదని చెప్పడానికి ఇది మరో రుజువు అని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మంగళవారం తెల్లవారక ముందే రెండు దేశాలు పరస్పరం దాడులు చేసకున్నాయి. రష్యాలోని యోరోషెవ్ చమురు శుద్ధి కేంద్రంపై ఉక్రేన్ దళాలు క్షిపణి దాడులు చేసి ధ్వంసం చేశాయి. ట్రంప్ పదే పదే హెచ్చరించినప్పటికీ ఉక్రేన్ సైన్యాలు రష్యా చమురు శుద్ధి కేందారలపై దాడులు మానుకోలేదు.ఈ చమురు శుద్ధి కేంద్రం ద్వారా ప్రతి సంవత్సరం 15 మిలియన్ టన్నుల చమురును శుద్ధి చేస్తారు. రష్యాకు ఇదెంతో కీలకమైన కేంద్రం. కాగా ఉక్రేన్ ప్రయోగించిన 800కు పైగా డ్రోన్లలో 500 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణవర్గాలు ప్రకటించాయి.

అబుధాబిలో 10,11 తేదీల్లో త్రైపాక్షిక సమావేశం

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రధాన నగరం అబుధాబిలో నవంబరు 10–11 తేదీలలో అమెరికా–రష్యా–ఉక్రేన్ మధ్య త్రైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. ఉక్రేన్‌లో యుద్ధం పరిస్కరించడంకోసం అమెరికా చొరవతో అబుధాబిలోత్రైపాక్షిక సమావేశానికి వేదిక సిద్ధమైంది. గతనెల మూడోవారంలో ట్రంప్ ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ రష్యా సందర్శించి వ్లాదిమీర్ పుతిన్‌తో సంభాషణలు జరిపారు. యుద్ధ పరిష్కారానికి మధ్యవర్తి అమెరికా కూడా పాల్గొనేవిధంగా త్రైపాక్షిక సమావేశానికి ఒప్పించారు. ఆ తర్వాత ట్రంప్ సతీమణి మెలానియా ట్రంప్ మధ్యవర్తిత్వంతో రష్యా ఆక్రమణలో ఉన్న ఓలేష్కీలో మూడు రోజులపాటు కాల్పుల విరమణ ఒప్పందం అమలు జరిగింది. అనేక నెలలుగా ఈ యుద్ధ ప్రాంతంలో ఆహారం,నీరు లేకుండా చిక్కుకుపోయిన వందలమంది ప్రజలను ఉక్రేన్‌లోని వారి బంధువులు ఉండే సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఐతే తర్వాత ఈ కాల్పుల విరమణ పొడిగించేందుకు రష్యా తిరస్కరించింది. ఒకవైపు ఉక్రేన్‌కు ఆయుధసహకారం చేస్తూ మరోవైపు చర్చల సన్నాహాలను అమెరికా, యూరప్ అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలుగా రష్యన్ అధికారులు విమర్శిస్తున్నారు.

రాబోయే రెండేళ్ళు అమెరికాను శాసించేదెవరు?

- పోలింగ్‌లో పాల్గొన్న 60 లక్షలమంది ఓటర్లు
- నా జీవితకాలంలో కీలక ఎన్నికలివే: ట్రంప్



వాషింగ్టన్: రాబోయే రెండేళ్ళలో అమెరికా రాజకీయాలను శాసించేది ఎవరు? అని తేల్చిచెప్పే కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ మంగళవారం జరిగింది. మొదటి ఐదు గంటల వ్యవధిలోనే 60 లక్షలమంది పోలింగ్‌లో పాల్గొన్నారు. 31,897,521 మంది నేరుగా పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేయగా, 26,779,541మంది ఓటర్లు మెయిల్ పద్ధతిలో ఓటింగ్‌లో పాల్గొన్నారని ఫ్లోరిడా యూనివర్సిటీ ఎలక్షన్ ల్యాబ్ ప్రకటించింది. అనేకమంది స్త్రీ పురుష భేదం లేకుండా చంటిబిడ్డలను చంకన ఎత్తుకుని ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాలు వెర్మాంట్‌లో ఉదయం ఐదు గంటలకే తెరచుకోగా, ఇతర ప్రాంతాలలో ఆరు గంటలకు పోలింగ్ కేంద్రాలు తెరిచారు. దిగువ సభ(435స్థానాలు), ఎగువసభ(35స్థానాలు)లతోపాటు పలు రాష్ట్రాలలో గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. భారత కాలమానం ప్రకారం ఉదయం పది గంటల సమయానికి 60 లక్షలమంది పోలింగ్‌లో పాల్గొన్నారు. రేపటికి ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. అభిప్రాయ సేకరణల ప్రకారం, ఇరాన్‌లో ట్రంప్ యుద్ధంపట్ల అమెరికన్ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఈ దుస్సాహసచర్యవల్ల అమెరికాలో ధరలు ఆకాశాన్ని అంటాయి. కాంగ్రెస్ అనుమతి లేకుండా యుద్ధం చేస్తున్నారని డెమోక్రాట్లు, రిపబ్లికన్లు కూడా ట్రంప్‌ను తీవ్రంగా విమర్శిస్తున్నారు. కీలకమైన హోర్ముజ్ జలసంధి సమీప భవిష్యత్తులో తెరచుకుంటుందనే ఆశలు కనిపించడంలేదు. దీనివల్ల ధరలు పెరిగిపోయాయి. ఈ పరిస్థితులమధ్య ఆరేళ్ళ కాలానికిగాను 35 మంది సెనేటర్లను, రెండేళ్ళ పదవీకాలానికిగాను 435 మంది దిగువసభ సభ్యులను ఎన్నుకోవడానికి ఓటర్లు ఓటుహక్కు ఉపయోగించుకున్నారు. మిన్నెసోటా, ఐయోవా, మిచిగన్, ఒహియో, న్యూహేంప్షైర్, మైనే, నార్త్ కరోలినా, సౌత్ కరోలినా, కన్సాస్, అలాస్కా, టెక్సాస్ రాష్ట్రాలు సెనేట్‌ను ఎవరు నియంత్రిస్తారో తేల్చిచెప్పడంలో కీలకపాత్ర వహిస్తాయి.

కాంగ్రెస్ ఉభయసభలపై నియంత్రణ ఎవరికి ఉంటుంది? 2028 డిసెంబరు వరకూ ఎవరు ఆధిపత్యం చెలాయించేది డెమోక్రాట్లా, రిపబ్లికన్లా అనే విషయాన్ని ఓటర్లు తేల్చిచెప్పనున్నారు. ట్రంప్ అప్రూవల్ రేటింగ్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో 32 శాతానికి క్షీణించిన పరిస్థితుల మధ్య ఆయన పోలింగ్ రోజు మాట్లాడుతూ, ''ఈ ఎన్నికలు నా జీవితకాలంలో అత్యంత కీలకమైనవి'' అని వ్యాఖ్యానించారు. రిపబ్లికన్లు ఈ ఎన్నికల్లో ఓడినా, గెలిచినా ట్రంప్ పదవికి ఎలాంటి ముప్పులేదు. కానీ డెమోక్రాట్లు మెజార్టీ సాధిస్తే, ట్రంప్‌కు ఇక గడ్డు కాలం ప్రారంభమైనట్టే. ఆయన ఆధిపత్యం చాటుకునేందుకు డెమోక్రాట్స్‌తో ప్రతిరోజూ పోరాటం చేయాల్సిందే. డెమోక్రాట్లు అనుకున్నదానికంటే మూడింట రెండు వంతుల మెజార్టీ తెచ్చుకుంటే ట్రంప్‌పై అభిశంసన తీర్మానం కూడా పెట్టే అధికారాలు సంపాదిస్తారు.

ప్రభుత్వ ఏర్పాటు వ్యూహ రచనకు

ఇజ్రాయెల్ ప్రతిపక్షాల అంగీకారం

టెల్అవీవ్: ఇజ్రాయెల్ పార్లమెంటు ఎన్నికల్లో ఎవరికీ పూర్తి మెజార్టీ రాకపోవడంతో అనిశ్చితి కొనసాగుతోంది.నిర్ణీత ప్రకారం ప్రమాణ స్వీకారాలు చేయడానికి వీలుగా పార్లమెంటు క్నెసెట్ సమావేశాలు వచ్చేవారం ప్రారంభమవుతాయి. ఆ సమయం నాటికి ప్రభుత్వం ఏర్పాటు విషయంపై ఒక వ్యూహం రూపొందించుకోవాలని ప్రతిపక్షంలో ఉన్న యూదు పార్టీల నాయకులు మంగళవారం సమావేశమై ఒక అంగీకారానికి వచ్చారు.గాడి ఐసెన్ కోట్(యషార్‌పార్టీ),నఫ్తాలీ బెన్నెట్(బియాచాద్),యైర్ గోలన్(డెమోక్రాట్స్),అవిగ్డోర్ లిబర్మాన్(ఇస్రాయెల్ బెయెట్) ఈ మేరకు ఒక ఉమ్మడి ప్రకటన చేశారు.నాలుగు సూత్రాలను ఆధారం చేసుకుని నెతన్యాహూను పదవిలోకి రాకుండా అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.ఐతే అరబ్ పార్టీల మద్దతు లేకుండా ఏ విధంగా వారు ప్రభుత్వం ఏర్పాటు చేస్తారన్న విషయంలో స్పష్టత లేదు.మరోవైపు ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ విస్తారమైన ప్రాతిపదికపై తన నాయకత్వంలో ఒక జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు పిలుపు ఇచ్చారు.నెతన్యాహూ కూటమికి మెజార్టీ రావాలంటే ఇంకా11 స్థానాలు కావాలి.అధికార లికుడ్ పార్టీ గడచిన 13 సంవత్సరాలలో ఎన్నడూలేనంత తక్కువగా 27 స్థానాలు మాత్రమే గెలుచుకుంది.వారి కూటమి 53 స్థానాలు గెలుచుకుంది.ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు వచ్చాయి.అరబ్ పార్టీలు గణనీయంగా 19 స్థానాలు గెలుచుకున్నాయి.ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో దేశాధ్యక్షుడు రాజ్యాంగం ప్రకారం మొదట రాబోయే 28 రోజుల్లో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని నెతన్యాహూ కూటమిని ఆహ్వానిస్తారు.ఆయనకు సాధ్యపడకపోతే ప్రతిపక్షాలను ఆహ్వానిస్తారు.వీలైతే మరో 14 రోజులు గడువు పొడిగిస్తారు.ప్రతిపక్షాలు కూడా విఫలమైతే జాతీయ



ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు బహుశా జగవచ్చు.ఈ ప్రయత్నాల దారులన్నీ మూసుకుపోతే మళ్ళీ ఎన్నికలకు ఆదేశిస్తారు.అంతవరకూ నెతన్యాహూ ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా పదవిలో కొనసాగుతారు.

కూటమిదే గెలుపు

నగర, పురపాలికల్లో పోరు ఏకపక్షం

- పులివెందులలోనూ టిడిపి పాగా
- తుఫాను ప్రభావంతో కోస్తా జిల్లాల్లో కౌంటింగ్ ఆలస్యం
- చీరాలలో ఓట్ల లెక్కింపు వాయిదా

అమరావతి : రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, పురపాలిక, నగర పంచాయతీల్లో కూటమి ఘన విజయం సాధించింది. అరకొర స్థానిక సంస్థల్లో మినహా ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని చాటలేకపోయింది. చివరకు కడప జిల్లాలోనూ వైసిపి పట్టు నిలుపుకోలేకపోయింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్వంత నియోజకవర్గమైన పులివెందుల మున్సిపాలిటీని సైతం గెలవలేకపోయింది. ఏకగ్రీవాలు పోను రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలతో కలిపి మొత్తం 92 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగ్గా, మంగళవారం ఓట్ల లెక్కింపు ఎక్కడికక్కడే చేపట్టారు. కోస్తా జిల్లాల్లో మురసు తుపాను కారణంగా భారీ వర్షాలు కురవడంతో లెక్కింపు ప్రక్రియ ఆలస్యమైంది. విజయవాడ నగరపాలక సంస్థకు జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో గందరగోళ పరిస్థితి నెలకొంది. భారీ వర్షం కారణంగా కౌంటింగ్ కేంద్రం లయోలా కళాశాల ప్రాంగణంలో నీరు చేరడంతో రెండున్నర గంటలు ఆలస్యంగా ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. అయితే కనీస సమాచారం చెప్పేవారు కూడా లేరంటూ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటింగ్ ఏర్పాట్లపై స్వతంత్ర అభ్యర్థి ఏబీ వెంకటేశ్వర రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ... రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కౌంటింగ్ హాల్స్‌లో ఏజెంట్లు నిలబడేందుకు కూడా సరైన వసతి లేదని ఏజెంట్లు ఆరోపించారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షంతో లయోలా కళాశాల పూర్తిగా జలమయమైంది. ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోనూ దాదాపు మూడున్నర గంటలు ఆలస్యంగా కౌంటింగ్ ప్రారంభించారు.

చీరాలలో కౌంటింగ్ 6వ తేదీకి వాయిదా

మురసు తీరం దాటిన నేపథ్యంలో దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చీరాల మున్సిపాలిటీలో ఓట్ల లెక్కింపు చేపట్టే పరిస్థితి లేకపోవడంతో అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇచ్చారు. మురసు తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీస్తున్నాయని, కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో అయితే ఏకంగా 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని ఎస్ఈసీకి నివేదించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓట్ల లెక్కింపు నిర్వహించడం వల్ల అనేక ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో జిల్లా అధికారుల నివేదిక మేరకు చీరాలలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేస్తూ ఎస్ఈసీ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఈసీ తాజా ఉత్తర్వుల ప్రకారం చీరాల మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల ఓట్ల లెక్కింపును ఈ నెల 6న ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారు.

విశాఖ మేయర్‌గా ముక్కా శ్రావణి ఘన విజయం

రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ అయిన విశాఖపట్నంలో కూటమి మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణి...సమీప వైసిపి అభ్యర్థి వరుదు కల్యాణిపై ఘన విజయం సాధించారు. విశాఖలో మొత్తం 120 డివిజన్లకు గాను అత్యధిక స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు కార్పొరేషన్‌లో జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు గెలుపొందారు. సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థిపై 44,665 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తిరుపతిలో మన్నెం శ్రీనివాస ప్రసాద్, చిత్తూరులో కఠారి హేమలత, గుంటూరులో కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, మచిలీపట్నంలో షేక్ అబ్దుల్లా అబీదా మేయర్లుగా ఘన విజయం సాధించారు. విశాఖపట్నం, విజయవాడలో జనసేన మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ తొలి రౌండ్ నుంచి భారీ ఆధిక్యతతో దూసుకుపోతున్నారు. నెల్లూరు, కడప కార్పొరేషన్‌లలో కూటమి అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో నందికొట్కూరు మున్సిపాలిటీలో మాత్రమే వైసిపి గెలుపొందగా, ఆదోనిలో జనసేన తిరుగుబాటు అభ్యర్థి స్వప్న విజయం సాధించారు.



కూటమి అభ్యర్థులు గెలుపొందిన మున్సిపాలిటీలు ఇవే

నర్సీపట్నం, పలాస, ఇచ్ఛాపురం, పెద్దాపురం, కొవ్వూరు, మండపేట, ఆకివీడు, నూజివీడు, జగ్గయ్యపేట, జంగారెడ్డిగూడెం, ఉయ్యూరు, నందిగామ, జగ్గయ్యపేట, కొండపల్లి, గురజాల, దాచేపల్లి, పిడుగురాళ్ల, రేపల్లె, కనిగిరి, ఆత్మకూరు(నెల్లూరు), ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు(నంద్యాల), కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, పెనుకొండ, కమలాపురం, రాజంపేట, ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, మదనపల్లి, పుంగనూరు, రాయచోటి, వెంకటగిరి, సూళ్లూరుపేట, పలమనేరు, కుప్పం, నగరి, పులివెందులలో టిడిపి అభ్యర్థులు మున్సిపల్ చైర్మన్‌లుగా గెలుపొందారు. జనసేన అభ్యర్థులు గొల్లప్రోలు, తుని, సామర్లకోట, పిఠాపురం, ముమ్మిడివరం, అమలాపురం, నిడదవోలు, నర్సాపూర్, పెడన, తిరువూరు, తెనాలి, దర్శి, మడకశిర, పుట్టపర్తిలో విజయం సాధించారు. బిజెపి అభ్యర్థులు గూడూరు (కర్నూలు), ఎర్రగుంట్ల, ఎలమంచిలి మున్సిపాలిటీల్లో విజయం సాధించారు.

6వార్డుల్లో సిపిఐ అభ్యర్థుల విజయం

అన్నమయ్య జిల్లా పుంగనూరు, నంద్యాల జిల్లా డోన్, అనంతపురం జిల్లా గుంతకల్లు, పల్నాడు జిల్లా వినుకొండ, కర్నూలు జిల్లా ఆదోని మున్సిపల్ పోరులో సిపిఐ అభ్యర్థులు 6వార్డుల్లో జయభేరి మోగించారు.

అమెరికాలో మీజిల్ వ్యాధితో చిన్నారి మృతి

30 ఏళ్ళ తర్వాత మళ్ళీ విజృంభణ

47 రాష్ట్రాలలో 4,837కేసులు

న్యూయార్క్: అమెరికాలో మూడు దశాబ్దాల తర్వాత ఉత్తర న్యూయార్క్ లెవిస్ కౌంటీలో మీజిల్(మచ్చలవ్యాధి, తట్టువ్యాధి లేదా గ్రామీణభాషలో చిన్నఅమ్మవారు) వ్యాధితో ఒక చిన్నారి మరణించింది. కాగా 47 రాష్ట్రాలలో అక్టోబరు నెలాఖరు నాటికి అమెరికాలో 4,837 మీజిల్ కేసులు నమోదయ్యాయి. మీజిల్ వ్యాధి కారణంగా బంగ్లాదేశ్ వంటి వెనుకబడినదేశంలో ఈ ఏడాదిలో 1,256 మంది మరణించారు. అనేక వేల మీజిల్ కేసులు ఆ దేశంలో నమోదయ్యాయి. చిన్నారి మరణవార్తవిని తన హృదయం బద్దలైపోయిందని న్యూయార్క్ గవర్నర్ కథీ హోచుల్ ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. డెమోక్రటిక్‌పార్టీకి చెందిన కథీ హోచుల్ ఈ విషయంలో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆరోగ్య విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి వ్యాధుల నివారణలో అమెరికా అనేక దశాబ్దాలుగా గొప్ప పురోగతి సాధించిందని, కానీ ఇప్పుడు పరిస్థితులు ఈ విధంగా మారాయని విమర్శించారు. దీనిని ఒక వినాశకరమైన మరణంగా పేర్కొన్నారు.

దద్దరిల్లిన 'ఖేష్మ్'

(మొదటి పేజీ తరువాయి)

నౌకాబలగాలు అమెరికాకు చెందిన ఎంక్యూ–9 సహా పలు డ్రోన్లను కూల్చివేశాయి. అమెరికాకు చెందిన 55వ అత్యంత అడ్వాన్స్‌డ్ ఎంక్యూ–9 డ్రోన్లను హోర్ముజ్ జలసంధి తూర్పు ప్రాంత జలాల్లో కూల్చివేసినట్లు ఐఆర్‌జిసి పబ్లిక్ రిలేషన్స్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అత్యంత ఆధునిక ఆయుధాలతో తమ ఏరోస్పేస్ వ్యవస్థ శత్రువును ప్రతిఘటించిందని కార్యాలయం తెలియజేసింది. ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ నెట్‌వర్క్ ద్వారా పూర్తిస్థాయి నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

ఐఆర్‌జిసి సమాచారం ప్రకారం పర్షియన్ గల్ఫ్ తీరం వెంట ఉన్న,ఖేష్మ్ ద్వీప గగనతలంలో పనిచేస్తున్న ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలను గుర్తించడంకోసం అమెరికా సెంట్‌కామ్ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ డ్రోన్ యూనిట్లను ఉపయోగిస్తోంది.ఒక ఆపరేషన్ సందర్భంగా ఐఆర్‌జిసి దళాలు ఈ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్‌కు సంబంధించిన ఎంఎం–170 డ్రోన్లను గురించి వాటిని పూర్తిగా ధ్వంసం చేయకుండా నేలకు కూల్చివేసి స్వాధీనం చేసుకుంది.అమెరికా గ్రిఫన్ ఏరో స్పేస్ కంపెనీ ఈ డ్రోన్లను తయారు చేసినట్లు గుర్తించామని ఐఆర్‌జిసి పేర్కొంది.ఈ వ్యవస్థల ద్వారా తమ సైనిక స్థావరాలను ఫొటోలు తీయడానికి ప్రయత్నిస్తున్నారని,ఈ డ్రోన్లను సురక్షితంగా కూల్చివేసి స్వాధీనం చేసుకోవడం ద్వారా ఈ వ్యవస్థ ఏ విధంగా పనిచేస్తోందో, దానిని ఎలా అడ్డుకోవాలో తెలుసుకోవడానికి తమకు మంచి అవకాశం,వీలు కలిగిందని ఐఆర్‌జిసి ప్రకటించింది.

మధ్యంతర ఎన్నికలు జరిగిన వెంటనే ఇరాన్‌పై దాడులు జరుగుతాయని గల్ఫ్‌లోని మిత్రదేశాలను వారం రోజుల క్రితమే ట్రంప్ అప్రమత్తం చేసిన తర్వాత ఖతార్,పాకిస్థాన్ మధ్యవర్తి దేశాలు ఇరాన్‌తో దౌత్యసంప్రదింపులను ముమ్మరం చేశాయి.దౌత్య మార్గాలు తెరచే ఉన్నాయని మరోవైపు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు.అటు దౌత్యానికీ,ఇటు యుద్ధానికీ మునుపు ఎన్నడూలేనంత సిద్ధంగా ఉన్నామని చెప్పారు.అమెరికా తమ డిమాండ్లు నెరవేరిస్తే రెండు రోజుల ప్రణాళిక అమలుకు కట్టుబడి ఉన్నామని,మొదటిరోజు హోర్ముజ్ జలసంధిని తెరుస్తామని,రెండోరోజు అణుసమస్యపై అమెరికాతో చర్చలు ప్రారంభించగలమని చెప్పారు.

మధ్యంతర ఎన్నికల తర్వాత ఒప్పందమో,యుద్ధమో ఏదో ఒకటి జరిగి తీరుతుందని ట్రంప్ ప్రకటించగా,మధ్యవర్తుల ద్వారా చర్చలు వేగం పుంజుకున్నాయని వార్తలు వెలువడ్డాయి.ఈ తరుణంలో ట్రంప్ పట్టుదలగా పోలింగ్ ప్రారంభం కాకముందే దాడులు ప్రారంభించారు.అంతకుముందు సోమవారం ట్రంప్ మాట్లాడుతూ,''ఇరాన్‌తో ఒప్పందానికి తాము తొందర పడటంలేదు,ఏదో ఒకటి జరుగుతుంది,మేం వారిని ఆర్థికంగా దెబ్బతీశాం,ఆ దేశం కుంగిపోయింది,ఆ దేశంలో చమురు లేదు,డబ్బు లేదు,ప్రజలు అలసిపోయారు'' అని ఆక్సియోస్ వార్తాసంస్థతో అన్నారు. అదేసమయంలో ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్ అణు కార్యక్రమంతో సంబంధం ఉన్న పీక్స్‌యాక్స్ పర్వతం భూగర్భ ప్రాంతాలపై కూడా దాడులు చేసే అవకాశాలు ఉన్నాయని,తాము తలచుకుంటే పది నిమిషాల్లో ఈ రెండు దాడులు పూర్తిచేస్తామని చెప్పారు.

పర్షియన్ గల్ఫ్ సభ్యదేశాలతో ఇరాన్‌కు శత్రుత్వం లేదు

పశ్చిమాసియాలో విదేశీజోక్యం లేకుండా సరికొత్తగా ప్రాంతీయ దేశాలతో కలిసి ప్రాంతీయ భద్రతకు ఏర్పాట్లు చేసుకుంటామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ చెప్పారు. విదేశీ శక్తుల సైనిక ప్రమేయం. ఉనికి లేకుండా ప్రాంతీయ దేశాలతో కలిసి ఒక సరికొత్త ప్రాంతీయ భద్రతా ఏర్పాటును ఇరాన్ కోరుకుంటున్నదని ఎక్స్ వేదికగా చెప్పారు. యుద్ధం నివారించడానికి ఖతార్, ఒమన్ పోషించిన పాత్రలను ఆయన ప్రశంసించారు. సౌదీ అరేబియాతో సంభాషణలు కొనసాగించడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. పర్షియన్ గల్ఫ్ సహకార మండలి(పిజిసిసి)సభ్యదేశాలపట్ల ఇరాన్‌కు ఎలాంటి శత్రుత్వం లేదని స్పష్టం చేశారు. తుర్క్‌మెనిస్థాన్‌లో పర్యటన అనంతరం ఆయన ఎక్స్‌వేదికగా పోస్టింగ్ పెట్టారు.పొరుగుదేశాలకే ఇరాన్ ఎంతో ప్రాధాన్యతనిస్తుందన్నారు. తుర్క్‌మెనిస్థాన్ అధ్యక్షుడు బెర్దిముహమెదోవ్, విదేశాంగమంత్రి మెరెదోవ్‌లతో ఫలవంతమైన చర్చలు జరపడం ఎంతో గౌరవంగా ఉందన్నారు.

ఉమ్మడి పోరు

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి) సంయుక్తంగా నిర్వహించిన జాయింట్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ టీమ్ హైదరాబాద్ ప్రాంతీయ సదస్సులో ఈ మేరకు కీలక చర్చలు జరిగాయి.

ఈ సదస్సులో 13 రాష్ట్రాల పోలీసు, దర్యాప్తు సంస్థలకు చెందిన 45 మంది అధికారులు పాల్గొన్నారు. ఐ4'r, సర్ట్–ఇన్, ఎన్‌సిఆర్‌బి,బిపిఆర్అండ్‌డి, ఆర్‌బిఐ, ఇడి,డిఒటి,సిబిఐ, ఐబి, ఎన్‌ఎఫ్ఎస్‌యూ, తెలంగాణ ఐటి శాఖ సహా 11 సంస్థల ప్రతినిధులు భాగస్వాములయ్యారు. తెలంగాణలోని వివిధ పోలీసు విభాగాలకు చెందిన అధికారులు ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

నేరాల కట్టడిలో తెలంగాణకు మెరుగైన ఫలితాలు..

జెసిసిటి–4 సదస్సును ప్రారంభించిన డిజిపి సి.వి.ఆనంద్ మాట్లాడుతూ.. 2024–25లో దేశవ్యాప్తంగా సైబర్ నేర ఫిర్యాదులు 24 శాతం పెరగ్గా, తెలంగాణలో మూడు శాతం తగ్గాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాల వల్ల జరిగిన ఆర్థిక నష్టం 20 శాతం తగ్గిందని, జాతీయ స్థాయిలో ఈ తగ్గుదల నాలుగు శాతమేనని వివరించారు. సైబర్ నేరాలు ఇప్పుడు ఒక వ్యవస్థీకృత పరిశ్రమగా మారాయని, నేరగాళ్లకు లక్ష్యం, బాధితుడిని చేరుకునే మార్గం, ఫోన్ నంబరు, వినియోగించగల బ్యాంకు ఖాతా అందకుండా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. సదస్సులో తీసుకున్న నిర్ణయాలు జాతీయ స్థాయిలో అమలయ్యేలా కేంద్రానికి నివేదిక అందించాలని ఆకాంక్షించారు. టిజిసిఎస్‌బి డైరెక్టర్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు అంతర్జాతీయ స్థాయిలో వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లుగా విస్తరించాయని తెలిపారు. మోసపూరిత ఖాతాలను నిలిపివేస్తున్నా, నేరాల కేంద్రాలను కూల్చివేస్తున్నా.. అసలు సూత్రధారులు, ఆర్థిక సహాయకులు మాత్రం అందుబాటులోకి రావడం లేదన్నారు. నేరగాళ్లు ఒకే నెట్‌వర్క్‌గా పనిచేస్తుండగా, పోలీసు వ్యవస్థలు పరిధుల పరిమితుల్లో చిక్కుకుపోతున్నాయని పేర్కొన్నారు. తక్షణ సమాచార మార్పిడి, ఉమ్మడి బహుళ రాష్ట్రాల ఆపరేషన్లతో నేరగాళ్ల మూలాలను ఛేదించాలని స్పష్టం చేశారు. సైబర్ ఆర్థిక మోసాలకు గురైన బాధితులు వెంటనే 1930కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ప్రతి నిమిషం కీలకమని హెచ్చరించారు.

నిధులు రాబట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సమీక్ష నిర్వహించారు. కేంద్ర పథకాల మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించి సకాలంలో సమర్పించాలని, కేంద్ర శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వం కూడా 40 శాతం నిధులు సమకూరుస్తున్నందున, ఖర్చుతోపాటు వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలపైనా కూడా దృష్టి పెట్టాలని అన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. కేంద్ర నిధుల విడుదల, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఢిల్లీలోని తెలంగాణ భవన్ లైజన్ అధికారుల సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కేంద్ర మంత్రులకు రాసిన లేఖలలోని అంశాలపై తదుపరి చర్యలు తీసుకోవాలని తెలిపారు. మూలధన పెట్టుబడుల కోసం కేంద్రం అందిస్తున్న ప్రత్యేక సహాయ పథకాన్ని కూడా గరిష్టంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా నీటిపారుదల, పట్టణాభివృద్ధి, రవాణా, వ్యవసాయం, వైద్య ఆరోగ్య శాఖలు కేంద్ర పథకాల అమలును వేగవంతం చేయాలని డిప్యూటీ సిఎం సూచించారు. పెండింగ్ సమస్యలు, సాంకేతిక ఇబ్బందులను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ కేంద్ర ప్రాయోజిత పథకాలకు రాష్ట్ర వాటా నిధులను సకాలంలో విడుదల చేస్తున్నామని, పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తూ బిల్లులను క్లియర్ చేస్తున్నామని వివరించారు. వివిధ పథకాల పురోగతి, నిధుల వినియోగంపై అధికారులు ఉప ముఖ్యమంత్రికి నివేదిక అందించారు. అంతకుముందు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పూర్తి వివరాలను ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

దేశవాళీ క్రికెట్ ఆడాకే పాండ్యా రీఎంట్రీ..

అందుకే ఆ ఇద్దరికీ అవకాశం : శుభ్‌మన్ గిల్



దేశవాళీ క్రికెట్ ఆడిన తర్వాతే హార్దిక్ పాండ్యా భారత జట్టులోకి పునరాగమనం చేస్తాడని వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. న్యూజిలాండ్ పర్యటనలో ముందుగా వన్డే సిరీస్ ఆడించాల్సిందని అభిప్రాయపడ్డాడు.టి–20లకు బదులు వన్డే సిరీస్ ముందుగా నిర్వహించి ఉంటే తమ పూర్తి జట్టు సిరీస్ మొత్తం ఆడేదని తెలిపాడు. టెస్ట్ సిరీస్ కోసం చివరి రెండు మ్యాచ్‌లకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పుకొచ్చాడు. న్యూజిలాండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమైంది. బుధవారం అక్లాండ్ వేదికగా జరగనున్న తొలి మ్యాచ్‌తో ఈ ఐదు వన్డేల సిరీస్‌కు తెరలేవనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో శుభ్‌మన్ గిల్ మంగళవారం మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. జట్టు కూర్పు, హార్దిక్ రీఎంట్రీ, డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు గురించి విషయాలను పంచుకున్నాడు.

'మాకు వన్డే, టెస్ట్ సిరీస్ రెండు ముఖ్యమైనవే. ఆటగాళ్లందరూ ఫిట్‌గా అందుబాటులో ఉంటే వరల్డ్ కప్ కోసం అనుకుంటున్న కాంబినేషన్‌తో ఈ వన్డే సిరీస్ ఆడాలనుకున్నా. కానీ అప్‌కమింగ్ టెస్ట్ సిరీస్ మాకు అత్యంత కీలకం. ఈ పర్యటనలో టి–20 సిరీస్‌కు బదులు ముందుగా వన్డేలు ఆడించి ఉంటే బాగుండేది. అప్పుడు ఐదు వన్డేల్లో మా అత్యుత్తమ జట్టుతో బరిలోకి దిగేవాళ్లం. కానీ వన్డే సిరీస్, టెస్ట్ సిరీస్‌కు మధ్య సమయం చాలా తక్కువగా ఉండటంతో చివరి రెండు మ్యాచ్‌లకు టెస్ట్ జట్టులో ఉన్న కొంత మంది దూరం కావాల్సి వస్తోంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ రేసు ప్రస్తుతం రసవత్తరంగా మారింది. ఆస్ట్రేలియాపై సొంతగ్రౌండ్‌లో సిరీస్ విజయం పాయింట్స్ మరింత ఉత్కంఠగా మార్చింది. న్యూజిలాండ్‌తో రెండు టెస్ట్ సిరీస్‌లలో మేం బాగా ఆడి.. ఆ తర్వాత సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో జరిగే సిరీస్‌లో రాణిస్తే మా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే అవకాశాలు మెరుగవుతాయి. హార్దిక్ పాండ్యా అద్భుతమైన ఆల్‌రౌండర్. అతను కొత్త బంతితో పాటు మిడిల్ ఓవర్లలో, డెత్ ఓవర్లలో బౌలింగ్ చేయగలడు. బ్యాటింగ్ సామర్థ్యం కూడా జట్టుకు అద్వాంటేజ్ అవుతుంది. అతనిలాంటి ఆల్‌రౌండర్ స్కిల్స్ చాలా తక్కువ మంది ఆటగాళ్లకు ఉంటాయి. ఐపిఎల్ తర్వాత అతను ఆటకు దూరమవడం దురదృష్టకరం. హార్దిక్‌తో నేను చాలాసార్లు మాట్లాడాను. భారత్–ఎ తరపున అతను మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా.. మళ్లీ గాయపడటంతో ఆడలేకపోయాడు. త్వరలోనే పూర్తి ఫిట్‌నెస్ సాధించి దేశవాళీ క్రికెట్ ఆడి మళ్లీ భారత జట్టులోకి వస్తాడని ఆశిస్తున్నా. వన్డే ప్రపంచకప్ 2027 నేపథ్యంలో మిడిల్ ఓవర్ల లో రాణించే ఫాస్ట్ బౌలర్లకు ప్రాధాన్యత ఇస్తున్నాం. బంతి పాతబడినప్పుడు, పిచ్ నుంచి సీమ్ లేదా స్వింగ్ లభించనప్పుడు బ్యాటర్లను ఎలా కట్టడి చేయాలనేది కీలకం. పిచ్ నుంచి సహకారం లేనప్పుడు పేస్, బౌన్స్ ఉన్న బౌలర్లు మాత్రమే బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలరు. అలా పేస్, బౌన్స్‌తో పాటు మిడిల్ ఓవర్లలో వికెట్లు తీస్తూ.. పరుగులు నియంత్రించగల బౌలర్లను గుర్తించాలనుకుంటున్నాం. అందుకే గుర్నూర్ బ్రార్, ప్రసిద్ కృష్ణ వంటి పొడవైన బౌలర్లను పరిశీలిస్తున్నాం. ఫ్లాట్ పిచ్లపై 135 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసే వారికంటే హైట్ ఎక్కువ ఉన్న బౌలర్లు బాగా ఉపయోగపడుతారు. నేను చాలాసార్లు మిడిల్ ఓవర్లలో బ్యాటింగ్ చేశాను. 6 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉండి, గంటకు 140 కిలోమీటర్ల వేగంతో సరైన లైన్ అండ్ లెంగ్‌తో బౌలింగ్ చేసే వారిని ఎదుర్కోవడం బ్యాటర్లకు చాలా కష్టం. అలాంటి బౌలర్లపై స్వేచ్ఛగా పరుగులు చేయాలంటే చాలా రిస్క్ తీసుకోవాల్సి వస్తుంది.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.

ఆరోగ్యం



'మెనోపాజ్'లో కళ్లపై శ్రద్ధ అవసరం

సాధారణంగా మెనోపాజ్ సమయంలో వేడి ఆవిర్లు, నిద్రలేమి, మానసిక స్థితిలో మార్పుల గురించి ఎక్కువగా చర్చిస్తారు. అయితే, ఈ దశలో కళ్ల ఆరోగ్యంలో కూడా మార్పులు సంభవించవచ్చని వైద్య నిపుణులు గుర్తుచేస్తున్నారు. ఈస్ట్రోజెన్, ఆండ్రోజెన్ వంటి హార్మోన్ల స్థాయిలు తగ్గడం వల్ల కన్నీటి ఉత్పత్తి, కంటి ఉపరితల ఆరోగ్యం ప్రభావితమయ్యే అవకాశం ఉంది. కళ్ల పొడిబారడం ఈ దశలో కనిపించే సమస్యల్లో ఒకటి. కళ్లలో మంట, ఇసుక ఉన్నట్లుగా అనిపించడం, ఎర్రబడటం, కొన్నిసార్లు అధికంగా నీరు కారడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఎక్కువసేపు కంప్యూటర్ లేదా మొబైల్ తెరను చూడటం వల్ల కళ్లను రెప్పవేయడం తగ్గి పొడిబారడం మరింత పెరగవచ్చు. హార్మోన్ల మార్పులతో పాటు వయస్సు, ఇతర అనారోగ్యాలు, కొన్ని మందుల వాడకం కూడా ఈ సమస్యకు కారణమవుతాయి. కొంతమంది మహిళల్లో చూపు తాత్కాలికంగా అస్పష్టంగా మారవచ్చు లేదా కళ్లద్దాల పవర్ మారినట్లు అనిపించవచ్చు. మెనోపాజ్ తర్వాత గ్లాకోమా వంటి కంటి వ్యాధుల ప్రమాదంపై కూడా పరిశోధనలు కొనసాగుతున్నాయి. గ్లాకోమా ప్రారంభ దశల్లో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చు కాబట్టి క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం ముఖ్యం. అయితే, మెనోపాజ్ వచ్చిన ప్రతి మహిళకు కంటి వ్యాధులు వస్తాయని భావించకూడదు. అయితే, కళ్లలో నిరంతర మంట, చూపు మార్పులు లేదా నొప్పి ఉంటే కంటి వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుల సలహా మేరకు తగిన కంటి చుక్కలు ఉపయోగించడం, తెరను చూసే సమయంలో విరామాలు తీసుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. మెనోపాజ్ లక్షణాలన్నింటినీ వయస్సు ప్రభావంగా భావించి నిర్లక్ష్యం చేయకుండా, శరీరంలో వచ్చే మార్పులను గమనించడం అవసరం.

సహజీవన భాగస్వామికీ గృహ హింస చట్టం వర్తింపు!



వివాహం కాకుండానే, సహజీవనం చేయడం ఇటీవల కాలంలో ఒక ట్రెండ్‌గా మారింది. అయితే, కొంతకాలం తర్వాత తలెత్తే ఘర్షణలు, శారీరక మానసిక హింసలు మహిళలకే ఎక్కువ. ఇప్పటి వరకూ కేవలం వివాహిత మహిళలకు మాత్రమే వర్తిస్తుందనుకున్న గృహహింస చట్టం, ఈ విధంగా సహజీవనం సాగించే మహిళలకు కూడా వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం శుభపరిణామం. డా.లోకేశ్ బి.హెచ్. తదితరులు వర్సెస్ కర్ణాటక రాష్ట్రం కేసులో ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు, వివాహేతర సహజీవన సంబంధాల్లో ఉన్న మహిళలకు గృహహింస నుంచి చట్టపరమైన రక్షణకు సంబంధించిన కీలక అంశాన్ని స్పష్టం చేసింది. భర్త లేదా అతని బంధువులు మహిళపై క్రూరత్వానికి పాల్పడటాన్ని నేరంగా పరిగణించే పాత ఐపీసీ సెక్షన్ 498 'ఎ'కు, ప్రస్తుతం భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 85 సమానమైన నిబంధనగా ఉంది. వివాహం చట్టబద్ధంగా జరగకపోయినా, ఒక జంట వివాహ స్వభావం కలిగిన సంబంధంలో జీవిస్తే, కొన్ని పరిస్థితుల్లో ఈ నేరపరమైన రక్షణను మహిళ కోరవచ్చని కోర్టు పేర్కొంది. అయితే సంబంధంలో వివాహం చేసుకోవాలనే ఉద్దేశం ఉందని మొదట నిరూపించాల్సిన బాధ్యత రక్షణ కోరుతున్న మహిళపై ఉంటుంది. దానికి కోర్టు నిర్దిష్టమైన ఒకే ప్రమాణాన్ని నిర్ణయించలేదు. క్రిమినల్ బాధ్యతను విధించే నిబంధన కావడంతో ఆధారాలను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుంది. ఇలాంటి సంబంధాన్ని గుర్తించేటప్పుడు కలిసి నివసించడం, ఆర్థిక వ్యవహారాలను పంచుకోవడం, స్థిరమైన దాంపత్యజీవితం కొనసాగించడం, సమాజంలో భార్యాభర్తలుగా గుర్తింపు పొందడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవచ్చు. వివాహిత మహిళకు మాత్రమే రక్షణ కల్పించి, అదే తరహా గృహహింసను ఎదుర్కొంటున్న అర్హత కలిగిన సహజీవన భాగస్వామికి రక్షణ నిరాకరించడం సమానత్వ హక్కుకు విరుద్ధమని కోర్టు పేర్కొంది. అయితే గృహహింస చట్టం ప్రధానంగా రక్షణ, భరణం వంటి సివిల్ పరిహారాలను అందిస్తే, సెక్షన్ 85 క్రిమినల్ శిక్షను ఉద్దేశిస్తుంది. అరెస్టు విషయంలో అర్నేష్‌కుమార్ తీర్పులో నిర్దేశించిన ముం దస్తు విచారణ నిబంధనలను పోలీసులు తప్పనిసరిగా పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

16 ఏళ్లకే చరిత్ర.. భారత అమ్మాయి సరికొత్త రికార్డు!



భారత స్విమ్మింగ్ చరిత్రలో ధినిధి దేశింగు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. 16 ఏళ్ల ఈ బెంగళూరుకు చెందిన స్విమ్మర్ దకార్ 2026 యూత్ ఒలింపిక్ క్రీడల్లో మహిళల 100 మీటర్ల ఫ్రీస్టైల్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. 56.27 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని జాతీయ రికార్డు నెలకొల్పింది. యూత్ ఒలింపిక్స్ స్విమ్మింగ్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన ఘనతను సొంతం చేసుకుంది. ధినిధి విజయం యావత్ దేశానికి గర్వకారణమని ఆమెకు మద్దతుగా నిలుస్తున్న బజాజ్ ఫిన్‌సర్వ్ పేర్కొంది. సోమవారం దకార్‌లో జరిగిన ఫైనల్ పోటీలో 56.27 సెకన్లతో జాతీయ రికార్డు సృష్టించి కాంస్య పతకం సాధించింది. క్రొయేషియాకు చెందిన అనా బోబనోవిచ్ 55.89 సెకన్లతో స్వర్ణ పతకం, న్యూజిలాండ్‌కు చెందిన అలిస్సా లాసన్ 56.13 సెకన్లతో రజత పతకం గెలుచుకున్నారు. యూత్ ఒలింపిక్స్ స్విమ్మింగ్ ఫైనల్‌కు చేరుకున్న తొలి భారత మహిళా స్విమ్మర్‌గా కూడా ధినిధి మరో ఘనత సాధించింది. .

అంతర్జాతీయ క్రికెట్‌కు గ్లెన్ మ్యాక్స్‌వెల్ గుడ్‌బై



ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పారు. 14 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌కు అతను ముగింపు పలికారు. 38 ఏళ్ల ఆ క్రికెటర్ చివరిసారి 2026 టి–20 వరల్డ్‌కప్‌లో ఒమన్తో జరిగిన మ్యాచ్‌లో ఆడాడు. ఆ మ్యాచ్‌లో రెండు వికెట్లు తీశాడు. కానీ బ్యాటింగ్ చేయలేదు. ఆస్ట్రేలియా తరపున మ్యాక్స్‌వెల్ మొత్తం 149 వన్డేలు, 130 టి–20లు, ఏడు టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. 2015, 2023లో వన్డే వరల్డ్‌కప్ గెలిచిన ఆస్ట్రేలియా బృందంలో అతను ఉన్నాడు. ఆస్ట్రేలియా జట్టులో చాన్నాళ్లు కీలక ప్లేయర్‌గా మ్యాక్స్‌వెల్ కొనసాగాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యేకతను సంతరించుకున్నాడు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై డబుల్ సెంచరీ చేశాడు. వన్డేల్లో 3990 రన్స్ చేశాడు. వాటిల్లో స్ట్రయిక్ రేట్ 126.7గా ఉంది. ఇక టి–20ల్లో 2897 రన్స్ చేశాడు. అంతర్జాతీయ క్రికెట్లో మ్యాక్స్‌వెల్ ఖాతాలో మొత్తం 10 సెంచరీల ఉన్నాయి. మూడు ఫార్మాట్లలో కలిపి అతను 136 వికెట్లు తీసుకున్నాడు. వాస్తవానికి 2025లో వన్డే క్రికెట్కు మ్యాక్స్‌వెల్ రిటైర్మెంట్ ప్రకటించాడు. కానీ టీ20 జట్టుకు అందుబాటులో ఉన్నాడు. 2026 టీ20 వరల్డ్‌కప్‌లో అతను ఆడాడు.

వైమానిక దళంలో మహిళా 'శక్తి'



భారత రక్షణ రంగంలో శక్తి శర్మ చారిత్రక ఘనత సాధించారు. వైద్య విభాగంతో సంబంధం లేకుండా, భారత సాయుధ దళాల్లో ఎయిర్ వైస్ మార్షల్ లేదా సమాన హోదాకు ఎదిగిన తొలి మహిళా అధికారిగా ఆమె గుర్తింపు పొంది, యావత్ మహిళా లోకానికి మార్గదర్శకురాలయ్యారు. ఎయిర్ వైస్ మార్షల్ భారత వైమానిక దళంలో రెండు నక్షత్రాల హోదా. ఇది సైన్యంలో మేజర్ జనరల్, నౌకాదళంలో రియర్ అడ్మిరల్ హోదాలకు సమానం. ఈ అరుదైన ఘనతను అందుకున్న శక్తి శర్మ 1994 జూన్ 18న భారత వైమానిక దళం ఎడ్యుకేషన్ బ్రాంచ్‌లో అధికారిగా చేరారు. మూడు దశాబ్దాలకు పైగా సాగిన సేవలో శిక్షణా సంస్థలు, ఫీల్డ్ స్టేషన్లు, కమాండ్ ప్రధాన కార్యాలయాలు, ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో వివిధ బాధ్యతలు నిర్వహించారు. వైమానిక దళంలో విద్య, శిక్షణ, పరిశోధన, సంస్థాగత అభివృద్ధికి ఆమె చేసిన కృషి ప్రత్యేకంగా నిలిచింది. కాన్పూర్ ఐఐటి, పుణే విశ్వవిద్యాలయంలో ఐఎఎఫ్ 'చెయిర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. దీనివల్ల రక్షణ పరిశోధన, విద్యాసంస్థలతో జ్ఞాన మార్పిడి, వ్యూహాత్మక సహకారానికి అవకాశాలు పెరిగాయి. ఎయిర్ వైస్ మార్షల్‌గా ఎదగడానికి ముందు కపుర్తలా సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్‌గా పనిచేసి, మూడు సర్వీసుల్లో సైనిక్ స్కూల్‌కు నాయకత్వం వహించిన తొలి మహిళా అధికారిగా మరో ఘనత సాధించారు. మహిళలకు శాశ్వత కమిషన్ అవకాశాలు పెరగడం వారి దీర్ఘకాలిక కెరీర్, నాయకత్వ ప్రస్థానానికి మార్గం సుగమం చేసింది.

కరువు రాష్ట్రంగా ప్రకటించాలి

తక్షణమే కరువు నివారణ నిధులు తెలంగాణకు విడుదల చేయాలి
రుణాలు రీ షెడ్యూల్ చేయాలి
ఉపాధి పనులు చేపట్టాలి
నిత్యావసరాలు అందజేయాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్
కరువు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సిపిఐ బృందాలు



ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణను కరువు రాష్ట్రంగా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనతో సరిపుచ్చుకోకుండా తక్షణం కరువు నివారణ చర్యలకు నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. మంగళవారం ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలంలో తనికెళ్ల, కొణిజర్ల తదితర కరువు ప్రభావిత మండలాల్లో సిపిఐ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా తనికెళ్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ తక్షణం రూ.25వేల కోట్లను కేంద్రం నిధులు విడుదల చేయాలని, అప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు పనులు కొనసాగించేందుకు నిధులు విడుదల చేయాలని కోరారు. పంచాయతీలకు ప్రత్యేక కరువు నిధులను కేటాయించాలని, వివి జీ రాంజీ పథకం ద్వారా పనులు చేపట్టడంతో పాటు పని దినాల సంఖ్యను పెంచాలన్నారు. పశుగ్రాసం కొరత రాకుండా చూడడంతో పాటు చిన్న, సన్న కారు రైతులకు ఉపయోగపడే విధంగా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, వరికి రూ.30వేలు, వాణిజ్య పంటలకు రూ.50 వేలు పరిహారంగా అందించాలని ఆయన కోరారు. 14 రకాల నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. ప్రస్తుత పంటలను కాపాడేందుకు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించాలని కూనంనేని కోరారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, నాయకులు రవీంద్రబాబు, మిడికంటి వెంకటరెడ్డి, తోట రామాంజనేయులు, గదల భాస్కర్ పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి : చాడ వెంకట్‌రెడ్డి

రామడుగు, కరీంనగర్ : రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే జాతీయ విపత్తుగా ప్రకటించి, సహాయ చర్యలు చేపట్టడానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కరువు ప్రాంతాలలో సిపిఐ బృందాలు పర్యటిస్తున్న నేపథ్యంలో మంగళవారం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం మోతే గ్రామంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి చాడ వెంకట్‌రెడ్డి ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో చాడ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ బృందాలు కరువు ప్రాంతాలను పర్యటించి, రైతుల కష్టాలను ఎండిపోయిన పంటలను ప్రత్యక్షంగా తెలుసుకొని రాష్ట్రప్రభుత్వానికి నివేదిస్తామని, ఈనెల 10న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహిస్తున్నామని వెంకట్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రనాయకులు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మీ, నాగెల్లి లక్ష్మారెడ్డి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, పిట్టల సమ్మయ్య, న్యాల్ల రాజు, ఉమ్మెంతల రవీందర్‌రెడ్డి, కసిరెడ్డి మణికంఠరెడ్డి, మచ్చ రమేష్, అందె చిన్న స్వామి, గొడిసెల తిరుపతి గౌడ్, వేముల మల్లేశం, మచ్చ నర్సయ్య, గోలీ బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి : తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ : రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని, తక్షణమే ప్రభుత్వం కరువు మండలాలలో సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లాలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వేలేరు, ధర్మసాగర్, హసన్ పర్తిల లోని కరువు ప్రభావిత గ్రామాలు, ఎండిపోతున్న పంట పొలాలను సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, నాయకులు నేదునూరి జ్యోతి, ఆదరి శ్రీనివాస్, మారుపాక అనిల్ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, నేదునూరి రాజమౌళి, జక్కు రాజు గౌడ్, నకిర్త ఓదెలు, మర్రి శ్రీనివాస్, నిమ్మల మనోహర్, గోకల రాజయ్య, దొమ్మాటి ప్రవీణ్, సునిల్, గట్టయ్య పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టాలి : కలవేణ శంకర్

మందమర్రి : రాష్ట్రంలోని కరువు మండలాల్లో ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టి, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని సారంగపల్లి, ఆదిలోపేట, పొన్నారం, శంకర్ పల్లె, చిర్రకుంట గ్రామాల్లో ఆయన పర్యటించి దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మిట్ట పెల్లి వెంకటస్వామి, మేకల దాను, రేగుంట చంద్రశేఖర్, జోగుల మల్లయ్య, ఇప్పకాయల లింగయ్య, భీమనాధుని సుదర్శన్, దాగం మల్లేష్, మిట్టపల్లి శ్రీనివాస్, వనం సత్యనారాయణ, కామెర దుర్గారాజ్, మిట్టపల్లి పౌలు, బొంతల లక్ష్మీ నారాయణ, ఆడపు రాజమౌళి, గుండా మాణిక్యం, మామిడి గోపి, నక్క వెంకటస్వామి, జాడిపోశం, దేవిపోశం, పూజారి రామన్న, కొత్తపెల్లి మహేష్, పెరిక సంపత్, మేకల రాజేశం, రత్నం రాజం, దొంతుల రాజన్న పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి : పశ్య పద్మ


కామారెడ్డి : క్షేత్రస్థాయిలో ఎండిపోయిన పొలాల వివరాలు నమోదు చేసుకోవాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ బృందం కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఇస్సాయిపేట గ్రామంలో పంట దెబ్బతిన్న రైతులతో మాట్లాడి జరిగిన నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా ఇస్సాయిపేట గ్రామంలో ఎండిపోయిన పొలాలను చూడటానికి నమోదు చేసుకోవడానికి ఏ అధికారులు రాకపోవటం పట్ల రైతాంగం ఆందోళన చెందుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి దశరథ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దేవయ్య, రాష్ట్ర సంఘం నాయకులు కె.రాజం, జోహార్ కృష్ణమూర్తి, ఉప్పు రాజయ్య, నరసయ్య, తెలుగోళ్ళ ఎల్లవా, సి.దేవయ్య, దాసరి కమల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేలు చెల్లించాలి : వి.ఎస్.బోస్


శామీర్‌పేట : ఎల్ నినో ప్రభావం వలన పంటలు ఎండిపోయాయని, పంటలు నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్,డిజి సాయిలుగౌడ్‌లతో కలిసి శామీర్‌పేట మండలంలో వర్షాభావ పరిస్థితిల్లో ఎండిపోయిన వరి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శామీర్‌పేట మండల వ్యవసాయ అధికారి రమేష్‌కు పంటనష్టంపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి నిమ్మల నర్సింహా, నాయకులు జె.లక్ష్మి, బాపు, కార్యదర్శి రాజు, కృష్ణ, వెంకటేష్, రాజు రెడ్డి, భూమయ్య, సోగడా రమేష్, నరేంద్రచారి, స్వామి, చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.


సిద్దిపేట : సిద్దిపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్ మండలంలోని కుందన్‌వాని పల్లి, చౌటకుంట తండా, గౌరవెల్లి, కోహెడ మండల పరిధిలోని కూరేళ్ల, పర్వేద గ్రామాల్లో ఎండిన వరి పంటలను పరిశీలించారు. సిపిఐ జిల్లా నాయకులు యెదల వనేశ్, పిలి రజిని, ముంజ గోపు, తాల్లపెల్లి ఎల్లయ్య, బండారు లక్ష్మణ్, కందుకూరి అంతయ్య చిట్యాల శేఖర్, వేల్పుల ప్రసన్న కుమార్, రసూరి యుగేందర్, చల్లా సత్తిరెడ్డి, జాగిరి బాలయ్య. చంద్రయ్య, సుంకె కనకయ్య, వేల్పుల చంద్రశేఖర్, సురేష్, కందుకూరి మహేశ్, కొమ్ముల భాస్కర్, ఎదల వనేశ్, జేరిపోతుల జనార్ధన్ పాల్గొన్నారు.













ఐడిఎల్‌లో భారీ పేలుడు

నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు



షాక్ ట్యూబ్ తయారీ ప్లాంట్ భవనం ధ్వంసం.. యంత్ర సామగ్రి నుజ్జు నుజ్జు

కార్మికుల ప్రాణాలతో చెలగాటం..భద్రతా ప్రమాణాలు గాలికి.. యాజమాన్యంపై విచారణ

బాధితులకు రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి : సిపిఐ డిమాండ్

ప్రజాపక్షం/నల్లగొండ (నార్కట్‌పల్లి) : మండల పరిధిలో గల గోపలాయపల్లి గ్రామ శివారులోని ఐడిఎల్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మంగళవారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. పరిశ్రమలోని షాక్ ట్యూబ్ తయారీ ప్లాంట్‌లో జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు ప్లాంట్ భవనం పూర్తిగా ధ్వంసం కాగా, అందులోని యంత్ర సామగ్రి నుజ్జునుజ్జయింది. ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

మిశ్రమం చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు

కంపెనీలో కార్మికులు ఉదయం సుమారు 6.30 గంటల సమయంలో షాక్ ట్యూబ్ తయారీ ప్లాంట్ బిల్డింగ్ నంబర్ 58ఎలో విధులు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో హెచ్ఎంఎక్స్ అల్యూమినియం పౌడర్ మిశ్రమానికి సంబంధించిన పనులు జరుగుతుండగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది.పేలుడు ధాటికి భవనం తీవ్రంగా దెబ్బతిని పూర్తిగా ధ్వంసమైంది.లోపల ఉన్న యంత్ర పరికరాలు చెల్లాచెదురయ్యాయి. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న నలుగురు కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదంలో రామన్నపేట క్రిస్టియన్ కాలనీకి చెందిన పబ్బు శివకుమార్‌తో పాటు ప్రతాప్ దేహూరి, ఈశ్వర్ ప్రధాన్ అలియాస్ తపన్, ఉత్తమ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు.వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం.బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులు సూచించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అధికారులు

ప్రమాద సమాచారం అందుకున్న నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివరాంరెడ్డి, తహసీల్దార్ టి.వేణుగోపాల్ రావు, సిఐ ఎస్.సురేష్, ఎస్ఐ సిహెచ్.వెంకటేశ్వర్లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలు, భద్రతా ఏర్పాట్లు, పరిశ్రమలో అనుసరిస్తున్న నిబంధనలపై వివరాలు సేకరించారు. గోపలాయపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి గణపురం నిరంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్కట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాజమాన్యం నిర్లక్ష్యం.. భద్రతా ప్రమాణాలు పాటించారా.. అనే కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఐడిఎల్ పరిశ్రమలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు, కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. పేలుడు పదార్థాలు, డిటోనేటర్ల తయారీకి సంబంధించిన కార్యకలాపాలు నిర్వహించే పరిశ్రమలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఉండాల్సి ఉండగా, కార్మికులకు తగిన రక్షణ సదుపాయాలు కల్పించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలి : సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్

ప్రమాదం నేపథ్యంలో సిపిఐ నాయకుల బృందం పరిశ్రమను సందర్శించింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ కార్మికుల భద్రతను విస్మరిస్తోందని విమర్శించారు. గాయపడిన నలుగురు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, వారికి సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించే బాధ్యత యాజమాన్యమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, కార్మిక సంఘం నాయకుడు దుబ్బ నరసింహ, నార్కట్‌పల్లి పట్టణ కార్యదర్శి శ్రీపతి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు విస్తరణకు పెద్దపీట


30న హైదరాబాద్‌లో ఐవిపిఎ గ్లోబల్ రౌండ్‌టేబుల్ సమావేశం
ముఖ్య అతిథిగా హాజరుకావాలని మంత్రి తుమ్మలకు ఆహ్వానం



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగులో భాగస్వాములుగా ఉన్న కంపెనీలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పూర్తి సహకారం అందిస్తున్నామని వెల్లడించారు. ఈ నెల 30న హైదరాబాద్‌లో ఇండియన్ వెజిటేబుల్ ఆయిల్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐవిపిఎ) నిర్వహించనున్న గ్లోబల్ రౌండ్‌టేబుల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి ఆహ్వానించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ భవిష్యత్తు, రైతుల ఆదాయం, ఉత్పాదకత పెంపు, పరిశ్రమల భాగస్వామ్యంపై ప్రసంగించాలని కోరారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ గోద్రెజ్, పతంజలి, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి సంస్థలు రాష్ట్రంలో ఆయిల్‌పామ్ రంగం అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నాయని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా ఆరో తరం హైబ్రిడ్ ఆయిల్‌పామ్ విత్తనాల అభివృద్ధి కోసం గోద్రెజ్ సీడ్ గార్డెన్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని వెల్లడించారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని నూనెగింజల పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. వంటనూనెల దిగుమతులపై దేశం ఆధారపడటాన్ని తగ్గించేందుకు ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర నూనెగింజల సాగును విస్తరించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతులకు మెరుగైన ఆదాయం కల్పించడంతో పాటు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

విద్యుత్ వినియోగం పెరగడం అభివృద్ధికి చిహ్నం

ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరగడం అభివృద్ధికి చిహ్నమని, ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పరిశ్రమల ఉత్పత్తి పెరిగి విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. రాష్ట్ర విద్యుత్ రంగానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. విద్యుత్ నియంత్రణ మండలి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరైన ఆయన ఈ మేరకు మాట్లాడారు.గత ప్రభుత్వం విద్యుత్ రంగానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వెల్లడించే ప్రయత్నం చేయలేదని బల్మూర్ వెంకట్ విమర్శించారు. బొగ్గు లభ్యతను పరిగణనలోకి తీసుకోకుండానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌ను నిర్మించిందని ఆరోపించారు. భారీ వ్యయంతో నిర్మించిన ఈ ప్లాంట్‌ను ప్రజా ప్రభుత్వం వినియోగంలోకి తీసుకొచ్చిందని తెలిపారు.బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటి ప్రాజెక్టులు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణ వ్యయాలు అంచనాలను మించి భారంగా మారాయని విమర్శించారు. నీరు, విద్యుత్ అంశాల్లో బిఆర్ఎస్ నాయకులు ప్రజలకు తప్పుడు సమాచారం అందిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి అంశంలోనూ పారదర్శకంగా వ్యవహరిస్తూ వాస్తవాలను వెల్లడించేందుకు ప్రయత్నిస్తున్నామని డాక్టర్ బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు.

విదేశీయుల ఓట్లు తొలగింపు ముసుగులో

దేశ ప్రజల ఓట్లను తొలగించొద్దు

‘దొంగే దొంగ’ అని అరిచినట్లు అమిత్ షా వ్యాఖ్యలు

టిపిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా అసలు ప్రజాస్వామ్యమంటే ఏమిటో అర్థం చేసుకోవాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్వర్ రావు అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినదిస్తున్న అమిత్ షా వ్యాఖ్యలు ‘దొంగే దొంగ’ అని అరిచినట్లుగా ఉన్నాయని విమర్శించారు. విదేశీయుల ఓట్లను తొలగించడంలో తప్పులేదని, అయితే ఆ పేరుతో దేశ ప్రజల ఓట్లను తొలగించరాదని స్పష్టం చేశారు.నోట్ల రద్దుతో దేశంలో ఉగ్రవాదం అంతమవుతుందని గతంలో ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ఆ లక్ష్యాన్ని సాధించిందా అని ప్రశ్నించారు. అదానీ పోర్టులో హెరాయిన్ పట్టుబడిన ఘటనలపై అమిత్ షా ఏం చేస్తున్నారని నిలదీశారు. ‘లోక్‌తంత్ర్ బచావో’ అంటూ ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడుతున్న అమిత్ షాకు మణిపూర్‌లో మహిళలపై జరిగిన అఘాయిత్యాలు కనిపించలేదా అని ప్రశ్నించారు.అవినీతి గురించి అమిత్ షా మాట్లాడటం సిగ్గుచేటని జగదీశ్వర్ రావు విమర్శించారు. దేశంలో అవినీతికి పాల్పడిన వారంతా బీజేపీలోనే ఉన్నారని ఆరోపించారు. జనగణనలో కులగణన చేపడతామని అబద్ధపు హామీ ఇచ్చి బీసీలను మోసం చేశారని మండిపడ్డారు.రాంలీలా మైదానంలో కాంగ్రెస్ సమరశంఖం పూరించిందని, రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. అమిత్ షా తన వైఖరిని మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని సంగిశెట్టి జగదీశ్వర్ రావు హెచ్చరించారు.


ప్రజాపథకాల అమలు సమీక్షల్లో బాధ్యత ఏది?

ఆరుగురు చీఫ్ సెక్రటరీల గైరుహాజరుపై పిఎసి ఛైర్మన్ విమర్శ

తిరువనంతపురం : పార్లమెంటు పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ(పి.ఎ.సి) ఇటీవల నిర్వహించిన సమావేశానికి ఆరు రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు గైరుహాజరు కావడంపట్ల కమిటీ ఛైర్మన్, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు కె.సి.వేణుగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని అన్నారు. దేశంలో పౌరుల సంక్షేమంకోసం ఉద్దేశించిన విధానాలు, పథకాలపై చట్టసభల వ్యవస్థ తన నిఘాను కొనసాగించాల్సిన అవసరం ఉందని గట్టిగా నొక్కి చెప్పారు. పార్లమెంటు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీల ఛైర్‌పర్సన్స్ రెండు రోజుల సదస్సు మంగళవారం కేరళరాష్ట్ర అసెంబ్లీలో ప్రారంభమైంది. కె.సి.వేణుగోపాల్ ప్రారంభించిన ఈ సదస్సుకు కేరళం ముఖ్యమంత్రి వి.డి.సతీసన్ కూడా హాజరయ్యారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా(కాగ్) తన ఆడిట్ల సంఖ్యను గణనీయంగా పెంచాలని, ప్రజల శ్రేయస్సుకు సంబంధించిన సమగ్ర శిక్ష అభియాన్, స్వచ్ఛభారత్ మిషన్, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన వంటి పథకాల అమలును మరింత ప్రముఖంగా సమీక్షించి వాటి నివేదికలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. ఇది కాగ్ బాధ్యతగా పేర్కొన్నారు. పిఎసిలో సమీక్షలు చేయడం అంటే ప్రజలపట్ల ప్రభుత్వానికి బాధ్యత పెంచడం, పథకాలు, విధానాలను గతంకంటే మరింత మెరుగైన పద్ధతిలో తీర్చిదిద్దడమే తప్ప తప్పులు ఎన్ని నిలదీసే కార్యక్రమం కాదని అన్నారు. ఉదాహరణకు గతంలో జరిగిన సమావేశానికి ఆరుగురు ప్రధాన కార్యదర్శులు హాజరుకాలేదని చెప్పారు. షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అనే విషయం తెలుసుకోవడంకోసం మౌఖిక సాక్ష్యాలను సేకరించడానికి ఈ ఉన్నతస్థాయి అధికారులను పిలిపించామని, కానీ వారు రాలేదని అన్నారు.విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల మద్దతుతో చదువుకుంటారని,వారంగా అణగారిన వర్గాలకు చెందినవారని పేర్కొన్నారు. ఈ విధంగా గైరుహాజరైతే తప్పులను సమీక్షించి వ్యవస్థలో దిద్దుబాట్లు చేయడం కష్టం అవుతుందని చెప్పారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిందిగా ఈ సదస్సుకు హాజరైన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను వేణుగోపాల్ కోరారు. ఈ ప్రక్రియలో చట్టసభ నియంత్రణకు పిఎసి, కాగ్ మధ్య సంబంధమే కీలకమైనదని అన్నారు. కాగ్ తన ఆడిట్ల సంఖ్యను గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా ప్రజాసంబంధ పథకాలపై కూడా ఆడిటింగ్ పెంచాలన్నారు. రక్షణ, రైల్వే రంగాలకు సంబంధించి భారీగా ఆడిట్ నివేదికలు వస్తున్నాయిగానీ, ఆరోగ్యం, దేశీయ వ్యవహారాలు, విద్య, విదేశీ వ్యవహారాలకు సంబంధించిన ఆడిట్ నివేదికలు అందులో సగం కూడా రావడం లేదని విమర్శించారు. గడచిన ఆరు సంవత్సరాలలో రక్షణ రంగానికి సంబంధించి 33 నివేదికలు, రైల్వేకు సంబంధించి 30 సమీక్షా నివేదికలు వచ్చాయని, కానీ ఆరోగ్యరంగానికి సంబంధించి 14 సమీక్షా నివేదికలు, విదేశీ వ్యవహారాలకు సంబంధించి 14 నివేదికలు మాత్రమే వచ్చాయని, విద్యకు సంబంధించి కేవలం ఏడు నివేదికలు మాత్రమే వచ్చాయని విమర్శించారు. ఈ నివేదికలను ప్రచురించడంలో సమతుల్యం, సమానత్వం పాటించాలని కోరారు. ప్రజాపథకాల అమలులో లోటుపాట్ల పట్ల బాధ్యత వహించాలని కోరారు. ఆడిట్ చేయడం ఆలస్యమైతే న్యాయం చేయడం కూడా ఆలస్యమైపోతుందని హెచ్చరించారు.

మందబలంతో మాట్లాడొద్దు

అమిత్ షా ‘సర్’, ఇవిఎంల వ్యాఖ్యలపై సిపిఐ మండిపాటు



న్యూఢిల్లీ : ఎస్ఐఆర్, ఇవిఎంలు, సంబంధిత అంశాలపై ప్రత్యేక పార్లమెంటరీ సమావేశం నిర్వహించాలని ప్రతిపక్షాలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా సవాలు విసరడంపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా తీవ్రస్థాయిలో స్పందించారు. ‘పార్లమెంటులో తమకు సంఖ్యాబలం ఉందని అమిత్ షా భావిస్తున్నారని, ఇది ఒక తీవ్రమైన ప్రజా సమస్యగా మారిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజలు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) రాజీనామా డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారని, ప్రభుత్వ పాత్రను, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రభుత్వం ఎలా చూస్తోందనే విషయాన్ని కూడా వారు ప్రశ్నిస్తున్నారన్నారు. ఎన్నికల సంఘం ఒక నిష్పక్షపాత, తటస్థ సంస్థగా ఉండాలని, 18 ఏళ్లు పైబడిన పౌరులందరి ఓటు హక్కును తప్పనిసరిగా నిర్ధారించాలని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా చూడాలి, కానీ ఇప్పుడు అది జరుగుతోందా? దీనికి ప్రధాన ఎన్నికల కమిషనర్ కాకపోతే మరెవరు జవాబుదారీగా ఉండాలి? దీనికి హోం మంత్రి అమిత్ షా వద్ద సమాధానం లేదు అని అన్నారు.

తెలంగాణ కరువుపై అమిత్ షా

మాట్లాడకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యం

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలంగాణ రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న కరువు, తాగు, సాగునీటి కష్టాలపైన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం అత్యంత బాధ్యతారాహిత్యమని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజుశ్రవణ్ దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రానికి రూ. 20వేల కోట్లు ఇవ్వాలని సాక్షాత్తు శాసనసభ కోరినప్పటికీ కేంద్రం నుంచి రూపాయి అయినా ఇస్తామని అమిత్ షా ప్రకటించారా? అని నిలదీశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ‘ఆర్ఆర్ టాక్స్’ అని ఆరోపించడం తప్ప, వీటిపైన సిబిఐ, ఇడి, ఐటి సంస్థలతో విచారణ ఎందుకు జరిపించడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీకి చార్టర్డ్ ఫ్లైట్లలో సంచులు పోతుంటే ‘మీరు’ చూస్తూ ఊరుకుంటారా? అని అన్నారు. ఢిల్లీకి పోయి రాజకీయ ధర్నాలు చేయడానికి సిఎం రేవంత్ రెడ్డికి సమయం ఉంటుందని, కానీ, కేంద్ర వ్యవసాయ/హోం మంత్రులను కలిసి రూ. 20వేల కోట్ల కరువు ప్యాకేజీ సాధించేందుకు మనసు రావడం లేదా అని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి తక్షణమే రూ. 20వేల కోట్ల కరువు సాయం ప్రకటించాలన్నారు. కన్నెపల్లి వద్ద తక్షణమే రబ్బర్ డ్యామ్ నిర్మించి, ఆ నీటిని ఎత్తిపోసి రైతులకు సాగు, ప్రజలకు తాగునీటి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెంగాణ రాష్ట్రం తీవ్ర కరువు కాటకాలతో, భూగర్భ జలాలు పడిపోయి రైతాంగం, ప్రజలు అల్లాడుతుంటే కాంగ్రెస్, బిజెపిలు మాత్రం బాధ్యతారాహితంగా వ్యవహరిస్తూ, రాజకీయ విన్యాసాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఫిబ్రవరి, మార్చి నెలలోనే మెటీరియాలజీ డిపార్ట్‌మెంట్ ఎల్ నినో కరువు రాబోతుందని హెచ్చరించినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం సమాయత్తం కాలేదని, పక్క రాష్ట్రం కంటే దారుణమైన పరిస్థితుల్లోకి తెలంగాణ రాష్ట్రాన్ని నెట్టివేశారని ఆరోపించారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు పాల్వాయి స్రవంతి రెడ్డి, తొట్ల స్వామి యాదవ్, కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్టం చెల్లుబాటుపై సుప్రీం విచారణ జనవరి 21కి వాయిదా

న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్(సవరణ) చట్టం–2025 చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు 2027 జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది. ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ నాటికి ఈ కేసులో వివిధ పార్టీల వాదనలన్నీ పూర్తిచేయాలని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ పి.బి.వరలేలతో కూడిన ధర్మాసనం కోరింది. మధ్యంతరంగా కొందరు పిటిషన్లు వేశారు. వీటిని మధ్యంతర దరఖాస్తులుగా పరిగణించారు. ఇలాంటివారంతా అక్టోబరు మూడో తేదీ నుండి రెండు వారాలలోపు తమ రిట్ పిటిషన్లు దాఖలు చేయాలని, నోడల్ కౌన్సిల్‌కు ఆ ప్రతిని ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది. అదనపు సొలిసిటర్ జనరల్ కూడా ఈ రిట్ పిటిషన్లకు తమ సమాధానాలను ఇవ్వాలని కోరింది. మొదట ఈ కేసులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిల్లో ఐదు పిటిషన్లు ప్రధాన పిటిషన్లుగా, మరో 135 పిటిషన్లను మధ్యంతర పిటిషన్లుగా గుర్తించి నట్లు నోడల్ కౌన్సిల్ కోర్టుకు తెలియజేశారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు పనిభారం పెరిగిపోయినందువల్ల కేవలం ఐదు పిటిషన్లను మాత్రమే ప్రధాన పిటిషన్లుగా పరిగణించాలని న్యాయస్థానం 2025 ఏప్రిల్ 17వ తేదీన ఉత్తర్వు ఇచ్చింది. ఈ విషయాన్ని కూడా నోడల్ కౌన్సిల్ గుర్తుచేసింది. ఈ సవరణ చట్టంలో ఉన్న కొన్ని కీలకమైన అంశాలను అమలులో లేకుండా సుప్రీంకోర్టు గత ఏడాది సెప్టెంబరు 15వ తేదీన స్తంభింపజేసింది. ఇందులో ప్రధానంగా ఒక వ్యక్తి ఐదు సంవ్సరాలుగా ఇస్లాం ఆచరించినప్పుడే వక్ఫ్ ఆస్తిని సృష్టించగలరని పేర్కొన్న సవరణను కోర్టు స్తంభింపజేసింది. ఈ విషయంలో రాష్ట్రాలు సదరు వ్యక్తి ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను ఆచరిస్తున్నాడా? లేదా? అని నిర్ధారించడంకోసం కొన్ని నిబంధనలు ఏర్పాటు చేయడానికి ఒక యంత్రాంగాన్ని సమకూర్చేదాకా ఈ సవరణ చట్టంలోని సెక్షన్ 3లోని క్లాజ్(ఆర్)పై స్టే విధించింది.

అమిత్‌షా పర్యటనలో రాష్ట్ర సమస్యలపై స్పందనేది?


కరువు సాయం, పెండింగ్ ప్రాజెక్టులు, విభజన హామీలపై ప్రకటన ఏదీ : జాన్‌వెస్లీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నా, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టులపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కనీసం స్పందించకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. రాష్ట్రానికి రూ.50 వేల కోట్ల కరువు సాయం అందించాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా, హైదరాబాద్ మెట్రో విస్తరణపై ఎలాంటి ప్రకటన చేయకుండా రాజకీయ విమర్శలకే పరిమితం కావడాన్ని తప్పు బట్టారు.హైదరాబాద్ పర్యటనలో భాగ్యలక్ష్మి ఆలయ సందర్శన, భావోద్వేగ అంశాలు, కాంగ్రెస్‌పై విమర్శలకే అమిత్‌షా ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. సంగారెడ్డి–మేడ్చల్ వరకు మెట్రో విస్తరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, కేంద్ర నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించింది. మైనారిటీలు, దళితులపై దాడులు, మణిపూర్ హింసను అరికట్టడంలో కేంద్ర హోంశాఖ విఫలమైందని విమర్శించింది. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే వారిపై చర్యలు తీసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

‘సర్’ ముసాయిదా లిస్ట్‌లో పేరు లేకుంటే

మళ్లీ ఫారం- 6 ఇవ్వొచ్చు

ఓటర్ల ఆందోళనలపై ఎన్నికల సంఘం స్పష్టీకరణ



న్యూఢిల్లీ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ముసాయిదా లిస్టులో పేర్లు కనిపించని ఓటర్ల ఆందోళనలపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. గతంలో ఓటు హక్కు ఉండి, ప్రస్తుత ముసాయిదా జాబితాలో పేర్లు లేని పౌరులు ఓటర్ల జాబితాలో తమ పేరును తిరిగి చేర్చుకోవడానికి నిరభ్యంతరంగా ఫారం–6 సమర్పించవచ్చని స్పష్టం చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఓటు హక్కును కోల్పోయిన వారిలో ఇటీవల కొన్ని భయాలు నెలకొన్నాయి. ఎందుకంటే మళ్లీ కొత్తగా నమోదు చేసుకునేటప్పుడు వాడే ఫారం –6 లో 'నేను మొదటిసారి ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకుంటున్నాను’ అనే ఒక డిక్లరేషన్ ఉంటుంది. అందుకే ఇప్పటికే ఓటు హక్కు ఉండి, సర్ జాబితా నుంచి తొలగింపునకు గురైన వారు ఈ ఫారం సమర్పిస్తే అది చట్ట ప్రకారం తప్పుడు ప్రకటన చేసినట్లు అవుతుందని, దానివల్ల ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద తమపై క్రిమినల్ చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఓటర్లు ఆందోళన చెందారు. ఇలా ఓటర్లలో నెలకొన్న సందేహాలు, ఆందోళనల నేపథ్యంలోనే ఎన్నికల సంఘం దీనిపై క్లారిటీ ఇచ్చింది. ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం ఒక లేఖ రాసింది. సర్‌లో భాగంగా ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని పౌరులు డిక్లరేషన్ కారణంగా ఫారం6 సమర్పించడానికి వెనుకాడుతున్న విషయం తమ దృష్టికి వచ్చినట్లు తెలిపింది. అలాంటి ఓటర్లు ఎవరూ భయపడాల్సిన పని లేదని, వారంతా నిరభ్యంతరంగా తమ పేరును మళ్లీ చేర్చుకోవడం కోసం ఫారం –6 సమర్పించవచ్చని ఈసీ స్పష్టం చేసింది.

అలా చర్యలు తీసుకోలేరు!

ఫారం– 6 ఇచ్చినంత మాత్రాన తప్పుడు ప్రకటన చేసినట్లు పరిగణించరాదని, ఈ కారణంతోనే వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోలేరని వెల్లడించింది. అయితే సంబంధిత ఓటరు ఇప్పటికే మరో చోట ఓటరుగా నమోదై ఉండటం లేదా చట్టవిరుద్ధమైన, తప్పుడు హామీ పత్రం ఇవ్వడం వంటి సందర్భాల్లో చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ‘గతంలో ఓటు హక్కు ఉండి, ఎస్ఐఆర్ ముసాయిదా జాబితాలో పేరు లేని ఓటర్లు ఫారం 6 ఇవ్వడాన్ని నేరంగా పరిగణించలేం. ఈ కారణంతో మాత్రమే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950లోని సెక్షన్ 31 కింద ఎలాంటి చట్టపరమైన చర్యలు ప్రారంభించడానికి వీల్లేదు అని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది.

ఇసి వివరణ ఒక మాటల గారడీ : కాంగ్రెస్ ఎద్దేవా

ఓటర్ల నమోదుకు సంబంధించి ఫారం –6 పై కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన తాజా వివరణ కేవలం మాటల గారడీ మాత్రమేనని, దీనివల్ల ఓటర్లకు ఎలాంటి స్పష్టత రాలేదని కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేసింది. సర్ ప్రక్రియలో ఉన్న లోపాలను సరిదిద్దడానికి, ఇప్పటివరకు జరిగిన నష్టాన్ని పూడ్చడానికి ఈసీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని, అసలు ఈ ప్రక్రియే ఓటర్ల జాబితా నుంచి తొలగించేలా రూపొందించారని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జి జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ విమర్శించారు. ఇసి వివరణపై స్పందించిన ఆయన, ‘ఫారం –6 లో మొదటిసారిగా ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవాలని దరఖాస్తు చేస్తున్నారా?’ అనే ప్రశ్న స్పష్టంగా ఉంటుందని అన్నారు. ‘సర్’ సమయంలో తిరిగి పేరు చేర్చుకోవాలనుకునే వారిని కూడా తొలిసారి దరఖాస్తు చేసుకుంటున్నవారిగా పరిగణించవచ్చని ఇసి చెప్పడం మరో రకమైన మాటల గారడీ అని విమర్శలు చేశారు.

నీటి సంపులో పడి ఆటోడ్రైవర్ మృతి

● మృతిపై కుటుంబ సభ్యుల అనుమానం

ప్రజాపక్షం/చందంపేట : నల్గొండ జిల్లా చందంపేట మండలం పోల్యానాయక్ తండాకు చెందిన రమావత్ మోహన్(28) నీటి సంపులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవంబర్ 02 రాత్రి మోహన్ తన భార్యతో గొడవ పడి ఇంటి ముందున్న నీటి సంపు వద్దకు వెళ్ళి ప్రమాదవశాత్తు అందులో పడిపోగా అది చూసిన మోహన్ భార్య కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వచ్చి నీటి సంపులో పడిన మోహన్‌ను బయటకు తీయగా అప్పటికే మోహన్ మృతి చెందాడు. మోహన్ మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తూ సమగ్ర విచారణ జరపాలని మోహన్ తల్లి రమావత్ సోనాలి ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చందంపేట ఎస్ఐ లోకేష్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యువతలో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి

● నవ చేతన సంచార పుస్తక ప్రదర్శనను సందర్శించి పుస్తకాలు కొనుగోలు చేసిన తీన్మార్ మల్లన్న



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : నల్లగొండ జిల్లా కేంద్రంలో గత ఆరు రోజులుగా కొనసాగుతున్న నవ చేతన సంచార పుస్తక ప్రదర్శన, విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలను పరిశీలించి, పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. మొబైల్ వ్యాన్ ద్వారా పాఠకులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ఆయన అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పుస్తకాలు విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు సమాజం పట్ల అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు.

ఓటు నమోదు పూర్తి చేయాలి



● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/మిర్యాలగూడ: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకుని పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి మూడు రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని సర్పంచులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఓటరు నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షకు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, డిసిసి అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత వీడియో కాల్ ద్వారా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. అలాగే ఈ నెల 6న మిర్యాలగూడ నియోజకవర్గంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంచినీరు, పారిశుద్ధ్య నిర్వహణ భేష్



● స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : జిల్లాలో ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించేందుకు చేపడుతున్న నీటి శుద్ధి ప్రక్రియలు, నీటి నాణ్యత పరీక్షల నిర్వహణ పట్ల జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ అనిమేష్ భట్టాచార్య సంతృప్తి వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన పానగల్ ప్రాంతంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని, జిల్లా నీటి నాణ్యత ప్రయోగశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రయోగశాలలో నిర్వహిస్తున్న రసాయనిక, మైక్రోబయోలాజికల్ పరీక్షల వివరాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సేకరించిన నీటి నమూనాల పరీక్షా నివేదికలను తనిఖీ చేశారు. ప్రయోగశాలలో పరీక్షలు నిర్వహిస్తున్న విధానం, నాణ్యత ప్రమాణాల అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పానగల్‌లోని ఉదయసముద్రం వద్ద ఉన్న మిషన్ భగీరథ ఇంటేక్ వెల్, 35 ఎంఎల్డీ నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట మిషన్ భగీరథ ఎస్ఈ నాగేశ్వర రావు, ఈఈ శాంతకుమారి, ఏఈఈ సంతోష్, ప్రయోగశాల ఇంచార్జీ పి.వీరారెడ్డి, బి.సుజాత, ఎస్.రేణుక, ప్రశాంతి, సత్యనారాయణ ఉన్నారు.

ఎంజియు హాస్టల్స్ డైరెక్టర్‌గా లక్ష్మీప్రభ

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం వసతి గృహాల సంచాలకురాలిగా మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ జి.లక్ష్మీప్రభను నియమిస్తూ మంగళవారం రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ నియామక ఉత్తర్వులను అందజేశారు.సౌమ్యురాలుగా, నిజాయతీపరురాలిగా, సమర్థవంతమైన అధికారిణిగా మంచి పేరున్న లక్ష్మీప్రభ ప్రస్తుతం పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్‌గా సేవలందిస్తున్నారు. ఆమె నియామకం పట్ల సహాధ్యాపకులు, అధికారులు అభినందనలు తెలిపారు.

సూర్యాపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి

● 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా

● సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పిలుపు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవనంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యవర్గ సమావేశం ఎల్లావుల రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సూర్యాపేట జిల్లాను కరువు జిల్లాగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కొన్ని మండలాలనే ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని కానీ జిల్లాలో ఉన్న అన్ని మండలాలతోపాటు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ నవంబర్ 10న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏర్పడ్డ వర్షాభావ పరిస్థితుల వల్ల రైతాంగం, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటలు చేతికొచ్చే సమయానికే తుఫాను వల్ల పంట చేతికి రాకుండా రైతులకు నష్టం కలిగించేలా ఉందన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి కరువు జిల్లాలకు నిధులను తక్షణం అందించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతాంగానికి ఎకరానికి వరికి రూ.30వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. రాబోయే రోజుల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు పని దినాలుగా పెంచి రోజుకు కూలీ రూ.600 చొప్పున పెంచి పనులు కల్పించాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 90 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలన్నారు. కృత్రిమ బ్లాక్ మార్కెట్‌ను ఉక్కుపాదంతో అరికట్టి బియ్యం ధరలను అదుపులో ఉంచాలని తెలిపారు. పశు సామాగ్రిని సరఫరా చేయాలని, రైతులకు ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలని, రైతు రుణమాఫీ చేయాలని రైతులకు అన్ని విధాల ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉస్తెల నారాయణ రెడ్డి, ధూళిపాల ధనుంజయ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాస్ రావు, మండవ వెంకటేశ్వర్లు, ఎల్లంల యాదగిరి, కంబాల శ్రీనివాస్, ఎస్‌కె లత్తు, బద్దం కృష్ణారెడ్డి, హనుమంతరావు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, ఎస్‌కె సాయిబెల్లి పాల్గొన్నారు.





ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

● ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : మురసు తుఫాన్ ప్రభావంతో రాబోయే కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కార్యాలయంలో తుఫాన్ ప్రభావంతో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్లలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అధికారుల సూచనలను అనుసరించాలని విజ్ఞప్తి చేశారు. అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, డిపిఓ యాదగిరి, డిఎస్ఓ మోహన్‌బాబు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో 30కిపైగా మరణాలు

● మరణాలపై ప్రజల్లో తీవ్ర చర్చ

● సహజ, అనారోగ్యం, రోడ్డు ప్రమాదాలలో పలువురి మృతి

● ప్రజలకు అధికారులు భరోసా కల్పించాలి

ప్రజాపక్షం/చిట్యాల : నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో గత మూడు నెలల కాలంలో 30కిపైగా మరణాలు సంభవించాయనే విషయం పట్టణ ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సహజ మరణాలు, అనారోగ్య కారణాలతో సంభవించిన మరణాలు, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఇలా వివిధ కారణాలతో వరుస మరణాలు జరుగుతుండటం పట్టణ వాసులను ఆలోచనలో పడేస్తోంది. మరణాలన్నింటికీ ఒకే కారణం లేకపోయినప్పటికీ, తక్కువ వ్యవధిలో ఇన్ని మరణాలు చోటు చేసుకోవడం పట్ల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నలుగురు కూడిన దగ్గర మరణాలపైనే పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రజల ఆరోగ్యం, భద్రత, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై మునిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, పట్టణ ప్రముఖులు, పురోహితులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు ఒక చోట సమావేశమై చర్చించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో తాగునీటి నాణ్యత, పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, దోమల నివారణ వంటి అంశాలపై ప్రత్యేక పరిశీలన చేపట్టడంతో పాటు ప్రజలకు అవసరమైన వైద్య అవగాహన, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని సూచిస్తున్నారు. అదేవిధంగా రోడ్డు పనులు జరుగుతన్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదకర ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల విశ్వాసాలు, సంప్రదాయలకు అనుగుణంగా బొడ్రాయి పండుగ, శాంతి హోమాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణపై కూడా పట్టణ ప్రజలు చర్చించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించి, వారికి భరోసా కల్పించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు రావాలని పట్టణ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరణాలకు కారణాలు వేరైనా ప్రజల ఆరో గ్యం, భద్రత మాత్రం అందరి బాధ్యత. పట్టణ ప్రజల శ్రేయస్సు కోసం ఇప్పటికైనా సమిష్టి కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని ప్రజలు కోరుతున్నారు.



గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యం



● మంత్రి సీతక్క

ప్రజాపక్షం/బీబీనగర్: గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) ఎయిమ్స్ డాక్టర్లను కోరారు. మంత్రి మంగళవారం బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ అమితా అగర్వాల్, డీన్లు మరియు సీనియర్ ప్రొఫెసర్లతో కలిసి మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎంఈయూ హాల్లో నిర్వహించిన వాటాదారుల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సమావేశంలో డీన్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ నారంగ్, ఎస్ఎస్‌టియు విసి ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ పాల్గొని ములుగు, ఐటిడిఎ ఏటూరునాగారంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల అజెండాను వివరించారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ మీలీ పాండా తెలంగాణలోని గిరిజన సంక్షేమం కోసం చేపట్టిన హెల్త్ క్యాంపులు, పరిశోధనలు, టెలిమెడిసిన్, కెరీర్ కౌన్సెలింగ్, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఎయిమ్స్ డాక్టర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, ములుగు జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును, బీబీనగర్ ఎయిమ్స్ డాక్టర్ల బృందాన్ని అభినందించారు. హెల్త్ క్యాంప్ వాలంటీర్లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యమైన వైద్యం అందుబాటులో లేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ ఆదివాసీ మహిళగా, న్యాయవాదిగా, ఎమ్మెల్యేగా అనేక సవాళ్లను ఎదుర్కొని క్యాబినెట్ మంత్రిగా ఎదిగిన తన వ్యక్తిగత జీవిత ప్రయాణాన్ని సితక్క ఈ సందర్భంగా పంచుకున్నారు. ములుగు జిల్లాలో చేపట్టిన ఆరోగ్య కార్యక్రమాలపై రూపొందించిన అడ్వాన్డ్ హెల్త్‌కేర్ సిస్టమ్ ఇన్ ములుగు మ్యాగజైన్‌తో పాటు 'కాంప్రిహెన్సివ్ ట్రైబల్ హెల్త్ యాక్షన్ ప్లాన్, ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియోలను మంత్రి విడుదల చేశారు. ములుగుతో పాటు ఇతర వెనుకబడిన గిరిజన ప్రాంతాలలో మరిన్ని హెల్త్ క్యాంప్లు నిర్వహించాలని, గిరిజన మహిళలకు నాణ్యమైన, ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఎయిమ్స్ యాజమాన్యాన్ని కోరారు.

గిరిజనులకు నిరంతర సేవలు అందించేందుకు ఎయిమ్స్ బీబీనగర్ భాగస్వామ్యంతో ములుగు జిల్లాలో ఒక శాటిలైట్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎస్‌టియు విసి ప్రతిపాదించారు. సరైన సమయంలో నాణ్యమైన వైద్యం అందక ఏ ఒక్క మహిళగానీ, చిన్నారిగానీ ప్రాణాలు కోల్పోకూడదని ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ నారంగ్ ఆకాంక్షించారు. నాణ్యమైన వైద్యం ప్రతీ పల్లెకు, గిరిజన గ్రామానికి చేరడానికి ప్రభుత్వ శాఖలు, వైద్య సంస్థలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

యాదగిరిగుట్ట మొక్కు వస్త్రాల సేకరణకు కొత్త టెండర్

● అక్రమాలపై సమగ్ర విచారణకు భక్తుల డిమాండ్


ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో భక్తులు సమర్పించే మొక్కు వస్త్రాల సేకరణ హక్కుల కేటాయింపు ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. వేలం ప్రక్రియలో పారదర్శకతను పెంపొందించడం, దేవస్థాన ఆదాయాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా కొత్తగా 'టెండర్ కమ్ బహిరంగ వేలం' నిర్వహించాలని ఈఓ జే. భవానీశంకర్ నిర్ణయించారు. ఈ మేరకు ప్రొసీడింగ్స్ నం. టీ/108/2025 ద్వారా ఆయన ఉత్తర్వులు జారీ చేశారు.

గతంలో 2025 ఫిబ్రవరి 6న నిర్వహించిన వేలంలో డి. నాగరాజుకు లభించిన లైసెన్స్ గడువు 2026 మార్చి 31తో ముగియాల్సి ఉండగా, దేవాదాయ శాఖ కమిషనర్ దానిని 2028 మార్చి 31 వరకు పొడిగించారు. అయితే కొత్త టెండర్ నోటిఫికేషన్ జారీ చేయాలని కోరుతూ అన్నదాస్ వెంకటేష్ దాఖలు చేసిన పిటిషన్ (డబ్ల్యు పి నెం.31484/2026)పై విచారణ జరిపిన హైకోర్టు.. వినతులను చట్టప్రకారం పరిశీలించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో, సెప్టెంబర్ 23న కమిషనర్ పాత పొడిగింపు ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. దీనికి ప్రభుత్వ ఆమోదం లభించడంతో, మునుపటి లైసెన్స్ గడువు 2026 మార్చి 31తో ముగిసిందని ఈఓ స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సులు పొడిగించిన వ్యవహారం న్యాయపోరాటంతో వెలుగులోకి రావడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయంలో గతంలో జరిగిన ఇతర టెండర్లు, లైసెన్స్ పొడిగింపులు, కాంట్రాక్టులపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు మరియు విజిలెన్స్ శాఖతో సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను విస్తరించాలి

● కలెక్టర్ చంద్రశేఖర్

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : దేశ నవనిర్మాణంలో నైపుణ్యం కలిగిన యువత కీలకపాత్ర పోషిస్తారని, విద్యార్థుల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని ఐటీ టవర్‌ను ఆకస్మికంగా సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను, కంపెనీల పనితీరును పరిశీలించారు. తొలుత భవనంలోని పీఎం విశ్వకర్మ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, ఇప్పటివరకు ఎంతమందికి శిక్షణ అందించారు? ప్రస్తుతం ఎంతమంది శిక్షణ పొందుతున్నారని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు సుమారు 500 మందికి శిక్షణ అందించినట్లు నిర్వాహకులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం, నాగార్జున కళాశాల, ఇతర డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులకు పెద్ద సంఖ్యలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించాలని చెప్పారు. విద్యార్థులకు ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి, ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు పొందేలా ప్రోత్సహించాలన్నారు. ఐటీ టవర్ మేనేజర్ ఎన్.ప్రకాశ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఎన్.ప్రకాశం, ఇతర కంపెనీ అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



రెడ్‌క్రాస్ కమిటీలతో విద్యార్థుల్లో సేవాభావం



● కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి : పాఠశాలలు, కళాశాలల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతలో సేవా భావం, సామాజిక బాధ్యత, మానవతా విలువలను పెంపొందించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే యువతను సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలన్నారు. గ్రామాలు, విద్యాసంస్థల్లో రెడ్ క్రాస్ సేవలను విస్తరించేందుకు దివీస్ సంస్థ సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే, ఎల్ నినో ప్రభావాలపై విద్యార్థులు, యువత, మహిళలతో పాటు ప్రజలందరికీ అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రూపొందించిన ఎల్ నినో అవగాహన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణం, భవిష్యత్ సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి బి.సురేష్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ సద్ది వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ, ట్రెజరర్ ఎం.ఏ.రహీం, స్టేట్ కమిటీ సభ్యులు డాక్టర్ జి.లక్ష్మీ నరసింహారెడ్డి, వివిధ సంక్షేమశాఖల అధికారులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం



ప్రజాపక్షం/రామన్నపేట : రైతులు కష్టపడి పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేస్తుందని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశించారు. మంగళవారం రామన్నపేట మండలంలోని సర్నేనిగూడెం, భోగారం గ్రామాల్లో పిఏసిఎస్ ఆధ్వర్యంలో, అలాగే వెల్లంకి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు శ్రేయస్సే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా జరగాలని అధికారులను కోరారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీరు, నీడ, తార్పాలిన్‌లు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని, కాంటా వేసే ప్రక్రియలో ఆలస్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపిడిఓ ఆవుల రాములు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, మండల అధ్యక్షుడు పున్న జగన్మోహన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ తిమ్మాపురం మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు గుత్తా నర్సిరెడ్డి, పూస బాల నరసింహ, శంభాల గంజి నరసింహ, గంజి భాస్కర్, కనుతాల భాస్కర్ రెడ్డి, గోగు హరి ప్రసాద్ యాదవ్, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అదనపు బస్సులు ఏర్పాటు చేయండి

● మంత్రిని కోరిన ఎమ్మెల్యే కుంభం

ప్రజాపక్షం/భువనగిరి రూరల్: తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి భువనగిరి, వలిగొండ బస్టాండ్లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని, ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గంలో అదనపు బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. నియోజకవర్గంలో ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచి, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వ్యవసాయ మార్కెట్ యార్డుకు సెలవు

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : మురసు తుఫాన్ కారణంగా భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపినందున నేడు (బుధవారం) సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డునకు సెలవు ప్రకటించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తరలించకుండా మీ ఇండ్ల వద్దనే భద్రపర్చుకోవాలని కోరారు. కమీషన్‌దారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా కమీషన్‌దారులు ఉద్దేశపూర్వకంగా సరుకులు తెప్పించి మార్కెట్ కమిటీ కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తే వారి పేర్లను ఈనామ్ నుండి తొలగించడంతోపాటు క్రమశిక్షణ చర్యలు తీసుకోబడుతాయని సూచించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
04-11-2026
www.prajapaksham.in

ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీకర్ నయన్ రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

రీక

అవెంజర్స్: డూమ్స్‌డే' నుంచి డాక్టర్ డూమ్ పోస్టర్ విడుదల



మార్వెల్ స్టూడియోస్ తెరకెక్కిస్తున్న చిత్రం 'అవెంజర్స్: డూమ్స్‌డే' పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమా నుంచి 5 కొత్త పోస్టర్లను చిత్ర బృందం విడుదల చేసింది. ఈ పోస్టర్లలో మార్వెల్ సినీ విశ్వంలోని అత్యంత శక్తివంత మైన ప్రతి నాయకుల్లో ఒకరైన డాక్టర్ డూమ్‌ను ప్రధానంగా చూపించారు. భారీ తారాగణం, అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరిత మైన కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. మార్వెల్ సినిమాల అభిమానులు ఎంతగానో ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నార్నయి చెప్పవచ్చు. ఈ చిత్రం డిసెంబర్ 17న భారతదేశంలోని థియేటర్లలో విడుదల కానుంది. ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. 4డి ఎక్స్ , రియల్ డి , 3డి, స్క్రీన్ ఎక్స్, డాల్బీ, ఇన్సినిటీ విజన్ వంటి ప్రీమియం ఫార్మాట్లలోనూ ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

జయసుధ సీన్స్ కన్నీళ్లు పెట్టిస్తాయి

'సమ్మర్ హాలిడేస్' డైరెక్టర్ శ్రీకర్ నయన్



ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని నిర్మిస్తున్నారు. దర్శకుడు శ్రీకర్ నయన్ రూపొందిస్తున్నా రు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 6న 'సమ్మర్ హాలిడేస్' థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ డైరెక్టర్ శ్రీకర్ నయన్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మాది విశాఖ. కాలేజ్ డేస్ లోనే షార్ట్ ఫిలిం రూపొందించాను. అలా స్క్రిప్ట్, షార్ట్ ఫిలింస్ మేకింగ్ మీద ఆసక్తి పెరిగింది. మధుర శ్రీధర్ రెడ్డి ద్వారా ధీరజ్ మొగిలినేనిని కలిశాను. ధీరజ్ కు సమ్మర్ హాలీడేస్ కథ నచ్చి అవకాశం ఇచ్చారు. ఫస్ట్ మా సినిమాకు అనుకున్న టైటిల్ సమ్మర్ ఫ్రెండ్ రెండు వేర్వేరు ప్రపంచాలు ఉన్న ఇద్దరు పిల్లలు సమ్మర్‌లో స్నేహితులు అయితే ఎలా ఉంటుందనే పాయింట్ మీద ఈ కథను రెడీ చేశాను. మనం అమ్మమ్మ ఊరికి సమ్మర్‌లో వెళ్లినప్పుడు ఎన్నో మెమొరీస్ ఉంటాయి. క్రికెట్ ఆడటం, తాటి ముంజలు తినడం, అమ్మమ్మ చెప్పే కబుర్లు వినడం, ఊరిలో కొత్త స్నేహాలు..ఇలాంటివి మనందరి జీవితాల్లో చూసి ఉంటాం. అవే ఈ కథకు స్ఫూర్తి. నా జీవితంలో జరిగిన ఘటనలు స్ఫూర్తి అని చెప్పలేను. మాది పిల్లల సినిమా కాదు పిల్లలు నటించిన పెద్దల సినిమా. ఔట్ అండ్ ఔట్ ఎంటర్ టైనర్. మా సినిమాను థియేటర్‌లో చూసి ఎక్సిపీరియన్స్ చేయాలి. అరుణ్ అమ్మమ్మ పాత్రలో జయసుధ నటించారు. ఆమెకు మా కుటుంబమంతా అభిమానులం. ఆమె అమ్మమ్మ పాత్ర అనగానే మొదటి సీన్ లోనే ప్రేక్షకులు ఓన్ చేసుకుంటారు. 'అరుణ్, జయసుధ మధ్య వచ్చే సీన్స్ కన్నీళ్లు పెట్టిస్తాయి'. ఆ సీన్స్ అన్నీ ప్రేక్షకులు హార్ట్ టచింగ్‌గా ఫీలవుతారు. వాసుకిది మంచి ఇంపార్టెంట్ రోల్. నేను ఈ కథ రాసినప్పుడు వాసుకిని పాత్ర కోసం అనుకున్నాను. అలాంటి మంచి యాక్ట్రెస్‌కు కీలకమైన పాత్రే ఇవ్వాలని అనిపించింది. మా మూవీలోని మెసేజ్, క్లైమాక్స్‌లో స్ట్రాంగ్ డైలాగ్స్ కూడా ఆమెకే ఉంటాయి. హర్షిణి, రాజీవ్ కనకాల, హర్షవర్ధన్ ఇలా ప్రతి ఒక్కరికీ మంచి రోల్స్ ఉన్నాయి. వాళ్ల పర్ ఫార్మెన్స్ అందరినీ ఆకట్టుకుంటుంది. సమ్మర్ హాలిడేస్ సినిమా సమ్మర్ కు రిలీజై ఉంటే చాలా బాగుండేది. కానీ మాకు సమ్మర్ స్లాట్ దొరకలేదు. జులైలో రిలీజ్‌కు వద్దామని అనుకున్నా అప్పుడు చెన్నై లవ్ స్టోరీ రిలీజ్ ఉంది కాబట్టి ధీరజ్ వెయిట్ చేద్దామన్నారు. అలా డేట్ మారుతూ ఈ నెల 6న రిలీజ్ కుదిరింది.



ఒక డైలాగ్ ఉంది మీ జీవితంలో ఉపయోగపడుతుంది

'సీన్' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో హీరో సూర్య

హీరో సూర్య, మల యాళ బ్లాక్‌బస్టర్ 'ఆవేశం' ఫేమ్ దర్శకుడు జిత్తు మాధవన్‌తో కలసి యాక్షన్‌కామెడీ ఎంటర్‌టైనర్ 'సీన్' చేస్తున్నారు. నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నస్లేన్, అనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జ్యోతిక, సూర్య అగరం స్టూడియోస్, 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ల పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషన్ కంటెంట్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణలో ఎన్‌వీఆర్ సినిమా ద్వారా గ్రాండ్ రిలీజ్ కానుంది. 'సీన్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా 6న దీపావళి కానుకగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఘనంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హీరో సూర్య మాట్లాడుతూ మేమం దరం కలిసి ఒక బ్యూటిఫుల్ సినిమాను అందిస్తున్నాం. రాకేందు మౌళి తెలుగులో చాలా చక్కని మాటలు, పాటలు రాశారు. చాలా కమిట్‌మెంట్‌తో పనిచేశారు. ఈ సినిమాలో చాలా ఫ్రెష్ టాలెంట్ కూడా ఉంది. నజ్రియాతో కలిసి పనిచేయడం చాలా హ్యాపీగా అనిపించింది. ఈ సినిమాలో తను స్టంట్స్ కూడా చేసింది. ఇది చాలా స్పెషల్ ఫిల్మ్. ఇందులో ఒక డైలాగ్ ఉంది. అది నిజంగా మీ జీవితంలో కూడా ఉపయోగపడుతుంది. మనపై మనం నమ్మకం ఉంచి ప్రయత్నిస్తే ఏదైనా సాధించవచ్చు. కుటుంబ సభ్యులందరూ కలిసి వచ్చి ఈ సినిమాను చూడొచ్చు అని అన్నారు. హీరోయిన్ నజ్రియా నజీమ్, డైరెక్టర్ వెంకీ అట్లూరి, లిరిక్ రైటర్ రాకేందు మౌళి, ప్రొడ్యూసర్ జయశ్రీ దామోదరన్, నిర్మాత ఎన్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

20న వస్తున్న 'డానీ'



రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ బ్యానర్‌ల మీద రిజ్వాన్ నిర్మాణంలో కళ్యాణ్‌జీ గోగణ తెరకెక్కించి చిత్రం 'డానీ'. ఈ మూవీలో ఆశిష్ గాంధీ, సేజల్ గుప్తా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ మూవీని 20న విడుదల చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రిలీజ్ ప్రకటించారు.
హీరో ఆశిష్ గాంధీ మాట్లాడుతూ ''కళ్యాణ్, నేను, రిజ్వాన్ కలిసి 'నాటకం' చేశాము. మళ్లీ ఇప్పుడు 'డానీ'తో కలిశాం. ఇదొక కల్ట్ వైల్డ్ డ్రామా. ఇందులో రాకేందు పాటలు, సాయి కార్తీక్ మ్యూజిక్ గొప్పగా ఉంటుంది. ఆనంద్ అన్న అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. దర్శకుడు కళ్యాణ్‌జీ గోగణ మాట్లాడుతూ 'నిర్మాత రిజ్వాన్, ఆశిష్, నేను కలిసి 'నాటకం' చేశాం. ఆశిష్ కెమెరా ముందు ఉంటే నాకు కూడా కాన్ఫిడెన్స్ వస్తుంది. రిజ్వాన్ తో నాకు ఎంతో కంఫర్ట్‌గా అనిపిస్తుంది. ఇలాంటి ఓ డిఫరెంట్ లవ్, రస్టిక్ డ్రామాకి రిజ్వాన్ లాంటి నిర్మాత అయితేనే న్యాయం చేస్తారని అనిపించింది అని అన్నారు. నిర్మాత రిజ్వాన్ మాట్లాడుతూ నవంబర్ 20న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. రాకేందు మౌళి, ఎకె ఆనంద్ , కె మ్యూజిక్ ప్రతినిధి ప్రియాంక, నటి సేజల్ గుప్తా, నటుడు అజర్ ఖాన్ పాల్గొన్నారు.

చిన్న సినిమాలకు అండగా ఉంటాం

'మయూఖ' సక్సెస్ మీట్‌లో చిన్న శ్రీశైలం యాదవ్

పాయల్ చెంగప్ప ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'మయూఖ'. ఈ చిత్రాన్ని ప్రశ్వీత ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై శశిధర్ నల్ల నిర్మించారు. శ్రీ తేజ్ ఎస్.కె. దర్శకత్వం వహించారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా 25 రోజుల సక్సెస్ సెలబ్రేషన్స్ హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూబిలీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ తండ్రి , కాంగ్రెస్ నేత వి. చిన్న శ్రీశైలం యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ కంటెంట్ బాగున్న చిన్న సినిమాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తూ వస్తున్నారు. మేము ఎన్నో ఏళ్లుగా చిన్న సినిమాలకు సపోర్ట్ గా నిలుస్తున్నాము. మయూఖ సినిమా 25 రోజుల వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. డైరెక్టర్ శ్రీతేజ్, ప్రొడ్యూసర్ శశిధర్ నాకు చాలాకాలంగా తెలుసు. మీ టీమ్ ఇలాగే మరిన్ని విజయాలు సాధించాలి. మీ టీమ్ కు ఏ సహాయం కావాలన్నా నా దగ్గరకు రావొచ్చు. చిన్న చిత్రాలకు ప్రభుత్వం తరుపున కూడా సపోర్ట్ అందేలా చేస్తాం అన్నారు. హీరోయిన్ పాయల్ చెంగప్ప మాట్లాడుతూ మా సినిమా 25 రోజుల సక్సెస్ సెలబ్రేషన్స్ జరుపుకోవడం సంతోషంగా ఉంది. మా మూవీ రిలీజ్ కు ముందే న్యూయార్క్ ఫిలిం ఫెస్టివల్ లో బెస్ట్ మిస్టరీ మూవీ అవార్డ్ గెల్చుకుంది. మా డైరెక్టర్ కు కూడా అవార్డ్స్ వచ్చాయి. మీ అందరి సపోర్ట్ వల్లే మేము ఈ విజయాన్ని అందుకోగలిగాం అన్నారు. అనంతరం చిన్న శ్రీశైలం యాదవ్ సినిమా సాంకేతిక నిపుణులకు, నటీనటులకు షీల్డ్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ డి.గిరీష్ రెడ్డి, నటులు రఘు వాసి రెడ్డి అభిలాష్ అడ్డ , దేవ్ డి, ప్రొడ్యూసర్ మహేంద్రనాథ్ కూండ్ల, వీ5 ఎండీ వెంకటేష్ , ప్రొడ్యూసర్ శశిధర్ నల్ల , డైరెక్టర్ శ్రీతేజ్ ఎస్. కె పాల్గొన్నారు.



'మిస్ కాళికా మిస్సింగ్' ట్రైలర్ విడుదల



జెఎస్ వి వి ఎంటర్ టైన్ మెంట్స్ , ఎస్ఎస్ ఆర్ట్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిస్ కాళికా మిస్సింగ్'. సత్య ధనేకుల దర్శకత్వంలో రామకృష్ణ, పదిమల యమున సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెలాఖరుకు ప్రేక్షకుల ముందుకు రానుంది . ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్ ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు రామకృష్ణ, యమునలు 'మిస్ కాళికా మిస్సింగ్' అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి..మా చిత్రం పూర్తి సస్పెన్స్ తో సాగే ఎంటర్టైన్మెంట్ చిత్రం. మునిపెన్నడు చూడని కథనం తో ఈ మూవీ చిత్రీకరణ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. మ్యూజిక్ పరంగా ఈ చిత్రం డెఫినెట్ గా మంచి మార్కులు తెచ్చుకుంటుంది .ఈ చిత్రాన్ని ఈ నెలాఖరుకు ప్రేక్షకులు ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాము అని అన్నారు . ఈ చిత్రంలో హీరో హీరోయిన్స్ గా వినీత్ చంద్ర, డాలీషా తో పాటు ఎస్తేర్,అజయ్ ఘోష్, బ్రహ్మాజీ ,ఆలీ ,జ్యోతి, నాగ మహేష్, గుండు సుదర్శన్ తదితరులు నటించిన ఈ చిత్రానికి ఛాయాగ్రహం :శివ దేవరకొండ, మ్యూజిక్ : లిండర్ లీ మార్టీ.

సమీకృత సేద్యంతో నిత్యాదాయం

- రైతులు యాసంగిలో చిరుధాన్యాలు, పశుగ్రాస పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- 'మురసు' తుఫానుతో పంట కోతలు వాయిదా వేసుకోవాలి
- రైతులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్: ఒకే పంటపై ఆధారపడకుండా పాడి, చేపలు, కోళ్ల పెంపకాన్ని వ్యవసాయంతో అనుసంధానించి సమీకృత సేద్యం చేపడితే రైతులకు నిత్యాదాయం సాధ్యమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో యాసంగిలో నీటి లభ్యతపై అనిశ్చితి ఉన్నందున తక్కువ నీటితో సాగయ్యే చిరుధాన్యాలు, పశుగ్రాస పంటలకు ప్రాధాన్యత ఇ వ్వాలని సూచించారు. మురసు తుఫాను నేపథ్యంలో పంట కోతలను తా త్కాలికంగా వాయిదా వేసుకోవాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం నిర్వహించిన రైతునేస్తం 113వ ఎపిసోడ్‌లో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డెపల్లికి చెందిన మాజీ సైనిక మేజర్, ప్రకృతి వ్యవసాయ రైతు నవీన్‌కుమార్ సమీకృత వ్యవసాయ విజయగాథను వివరించారు. 15 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో వరి, కూరగాయల సాగుతో పాటు పాడి పశువులు, నాటు కోళ్లు, చేపల పెంపకం, మునగ, నేపియర్ గడ్డి, బంతి పూల సాగు చేపడుతున్నట్లు తెలిపారు. వర్మీకంపోస్టు, జీవ ఎరువుల తయారీ, విక్రయంతో పాటు బయో రిసోర్స్ సెంటర్ ద్వారా ఇతర రైతులకు కూడా సహకరిస్తున్నట్లు వివరించారు. సైన్యంలో దేశానికి సేవలందించిన అనంతరం వ్యవసాయంలోనూ ఆదర్శంగా నిలుస్తున్న నవీన్‌కుమార్ ను మంత్రి అభినందించారు. రైతులు తమ భూమి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలు ఎంచుకోవాలని, డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని, రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు ముందస్తు సలహాలు అందించాలని ఆదేశించారు. తుఫాను ప్ర భావంతో పంట నష్టాలు జరగకుండా రైతులను అప్రమత్తం చేయాలన్నారు.రైతుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పురుగుమందులను శాస్త్రవేత్తల సూచనల మేరకే వినియోగించాలని, పిచికారీ సమయంలో రక్షణ పరికరాలు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ సందర్భంగా పురుగుమందుల వినియోగంపై రూపొందించిన భద్రతా చార్టును అందుబాటులోకి తెచ్చి, రైతు వేదికల్లో రక్షణ కిట్లు పంపిణీ చేశారు. యూపీఐ డిజిటల్ చెల్లింపులపైనా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను ఎప్పటికప్పుడు ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్,సమగ్ర శిక్ష సంచాలకులు ఇ. నవీన్ నికోలస్ ఆదేశించారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించిన విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు వివరాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. ఇకపై ప్రతి నెలకు సంబంధించిన హాజరు వివరాలను ఆ తర్వాతి నెల 1వ తేదీ నాటికి నమోదు చేయాలని మంగళవారం ఆదేశించారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రైవేటు పాఠశాలల హాజరు వివరాలను నిరంతరం కోరుతున్న నేపథ్యంలో ఈ ప్రక్రియ అత్యంత కీలకమన్నారు. ఈ విషయమై అక్టోబరు 21న ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశామని ఆయన గుర్తుచేశారు. జిల్లా విద్యాశాఖ అధికారులు (డిఈఓలు) తమ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో హాజరు నమోదు ప్రక్రియను సక్రమంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని, ఇందులో ఎలాంటి అలసత్వం లేదా జాప్యం జరిగినా తీవ్రంగా పరిగణిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రగతిని తల్లిదండ్రులు సులభంగా తెలుసుకునేందుకు వీలుగా సమ్మెటివ్ అసెసెమెంట్1 (ఎస్ఎ1) పరీక్షల ప్రగతి పత్రాలను (ప్రోగ్రెస్ కార్డులు) వాట్సాప్ ద్వారా పొందే సదుపాయం కల్పించామని వివరించారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. హాజరు నమోదు, ఫలితాల సమాచారం వంటి అంశాలకు యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నవీన్ నికోలస్ సూచించారు.

విబి జి రామ్ జి ఒకే రోజులో... 'ఐదు లక్షల' కూలీలకు ఉపాధి

ప్రజాపక్షం/హైదరాబాద్: విబి జి రామ్ జి పథకం అమలులో తెలంగాణ సరికొత్త రికార్డు సృష్టించింది. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నాటికి ఐదు లక్షలకుపైగా కూలీలకు ఒకే రోజు ఉపాధి కల్పించడం విశేషం. ఒకే రోజున పెద్ద సంఖ్యలో కూలీలకు పని కల్పించడం ఇదే తొలిసారి. ఈ రికార్డును కొనసాగిస్తూ, రానున్న రోజుల్లో మరిన్ని పనిదినాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్షం నీటిని ఒడిసిపట్టే పనులు, నీటి వనరుల అభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతం వంటి పనులను చేపట్టాలని స్పష్టం చేశారు. కూలీలకు ఉపాధి కల్పించడం, నీటి వనరులను సంరక్షించడం, గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే శాశ్వత ఆస్తులను సృష్టించడం అనే మూడు లక్ష్యాలతో ఉపాధి హామీ పనులు కొనసాగాలని సీతక్క ఆదేశించారు. ప్రతి గ్రామంలో స్థానిక అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి, కూలీలకు నిరంతరం పని లభించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ఉపాధి కల్పనతో గ్రామీణ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి కూడా దోహదపడేలా పనుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సీతక్క తెలిపారు.



బిఎస్ఎఫ్ జవాన్లపై దాడి

అగర్తల: త్రిపురలో ముగ్గురు బిఎస్ఎఫ్ జవాన్లపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. సోమవారం సెపాహిజల జి ల్లాలోని అశాబారి సరిహద్దు అవుట్ పోస్ట్ దగ్గర స్మగ్లింగ్ చేస్తున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని బిఎస్ఎఫ్ జవాన్లు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆగ్రహించిన కొందరు గ్రామస్తులు బిఎస్ఎఫ్ జవాన్లపై విచక్షణారహితంగా దాడికి చేయడమే కాకుండా ఆయుధాలు లాక్కునేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో ముగ్గురు బిఎస్ఎఫ్ జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. దాడికి పాల్పడినవారిలో ఆరుగురిని అరెస్టుచేసి, పలువురిని అదుపులోకి తీసుకొని కలంచౌరా పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పోలీస్ అధికారి తెలిపాడు.

నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

నకిలీ కరెన్సీ తయారు చేస్తున్నట్లు గుర్తించి, తయారీకి ఉపయోగిస్తున్న యంత్రాలు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మీడియాకు వెల్లడించారు.

1 నవంబర్ 2026న రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలోని ఎన్‌హెచ్65 రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పద కారును తనిఖీ చేసి మదుపోజు కర్ణాకర్, చిన్నోళ్ల మాణిక్య రెడ్డి, చెరుకుపల్లి రత్నాకర్ రెడ్డి, కరణం అజయ్ కుమార్‌లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.6.78 కోట్ల ముఖ విలువ కలిగిన నకిలీ రూ.500 నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.నిందితులను విచారించగా కుంట్లూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నకిలీ కరెన్సీ తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడైందన్నారు. అక్కడ తనిఖీలు నిర్వహించి ప్రింటర్లు,ల్యాప్‌టాప్,నోట్ల కటింగ్ యంత్రాలు,నకిలీ నోట్ల తయారీకి ఉపయోగించే ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.
ఇదే ముఠా నకిలీ పోలీస్ గుర్తింపు కార్డులు, వాకీటాకీలు, డమ్మీ పిస్టల్‌ను ఉపయోగిస్తూ పోలీసులుగా నటించి ప్రజలను బెదిరించి డబ్బులు దోచుకున్నట్లు విచారణలో వెల్లడైందని కమిషనర్ పేర్కొన్నారు.ఈ ముఠా వెనుక ఇంకా ఎవరెవరున్నారు? నకిలీ కరెన్సీ తయారీ, చలామణిలో మరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.
పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, మహేశ్వరం డిసిపి కె. నారాయణ రెడ్డి,ఇబ్రహీంపట్నం ఎసిపి కె.పి.వి.రాజు పర్యవేక్షణలో షాద్‌నగర్ ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ భూపాల్ (శ్రీధర్,అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. రాజు,వారి సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.





Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com